thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు
సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 323 కరీంనగర్ గురువారం, 29 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సిగరెట్లపై జీఎస్టీ 40 శాతానికి పెంపు!

న్యూఢిల్లీ : సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీని 40 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ఉత్పత్తులపై జీఎస్టీ ప్రస్తుతం 28% ఉంది. దీంతోపాటు కాంపెన్సేషన్ సెస్, ఇతర చార్జీలు కలిపి 53 శాతం దాకా అవుతున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కాంపెన్సేషన్ సెస్ గడువు 2026 మార్చి 31తో ముగుస్తుంది. అయినప్పటికీ మొత్తం పన్నుపై దీని ప్రభావం పడకుండా ఉండేందుకు జీఎస్టీని పెంచాలని భావిస్తోంది. కాగా, సిగరెట్లపై పన్ను 75%దాకా ఉండాలన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు కన్నా తక్కువే కానుంది. ఇదిలా ఉండగా.. కాంపెన్సేషన్ సెస్ స్థానంలో హెల్త్‌సెస్‌ను ప్రవేశపెట్టే యోచనలో కూడా కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

# మెజార్టీ సీట్లు మావే!

## అలాంటి వారికే టికెట్లు.. మునిసిపల్ అభ్యర్థులపై డిప్యూటీ సీఎం కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించినట్లే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ అందరి కంటే మెజారిటీ సీట్లు తమకే ఇవ్వబోతున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. విద్యా, ఆరోగ్యంతో పాటు నగరాల్లో మౌలికాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకుపోతున్నామని రాష్ట్రంలో దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న రేషన్ కార్డులను తాము అధికారంలోకి వచ్చాక ఇచ్చామని అన్నారు. తెలంగాణ ప్రగతి కోసం క్యూర్, ప్యూర్, రేర్ అనే త్రిముఖ వ్యూహంతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఇవాళ మీడియాతో మాట్లాడిన ఆయన.. అందరి ఏకాభిప్రాయంతో మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఈ బాధ్యతను సంబంధింత ఎమ్మెల్యేలు, మంత్రులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని రంగాలలో సమగ్రమైన అభివృద్ధి కోసం 'తెలంగాణ రైజింగ్ విజన్-2047' డాక్యుమెంట్ పేరుతో ప్రణాళికను విడుదల చేశామన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒకటి అర తప్ప మిగతావి అన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుల అంశం టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో నిర్ణయాలు జరుగుతాయన్నారు. ఆయన ఆయా పార్టీలతో చర్చించి పొత్తులపై తుది నిర్ణయం తీసుకుంటారన్నారు. ప్రజాభవన్‌లో మంత్రు భేటీపై స్పందిస్తూ మా మంత్రులు నాతో ప్రయాణం చేయకుంటే ఆ వార్తలు రాసే వారితో ప్రయాణం చేస్తారా అని ప్రశ్నించారు. ముఖ్యంత్రి ఊర్లో లేకు కాబట్టి పాలనపరమైన అంశంలో చర్చించేందుకే కలిశామన్నారు. ఈ విషయంలో కథనాలు రాసిన వారివి పిచ్చి భ్రమలు అన్నారు.

ఈ రాష్ట్రంలో సీ ఎం, డిప్యూటీ సీఎం, కేబినెట్ అంతా ఉమ్మడి కుటుంబంగా ఉందని మా అందరి సంక్షేమం రాష్ట్ర సంక్షేమంగా ముందుకు వెళ్తున్నామన్నారు. మున్సిపల్ ఎన్నికలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను నిరంతరం సంప్రదింపుల్లో ఉన్నామన్నారు. చేరికలపై స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ భావజాలాన్ని నమ్మి పార్టీ జెండాను భుజాన వేసుకుని తిరుగుతున్న వారంతా కాంగ్రెస్ పార్టీ వారేనని భట్టి విక్రమార్క అన్నారు. సాధ్యమైనంత వరకు నిబంధతతో పని చేసే వారికి న్యాయం చేసేందుకు పార్టీ ప్రయత్నిస్తుందన్నారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫైవ్ స్టార్ సౌకర్యాలు

## సంగారెడ్డిలో కొత్త సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు మంత్రి పొంగులేటి శంకుస్థాపన



సంగారెడ్డి, జనవరి 28: సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరు మండలం కర్దనూరులో నూతనంగా నిర్మించనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణ పనులకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వివేక్ వెంకట స్వామి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. భూమి సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ధరణి వ్యవస్థను మార్చి.. భూ భారతి వ్యవస్థను తీసుకొచ్చామని.. సామాన్య ప్రజలకు ఒక చుట్టం లాంటిదిగా భూ భారతిని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగంలో కోట్లాది రూపాయలు ఫీజులు చెల్లించే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని వివరించారు. అంతేకాకుండా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో 11 ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. పటాన్?చెరు ప్రాంతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కోసం 3 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వానికి అదనపు భారం పడకుండా సీఎస్?ఆర్ ఫండ్ ద్వారా ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు చెప్పారు. నిర్మాణ పనులను రాజ్ పుష్ప సంస్థకు అప్పగించినట్లు వివరించారు. రాబోయే 6 నెలల్లో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో అన్ని సౌకర్యాలతో ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. పెద్దపల్లిలోనూ రాజ్ పుష్ప సంస్థ.. భవన నిర్మాణాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ భవనాల మెయింటెనెన్స్‌ను ఐదేళ్ల పాటు సంబంధిత సంస్థలకే అప్పగించినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 ఏజెన్సీలను ఎంపిక చేసి ఈ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళున్నట్లు వెల్లడించారు. ఇక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫైవ్ స్టార్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. మ్యారేజ్ హాల్స్, చంటి పిల్లల కోసం ప్రత్యేక సౌకర్యాలు ఉండనున్నాయని చెప్పారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు లేకుండా భూధార్ వ్యవస్థను తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. ఒకే ప్లాట్?ఫాం ద్వారా భూమి సరిహద్దులు, వివరాలు అందుబాటులో ఉండనున్నాయని అన్నారు. నిషేధిత భూముల విషయంలో అనేక వివాదాలు ఉన్నాయని, ఈ సమస్యల పరిష్కారానికి రెండు నెలల్లో కొత్త యాప్?ను తీసుకువస్తున్నట్లు తెలిపారు. భూధార్ కార్డు.. భూమి సంబంధిత అన్ని సమస్యలకు సంపూర్ణ పరిష్కారం అని, దీని ద్వారా భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఉండవని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు నిర్మలా జగ్గారెడ్డి, ఫహీంలు పాల్గొన్నారు.




మహారాష్ట్ర రాజకీయాల్లో ఓ షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ అనంతరావు పవార్ ఇవాళ(జనవరి 28) పుణేలో చార్టర్డ్ విమానం కూలిపోవడంతో దుర్మరణం చెందారు. ఈ ఘటనలో ఆయనతోపాటు విమానంలో ఉన్న మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. ముంబై నుంచి బారామతి వెళ్తున్న ఈ ప్రైవేట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఉదయం 8:45 గంటల సమయంలో క్రాష్ అయినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అజిత్ పవార్ వయసు 66 సంవత్సరాలు.

**కుప్పకూలిన విమానం..** మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ప్రయాణిస్తోన్న విమానం బారామతిలో ల్యాండ్ అయ్యే సమయంలో కుప్పకూలినట్టు తెలుస్తోంది. కూలిన వెంటనే విమానం నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అజిత్ పవార్.. బారామతిలో బహిరంగ సభకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు సమాచారం. ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

**మొత్తం ఐదుగురు మృతి...** కూలిపోయి అగ్నికి ఆహుతైన విమానంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తోపాటు, మరో ఇద్దరు సిబ్బంది (ఒక పీఎస్ఓ, ఒక సహాయకుడు) మరో ఇద్దరు (పైలట్, కో-పైలట్) మొత్తం ఐదుగురు ఈ చార్టర్ విమానంలో ఉన్నారు.

ప్రాథమిక సమాచారం ప్రకారం, విమానంలో ఉన్న ఏ ఒక్కరూ ఈ ప్రమాదం నుండి ప్రాణాలతో బయటపడలేదని డీజీసీఏ (పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్) అధికారికంగా ప్రకటించింది.

**బలమైన నేత అజిత్ పవార్...** అజిత్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(NCP – అజిత్ పవార్ వర్గం) అధ్యక్షులు. మహారాష్ట్రలో అత్యధిక కాలం ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడు. 2024 డిసెంబరు 5 నుంచి దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా ఉన్న మహాయుతి ప్రభుత్వంలో ఏక్‌నాథ్ షిండేతో కలిసి డిప్యూటీ సీఎంగా పనిచేస్తున్నారు.

**ఘటనా స్థలం..** ప్రమాదం వార్త తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి రక్షణ సిబ్బంది, పోలీసులు, ఫైర్ సర్వీస్ బృందాలు చేరుకున్నాయి. డిప్యూటీ సీఎం విమాన ప్రమాదంలో చనిపోయారన్న వార్త తెలిసి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, మరో ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఇతర నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు ఈ దుర్ఘటనపై తీవ్ర ఆవేదన, దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాయి. ప్రజలు పెద్ద ఎత్తున ఘటనాస్థాలానికి చేరుకుంటున్నారు.

**తీరని లోటు...** బారామతి నియోజకవర్గం నుంచి బలమైన బేస్ ఉన్న అజిత్ పవార్.. శరద్ పవార్ అన్నయ్య కుమారుడు. రాజకీయంగా చాలా శక్తిమంతమైన వ్యక్తిగా ఎదిగారు. ఆయన మరణంతో మహారాష్ట్ర రాజకీయాల్లో భారీ లోటు ఏర్పడిందని పలువురు రాజకీయ ప్రముఖులు చెబుతున్నారు. పవార్ మృతితో.. NCP(అజిత్ వర్గం), మహాయుతి కూటమి, బారామతి ప్రాంతీయ రాజకీయాలపై తీవ్ర ప్రభావం పడనుంది.




మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ.. ప్రాథమిక వివరాలను వెల్లడించారు. ప్రమాదం జరిగిన సమయంలో బారామతి విమానాశ్రయంలో విజిబులిటీ తగ్గినట్లు తేలిందని మంత్రి తెలిపారు. ల్యాండింగ్ సమయంలో రన్‌వే స్పష్టంగా కనిపిస్తుందా లేదా అని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అధికారులు పైలట్లను ప్రశ్నించారని, రన్‌వే కనిపించడం లేదని వారు సమాధానం ఇచ్చినట్లు వెల్లడించారు. దీంతో భద్రతా కారణాల దృష్ట్యా విమానం కొంతసేపు గాల్లోనే చక్కర్లు కొట్టినట్లు ఆయన చెప్పారు. అనంతరం రెండోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించే సమయంలో మళ్లీ రన్‌వే కనిపిస్తుందా అని ఏటీసీ ప్రశ్నించగా, పైలట్లు సానుకూలంగా సమాధానం ఇచ్చారని, దాంతో ల్యాండింగ్‌కు అనుమతి ఇవ్వగా, ఆ క్షణాల్లోనే విమానం ప్రమాదానికి గురైందని తెలిపారు.

ఈ ఘటనపై అన్ని కోణాల్లో లోతైన విచారణ చేపడతామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. పూర్తి వివరాలు సేకరించిన తర్వాత వాస్తవాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. ఇప్పటికే డీజీసీఏతో పాటు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరోకి చెందిన ప్రత్యేక బృందాలు పుణెకు చేరుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇదే అంశంపై డీజీసీఏ వర్గాలు కూడా స్పందించాయి. ల్యాండింగ్ సమయంలో రన్‌వేను స్పష్టంగా గుర్తించడంలో పైలట్లకు ఇబ్బందులు ఎదురైనట్లు తెలిపాయి.

# అవినీతి కట్టడితో ప్రజాధనం సద్వినియోగం

## పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభ ప్రసంగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూ ఢిల్లీ, జనవరి 28: 2026 పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలి రోజైన ఇవాళ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభల్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి.. దేశం వికసిత్ భారత్ వైపు పయనిస్తోందని చెప్పారు. పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత పదేళ్లలో పేదల కోసం 4కోట్ల ఇళ్లు కట్టించామని, జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు. 'పదేళ్లలో 25కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. సామాజిక న్యాయం ప్రాతిపదికన కేంద్రం పనిచేస్తోంది. వందేభారత్, అమృత్ భారత్ రైళ్ల ద్వారా సేవలు విస్తరించాం. ప్రతి పౌరుడికి జీవిత బీమా కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. ఆయుష్మాన్ భారత్‌తో కోట్లమందికి వైద్యసేవలందిస్తున్నాం. వరి ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ నెం1 స్థానంలో నిలిచింది. అక్వా, పాల ఉత్పత్తుల్లో భారత్ ముందంజలో ఉంది' అని రాష్ట్రపతి వెల్లడించారు. దేశంలో స్పేస్ టూరిజం అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయని రాష్ట్రపతి అన్నారు. భవిష్యత్‌లో అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని, జమ్మూకశ్మీర్‌లో అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మించామని గుర్తు చేశారు. గత 11 ఏళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందిందని రాష్ట్రపతి చెప్పారు. ఇంకా రాష్ట్రపతి తన ప్రసంగంలో ఏమన్నారంటే.. 'అవినీతి కట్టడితో ప్రభుత్వ ప్రజా ధనాన్ని సద్వినియోగం చేస్తోంది. GST స్లాబ్‌ల తగ్గింపుతో దేశ ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. యూరోపియన్ యూనియన్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చేసుకున్నాం. రూ.12లక్షల వార్షిక ఆదాయం వరకు ఆదాయపు పన్ను లేకుండా చేశాం.

స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల్లోనూ భారత్ దూసుకెళ్తోంది. భారత్ పవర్ టెక్నాలజీ హబ్‌గా రూపొందుతోంది. గ్రీన్ ఎనర్జీ రంగంలో భారత్‌ను పవర్ హౌస్‌గా తయారు చేస్తున్నాం. భవిష్యత్‌లో 100 గిగావాట్ల న్యూక్లియర్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యం. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి చర్యలు. వికసిత్ భారత్‌లో రైతుకు అధిక ప్రాధాన్యత' ఉంటుందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. 'గ్రామీణ ఉపాధి కల్పన కోసం జీ రామ్? జీ చట్టం తీసుకొచ్చాం. దేశాభివృద్ధిలో మహిళలకు కీలక పాత్ర కల్పించాం. ఆపరేషన్ సిందూర్.. మన సైనికుల సత్తా చాటింది. భారత్‌పై దాడిచేస్తే ఏం జరుగుతుందో ప్రపంచం చూసింది. రక్షణరంగ ఉత్పత్తుల ఎగుమతి రికార్డు స్థాయిలో పెరిగింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ డిఫెన్స్ ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది. నానో చిప్‌ల తయారీపైనా భారత్ దృష్టి సారించింది. మైక్రో చిప్‌ల తయారీలో స్వయంసమృద్ధి సాధించాలి. ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో 15లక్షల ఉద్యోగాలు సృష్టించగలిగాం. ముద్ర యోజన ద్వారా చిరువ్యాపారులకు భారీగా రుణాలు'. వంటి ఎన్నో ప్రభుత్వ కార్యక్రమాల్ని రాష్ట్రపతి తన ప్రసంగంలో వెల్లడించారు. పీఎం విశ్వకర్మ యోజనతో 20లక్షల మందికి శిక్షణ ఇస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు.







## హైదరాబాద్‌లో ఆకట్టుకున్న లోహ విహంగ విన్యాసాలు

హైదరాబాద్ : బేగంపేట విమానాశ్రయంలో వింగ్స్ ఇండియా ప్రదర్శన ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. పౌరవిమానయాన శాఖ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహిస్తున్నారు. ఈనెల 31 వరకు ఇది కొనసాగనుంది. వివిధ దేశాలు, సంస్థలకు చెందిన విభిన్న రకాల విమానాలు, హెలికాప్టర్లు, పోర్టబుల్ ఫ్లయిట్లు, వాణిజ్య విమానాలు వైమానిక ప్రదర్శనలో చేస్తున్న విన్యాసాలు ఆకట్టుకుంటున్నాయి.




దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర... మేడారం. రెండేళ్లకోసారి కోలాహలంగా జరిగే ఈ మహా జాతర బుధవారం ప్రారంభమైంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో మేడారంలోని రహదారులన్నీ రద్దీగా మారాయి. మేడారం భక్తజన సంద్రంగా మారింది. మేడారం మహా జాతర తెలంగాణ సంస్కృతి, గిరిజన సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. మేడారంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి, వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్నారు భక్తులు. జనాల గుడారాలతో మేడారం కిటకిటలాడుతోంది. భక్తులు బెల్లం(బంగారం) సమర్పిస్తూ ఆచారాలు పాటిస్తున్నారు. మహాజాతరకు ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా. ప్రభుత్వం తాజాగా గద్దెలను పునర్నిర్మాణం చేసింది. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రవాణా, నీరు, వైద్యం, భద్రతా ఏర్పాట్లు చేశారు అధికారులు.



## ఎమ్మెల్యే దానం అనర్హత పిటిషన్‌పై 30న స్పీకర్ విచారణ


హైదరాబాద్: ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై ఈ నెల 30న విచారణ జరగనుంది. విచారణ షెడ్యూల్‌ను స్పీకర్ ప్రసాద్ కుమార్ ఇచ్చారు. విచారణకు హాజరుకావాలని దానం నాగేందర్‌కు స్పీకర్ నోటీసులు జారీ చేశారు.

విచారణకు హాజరు కావాలని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, న్యాయవాదులకు స్పీకర్ నోటీసులు ఇచ్చారు. భాజపాఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పైనా అదే రోజు విచారణ జరగనుంది. పిటిషనర్ల తరఫున సాక్ష్యాలు స్పీకర్ నమోదు చేయనున్నారు.

## అనర్హత పిటిషన్‌ను కొట్టివేయాలి: స్పీకర్‌కు దానం నాగేందర్ వినతి

హైదరాబాద్ : బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అఫిడవిట్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న పిటిషన్‌ను కొట్టి వేయాలని స్పీకర్‌కు విన్నవించారు. "నేను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదు. పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు నాకు సమాచారం లేదు. నేను 2024 మార్చిలో కాంగ్రెస్ సమావేశానికి వెళ్లాను.

ఆ సమావేశానికి వ్యక్తిగత హోదాలో వెళ్లాను. మీడియా కథనాల ఆధారంగా నేను పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావిస్తోంది. ఆ పార్టీ అనర్హత పిటిషన్‌లోని అంశాలపై మాత్రమే వివరణ ఇస్తున్నాను. గతంలో కోర్టు తీర్పులను అనుసరించి ఆ అనర్హత పిటిషన్ చెల్లుబాటు కాదు. అనర్హత పిటిషన్ తర్వాత పరిణామాలను అనుబంధ సమాచారంగా అంగీకరించవద్దు" అని దానం నాగేందర్? కోరారు.



ఈ నెల 30న విచారణకు రావాలని దానం నాగేందర్‌కు స్పీకర్ ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

## అజిత్ పవార్ మరణం మహారాష్ట్ర రాజకీయాలకు తీరని లోటు: కేసీఆర్

హైదరాబాద్, జనవరి 28: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ నాయకుడు అజిత్ పవార్ బుధవారం ఉదయం బారామతి వద్ద జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మృతి చెందారు. ఆయన మృతిపట్ల ప్రధాని మోదీ సహా కేంద్రమంత్రులు, ప్రముఖ నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, మంత్రి సీతక్క, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మాజీ మంత్రి కేటీఆర్ తదితరులు పవార్ మృతికి సంతాపం తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

**కేసీఆర్ సంతాపం..** అజిత్ పవార్ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. రైతు ఉద్యమ నేతగా తన ప్రజా జీవితాన్ని ప్రారంభించి, మహారాష్ట్ర రాజకీయాల్లో సీనియర్ రాజకీయ నేతగా ఎదిగి, పలు హోదాల్లో పనిచేసిన పవార్ మరణం ఆ రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటు అన్నారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**మంత్రి సీతక్క దిగ్భ్రాంతి...** అజిత్ పవార్ అకాల మరణం పట్ల మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం మహారాష్ట్ర రాజకీయాలకు, ప్రజా జీవితానికి తీరని నష్టమని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఈ విషాద సమయంలో పవార్ కుటుంబ సభ్యులకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు ప్రగాఢ సానుభూతి తెలిపారామె. వారి ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబానికి దుఃఖాన్ని తట్టుకునే శక్తి ఇవ్వాలని మంత్రి సీతక్క భగవంతుణ్ని ప్రార్థించారు.




**టీపీసీసీ చీఫ్ సంతాపం...** అజిత్ పవార్ చనిపోవడం పట్ల టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మహారాష్ట్ర రాజకీయాల్లో గొప్ప నాయకుడిగా ఎదిగిన వ్యక్తి అజిత్ పవార్ అని, ఆయన మరణం రాష్ట్ర రాజకీయాల్లో తీరని లోటు అని అన్నారు. అజిత్ మృతిపట్ల తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అజిత్ పవార్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నానని ఆయన అన్నారు.

**షాక్‌కు గురయ్యా: కేటీఆర్...** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం తెలియజేశారు. అజిత్ పవార్ మరణ వార్త విని షాక్?కు గురైనట్లు తెలిపారు. అజిత్ పవార్ మృతి ఆ రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటు అని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి కేటీఆర్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.







## ఆ సంస్థలు హెచ్-1బీ వీసాల జారీని ఆపాలి: టెక్సాస్ గవర్నర్ కీలక ఆదేశాలు


అమెరికాలోని టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబాట్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కొత్త హెచ్-1బీ వీసా దరఖాస్తులను వెంటనే నిలిపివేయాలని రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర ఏజెన్సీలకు ఆదేశాలు జారీ చేశారు. 2027 మే 31 వరకు ఇది అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. హెచ్-1బీ వీసా కార్యక్రమం దుర్వినియోగం అవుతోందని అబాట్ ఆరోపించారు. అమెరికన్ ఉద్యోగాలు దేశ కార్మికులకే దక్కాలని ఆయన వ్యాఖ్యానించారు. 'హెచ్-1బీ వీసా కార్యక్రమం దుర్వినియోగం అయ్యిందని ఇటీవల నివేదికలు అందాయి. అమెరికన్ ఉద్యోగాలు.. దేశ ప్రజలకే వెళ్తున్నాయని నిర్ధరించుకునేందుకు దీనిపై సమీక్ష జరగనుంది. ఈ క్రమంలో కొత్త వీసా పిటిషన్లను వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర ఏజెన్సీలను ఆదేశిస్తున్నా' అని అబాట్ ఏజెన్సీలకు రాసిన లేఖలో పేర్కొన్నారు. టెక్సాస్? కార్మికులు, ఉద్యోగుల ప్రయోజనం కోసం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పనిచేయాలని అబాట్? పిలుపునిచ్చారు. ముఖ్యంగా పన్ను చెల్లింపుదారులతో కూడిన ఉద్యోగ నియామకాల్లో రాష్ట్రం ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన అమెరికన్ కార్మికులను నియమించుకునే అవకాశం ఉన్నప్పటికీ.. విదేశీ ఉద్యోగులను నియమించుకొని కొందరు ఈ వీసా కార్యక్రమాన్ని దుర్వినియోగం చేశారని అబాట్ ఆరోపించారు. కొన్ని సందర్భాల్లో అమెరికన్ కార్మికులను తొలగించి మరీ తక్కువ వేతనాలు తీసుకునే హెచ్-1బీ ఉద్యోగులను యజమానులు నియమించుకున్నారని పేర్కొన్నారు.

**ట్రంప్ వలస విధానాలపై అసంతృప్తి...** కాలిఫోర్నియా తర్వాత అమెరికాలో అత్యధిక హెచ్-1బీ హోల్డర్లు ఉన్న రాష్ట్రం టెక్సాస్. యూఎస్ సిటిజన్‌షిప్ అండ్? ఇమిగ్రేషన్ సర్వీసెస్ డేటా ప్రకారం.. 2025లో 6,100 మంది యజమానుల వద్ద ఉద్యోగం చేసేందుకు 40వేల మందికి పైగా హెచ్-1బీ వీసాలు మంజూరయ్యాయి. టెక్సాస్ ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో దాదాపు 1200 మంది పనిచేస్తున్నారు.




వికారాబాద్ : వికారాబాద్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ప్రియుడి మోజులో పడి తల్లిదండ్రులకు కుమార్తె విషం ఇంజక్షన్ ఇచ్చి హతమార్చింది. అప్పుల బాధతో భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకుని ఉంటారని తొలుత భావించినా.. పోలీసుల విచారణలో కుమార్తె బండారం బట్టబయలైంది.

వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బంట్వారం మండలం యాచారం గ్రామానికి చెందిన దశరథ్, లక్ష్మిలకు ఓ కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చిన్నకుమార్తె సురేఖ.. సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. అక్కడ ఓ యువకుడితో ప్రేమలో పడింది. తల్లిదండ్రులు వారి ప్రేమకు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలోనే మరో యువకుడితో సురేఖకు పెళ్లిచూపులు ఏర్పాటు చేశారు. పెళ్లిచూపుల నుంచి ఎలాగైనా తప్పించుకోవాలని భావించిన యువతి.. మోకాళ్ల నొప్పులకు అని చెప్పి తల్లిదండ్రులకు ఆదివారం వేర్వేరుగా విషం ఇంజక్షన్? ఇచ్చింది. వారు చనిపోయాక ఇద్దరినీ ఇంట్లో ఒకే చోట పడుకోబెట్టింది. అనంతరం ఏమీ తెలియనట్లు సోదరుడు అశోక్?కు ఫోన్ చేసి తల్లిదండ్రులు స్పృహ తప్పి పడిపోయారని చెప్పింది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో కుమార్తె సురేఖే వారిని చంపినట్లు నిర్ధారణ అయింది. నిందితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.




వీపనగండ్ల: అమెరికాలో తెలంగాణకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గుండెపోటుతో మృతిచెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామానికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి (45) ఫ్లోరిడాలో నివాసముంటున్నారు. ఓ ఐటీ సంస్థలో ఆయన పనిచేస్తున్నారు. వర్క్ ఫ్రం హోం చేస్తుండగా మంగళవారం అర్ధరాత్రి (భారత కాలమాన ప్రకారం) గుండెపోటు వచ్చింది. దీంతో హర్షవర్ధన్ మృతిచెందారు. గత పదేళ్లుగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఆయనకు.. భార్య, కుమారుడు ఉన్నారు. హర్షవర్ధన్ తండ్రి సుదర్శన్‌రెడ్డి బొల్లారం సర్పంచ్‌గా ఉన్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## అజిత్ పవార్.. ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేశారు: కిషన్‌రెడ్డి



ఢిల్లీ, జనవరి 28 : మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దాదాపు నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎంతో ఖ్యాతి గడించారని కీర్తించారు. అజిత్ పవార్ తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేశారన్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి, రాజకీయాల్లో రాణిస్తూ.. డిప్యూటీ సీఎం స్థాయికి అజిత్ పవార్ ఎదిగారని కీర్తించారు. మహారాష్ట్రకు సుదీర్ఘకాలం డిప్యూటీ సీఎంగా పనిచేశారని కొనియాడారు. మహారాష్ట్ర గ్రామీణ ప్రాంతాల్లో మరీ ముఖ్యంగా పశ్చిమ మహారాష్ట్ర ప్రాంతంపై పట్టు సాధించి.. తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారని కిషన్?రెడ్డి పేర్కొన్నారు.

**అజిత్ పవార్ మృతిపై రామచందర్ రావు దిగ్భ్రాంతి....** మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతిపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించారని తెలిసి చాలా బాధపడుతున్నానని అన్నారు. పవార్ లాంటి మంచి నాయకుడిని కోల్పోవడం తీరని లోటని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

## పిల్లర్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి

ఘట్‌కేసర్ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మేడ్చల్ జిల్లా ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ వంతెన పిల్లర్ నంబర్ 97 వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో కారులో 8 మంది విద్యార్థులు ఉన్నారు. మౌలాలి నుంచి పోచారం వెళ్తుండగా కారును అతివేగంగా నడుపుతూ పిల్లర్?ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. మృతులను సాయివరుణ్ (23), నిఖిల్ (22)గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన వెంకట్, రాకేశ్‌ను సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన విద్యార్థులు యశ్వంత్, సాత్విక్, హర్షవర్ధన్, అభినవ్ సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చురకలు







అమరావతి: వెలిగొండ పనులు పూర్తి కాకుండానే అప్పట్లో జగన్ ప్రారంభించారని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పోలీసుల పహారా మధ్య జాతికి అంకితం చేశారన్నారు.

నిర్వాసితులను అడ్డుకుని మరీ వెలిగొండను జగన్ ప్రారంభించారని తెలిపారు. అప్పటి పరిస్థితులు చూసిన ఎవరికైనా వెలిగొండ పూర్తి కాలేదని అర్థమైందన్నారు. ఈ ఏడాదిలోగా వెలిగొండ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టులో ప్రస్తుతం జరుగుతున్న పనులపై మంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. "వెలిగొండ నిర్మాణం పూర్తి అయిపోయిందని.. జగన్ ఆ ప్రాజెక్టును ఎప్పుడో జాతికి అంకితం చేశారంటూ వైకాపా నేతలు కామెంట్లు చేస్తున్నారు.

ప్రాజెక్టులో ఇంకా వేల కోట్ల రూపాయల పనులు పెండింగులో ఉన్నాయి. వాటిని కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తోంది" అని ఫొటోలు, వీడియోలతో మంత్రి వెల్లడించారు.

## మహాపాపం చేసి కూడా బుకాయించుకోవడం జగన్‌కే చెల్లింది: మంత్రి లోకేశ్



అమరావతి: తిరుమల లడ్డూ విషయంలో మహాపాపం చేసి కూడా బుకాయించుకోవడం వైకాపా అధినేత జగన్‌కే చెల్లిందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. కల్తీ జరిగిందని నిర్ధరణ అయ్యాక కూడా నివేదికను వక్రీకరిస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. "పాలే లేని కల్తీ నెయ్యి సృష్టించి దేవుడి ప్రసాదాన్ని అపవిత్రం చేయడం క్షమించరాని నేరం. వందల కోట్ల కుంభకోణానికి పాల్పడటమే కాకుండా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. వైకాపా కుట్రలను దీటుగా తిప్పికొట్టడంతోపాటు వారి వ్యవహారాన్ని ప్రజల్లోనే ఎండగడదాం" అని లోకేశ్ అన్నారు.




అమరావతి: రైల్వేకోడూరు ఎమ్మెల్యే అంశంలో జనసేన పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై ఓ మహిళ ఆరోపణలు చేసిన నేపథ్యంలో విచారణకు ముగ్గురు సభ్యులతో కమిటీని నియమించింది. దీనిలో టి.శివశంకర్, తంబళ్లపల్లి రమాదేవి, టి.సి.వరుణ్ ఉన్నారు. ప్రసార మాధ్యమాల్లో వచ్చిన వార్తలపై విచారణ చేయాలని కమిటీని పార్టీ ఆదేశించింది.

ఈ కమిటీ ముందు ఏడు రోజుల్లోపు ఎమ్మెల్యే శ్రీధర్ హాజరై వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది.

కమిటీ నివేదిక వెల్లడయ్యే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యేను ఆదేశించింది.

## 'వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేశ్ దంపతులతో ప్రాణహాని'



గుంటూరు: వైకాపాకు చెందిన మాజీ ఎంపీ నందిగం సురేశ్ దంపతులతో ప్రాణహాని ఉందంటూ ఉద్ధండరాయునిపాలేనికి చెందిన ప్రాతూరి జగదీశ్ అనే వ్యక్తి ఆరోపించారు. తనతో పాటు తన కుటుంబానికి ప్రమాదం పొంచి ఉందంటూ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన డబ్బు తిరిగివ్వాలని అడిగినందుకు సురేశ్ వేధిస్తున్నారన్నారు. అతడి అనుచరులు కార్లతో వెంబడిస్తూ భౌతికదాడులకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తాను చనిపోతే దీన్ని మరణ వాంగ్మూలంగా భావించాలని జగదీశ్ పేర్కొన్నారు.




## అజిత్ పవార్ మృతిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ తీవ్ర దిగ్భ్రాంతి

అమరావతి, జనవరి28 : మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్(66) విమాన ప్రమాదంలో దుర్మరణం చెందడం దేశ రాజకీయాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతగా ఉన్న అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం బుధవారం ఉదయం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో అజిత్ పవార్ సహా మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘోర ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా అజిత్ పవార్ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.

**అజిత్ పవార్ మృతిపై సీఎం చంద్రబాబు సంతాపం..** 'ఈరోజు ఉదయం విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ హఠాత్తుగా మరణించడం నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. తీవ్ర బాధకు గురిచేసింది. ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, అనుచరులకు నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను' అని సీఎం చంద్రబాబు అందులో పేర్కొన్నారు.

**అజిత్ పవార్ మృతిపై కేబినెట్ సంతాపం..** విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతిపై ఏపీ కేబినెట్ సంతాపం వ్యక్తం చేసింది. మంత్రి మండలి సమావేశం ప్రారంభ సమయంలో అజిత్ పవార్ విమాన ప్రమాద ఘటనను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తావించారు. ప్రమాదంలో అజిత్ పవార్‌తో సహా ఐదుగురు చనిపోవడంపై విచారం వ్యక్తం చేశారు. అజిత్ పవార్?తో తనకు ఉన్న పరిచయాన్ని సీఎం గుర్తు చేసుకున్నారు. ముంబై నుంచి బారామతి వెళ్తుండగా జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణంతో దిగ్భ్రాంతికి లోనయ్యానని తెలిపారు. మహారాష్ట్ర రాజకీయాల్లో అజిత్ పవార్ మృతి తీరని లోటని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**అజిత్ పవార్ మృతిపై పవన్ కల్యాణ్ సంతాపం..** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్‌సీపీ అధ్యక్షుడు, ఎన్‌డీఏ కూటమి నాయకులైన అజిత్ దాదా పవార్ ఈరోజు జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మరణించారనే విషాద వార్త విని తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం సోషల్ మీడియా వేదికగా అజిత్ పవార్ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆయన చేసిన అంకితభావంతో కూడిన ప్రజాసేవ, మహారాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధికి అందించిన అపారమైన సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. ప్రజల పట్ల అజిత్ పవార్?కున్న నిరంతర నిబద్ధతను గౌరవంతో స్మరించుకుంటారని తెలిపారు. ఆయన మరణం పట్ల నేను ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నానని అన్నారు. ఈ తీవ్ర దు:ఖ సమయంలో అజిత్ పవార్? కుటుంబ సభ్యులకు, అభిమానులకు, పార్టీ కార్యకర్తలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

**అజిత్ పవార్ మృతిపై పీవీఎన్ మాధవ్ విచారం..** అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి చెందడంపై ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హృదయ విదారక ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో మృతుల కుటుంబాలకు తన హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. మృతుల కుటుంబాలకు భగవంతుడు ధైర్యం చేకూర్చాలని ఆకాంక్షించారు.

**అజిత్ పవార్ మృతికి రామ్మోహన్ సంతాపం..** అజిత్ పవార్ మృతికి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ దుర్మరణం చెందడం అత్యంత విషాదకరమని తెలిపారు.

ఈ ఘటనతో ఆయన కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు, అలాగే ఈ నష్టంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక సానుభూతి వ్యక్తం చేశారు. ప్రజాజీవితంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలవాలని, ఈ కఠిన సమయంలో శోకతప్తులైన కుటుంబానికి, అభిమానులకు ధైర్యం, బలం కలగాలని రామ్మోహన్ నాయుడు ఆకాంక్షించారు.

**రాజకీయాల్లో కీలక నేత పవార్..** మహారాష్ట్ర రాజకీయాల్లో అజిత్ పవార్ అత్యంత ప్రభావవంతమైన నేత. అనేక పర్యాయాలు ఉప ముఖ్యమంత్రిగా, మంత్రిగా పనిచేశారు. మహారాష్ట్ర రాష్ట్ర అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. ఈ విషాద వార్త నేపథ్యంలో మహారాష్ట్రలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.




## సంజయ్ గాంధీ నుంచి అజిత్ పవార్ వరకు..

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ బుధవారం ఉదయం బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో మరణించారు. ఉదయం 8:45 గంటల ప్రాంతంలో పవార్, అతని బృందం ప్రయాణిస్తున్న విమానం బారామతిలో అత్యవసరంగా ల్యాండ్ కావడానికి ప్రయత్నించినప్పుడు ఈ ప్రమాదం జరిగింది. ఇంతకు ముందు కూడా పలువురు రాజకీయ నాయకులు విమాన, హెలికాప్టర్ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. వారిని మరోసారి తలుచుకుందాం..

**విజయ్ రూపానీ – 2025...** గతేడాది అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా విమానం కూలిపోయిన ఘటనలో మరణించిన వారిలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా ఉన్నారు. 68 ఏళ్ల రూపానీ యూకేలోని తన కుటుంబాన్ని కలవడం కోసం ఆ విమానం ఎక్కారు.

**దోర్జీ ఖండు – 2011...** అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి దోర్జీ ఖండు ఏప్రిల్ 30, 2011న హెలికాప్టర్ కూలిపోవడంతో మరణించారు. చైనా సరిహద్దుకు సమీపంలోని మారుమూల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ఐదు రోజుల తర్వాత శిథిలాలను గుర్తించారు.

**వై.ఎస్. రాజశేఖర రెడ్డి – 2009...** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి సెప్టెంబర్ 2, 2009న నల్లమల కొండలలో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. విస్తృతంగా గాలించడంతో ఒకరోజు తర్వాత ఆయన మృతదేహం లభ్యమైంది.

**జిందాల్, సురేందర్ సింగ్ – 2005...** పారిశ్రామికవేత్త, హర్యానా విద్యుత్ మంత్రి ఓపీ జిందాల్, మాజీ రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ కుమారుడు, మాజీ కేంద్ర మంత్రి సురేందర్ సింగ్ మార్చి 31, 2005న ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు.

**సిప్రియన్ సంగ్మా – 2004..** మేఘాలయ గ్రామీణాభివృద్ధి మంత్రి సిప్రియన్ సంగ్మా 2004లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. 2004, సెప్టెంబర్ 22న గౌహతి నుంచి షిల్లాంగ్ వెళ్తున్న హెలికాప్టర్ బారపాణి సరస్సు సమీపంలో కూలిపోయింది. ఈ ప్రమాదంలో సంగ్మాతో పాటు మరో తొమ్మిది మంది మరణించారు.

**జీఎంసీ బాలయోగి – 2002...** లోక్?సభ స్పీకర్, టీడీపీ నాయకుడు జీఎంసీ బాలయోగి మార్చి 3, 2002న ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాలో హెలికాప్టర్ కూలిపోవడంతో మరణించారు.

యాంత్రిక లోపం కారణంగానే ఈ ప్రమాదం సంభవించిందని అధికారులు తేల్చారు.

**మాధవరావు సింధియా – 2001...** గ్వాలియర్ రాజ కుటుంబ సభ్యుడు, ప్రముఖ జాతీయ నాయకుడు మాధవరావు సింధియా సెప్టెంబర్ 30, 2001న ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి జిల్లాలో తన చార్టర్డ్ విమానం కూలిపోవడంతో మరణించారు. కాన్పూర్?లో ఒక ర్యాలీలో ప్రసంగించడానికి ఆయన వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

**సంజయ్ గాంధీ – 1980...** ఇందిరా గాంధీ కుమారుడు, జాతీయ రాజకీయాల్లో కీలక నాయకుడిగా చెలామణి అయిన సంజయ్ గాంధీ జూన్ 23, 1980న తాను నడుపుతున్న రెండు సీట్ల విమానం కూలిపోవడంతో మరణించారు. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ విమానాశ్రయం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది.

**గుర్నామ్ సింగ్ – 1973..** పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి గుర్నామ్ సింగ్ మే 31, 1973న ఢిల్లీలో జరిగిన విమాన ప్రమాదంలో మరణించారు.

**బల్వంత్ రాయ్ మెహతా – 1965...** గుజరాత్ రెండో ముఖ్యమంత్రి అయిన బల్వంత్ రాయ్ మెహతా 1965 ఇండో–పాకిస్థాన్ యుద్ధ సమయంలో మరణించారు. సరిహద్దు సమీపంలో ఆయన ప్రయాణిస్తున్న పౌర విమానాన్ని పాక్ వైమానిక దళం పొరపాటున యుద్ధ విమానంగా భావించి పేల్చేసింది.




మహారాష్ట్ర రాజకీయాల్లో నాటకీయ పరిణామాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన అజిత్ పవార్ తన అనూహ్య నిర్ణయాలతో ఎన్నోసార్లు వార్తల్లో నిలిచారు. నలుగురు ముఖ్యమంత్రుల వద్ద రాష్ట్రానికి ఆరుసార్లు డిప్యూటీ సీఎంగా సేవలందించారు. ముఖ్యమంత్రి కల తీరకుండానే ఇప్పుడు అనుకోని విమాన ప్రమాదంలో హఠాన్మరణం చెందారు. ఈ సందర్భంగా అజిత్ పవార్ రాజకీయ ప్రస్థానాన్ని ఓసారి గుర్తుచేసుకుంటే..

**బాబాయి బాటలో రాజకీయాల్లోకి..** ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ పెద్దన్న అనంత్‌రావు కుమారుడే అజిత్ పవార్. 23 ఏళ్ల వయసులోనే (1982లో) చక్కెర సహకార బోర్డు సభ్యుడిగా రాజకీయ రంగప్రవేశం చేశారు. 1991లో పుణె జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్‌గా ఎన్నికైన ఆయన అనేక సంవత్సరాలపాటు ఆ పదవిలో కొనసాగారు. అదే ఏడాది బారామతి నుంచి ఎంపీగా గెలిచినప్పటికీ.. శరద్ పవార్ కోసం దాన్ని త్యాగం చేశారు. దీంతో అదే స్థానం నుంచి గెలుపొందిన శరద్ పవార్.. పీవీ నరసింహారావు ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా పనిచేసేందుకు దోహదం చేసింది. 1991లో అసెంబ్లీలో అడుగుపెట్టిన అజిత్.. రాష్ట్రానికే పరిమితమై ఇప్పటివరకు ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి రికార్డు సృష్టించారు.

**ధిక్కరించి.. చీలిపోయి..** తొలుత కాంగ్రెస్‌లో ఉన్న శరద్ పవార్.. ఆ తర్వాత నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని స్థాపించగా అజిత్ ఆయన బాటలోనే నడిచారు. ఎన్సీపీలో కీలక నేతగా ఎదిగిన అజిత్ పవార్.. జాతీయ రాజకీయాల్లో ఆరితేరిన శరద్? పవార్ వద్ద పలుమార్లు ధిక్కార స్వరాన్ని వినిపించారు. 2004లో ఎన్సీపీ పార్టీకి మెజార్టీ సీట్లు వచ్చినప్పటికీ సీఎం పదవిని శరద్ పవార్ తమ మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు ఇవ్వడాన్ని అజిత్ బహిరంగంగా వ్యతిరేకించారు. అనంతరం 2019 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత చిన్నాన్నతో విభేదించి.. భాజపాతో చేతులు కలిపారు. అయితే, కొన్ని గంటలకే దేవేంద్ర ఫడణవీస్ నేతృత్వంలోని ప్రభుత్వం కుప్పకూలడంతో మళ్లీ శరద్ పవార్ వద్దకే చేరుకున్నారు. అనంతరం ఉద్ధవ్‌ఠాక్రే నేతృత్వంలోని మహావికాస్ అఘాడీ కూటమిలో పని చేశారు. అయితే, మహావికాస్ అఘాడీ కూటమి ప్రభుత్వం 2022లో కూలిపోయిన అనంతరం అజిత్ పవార్ మరోసారి అధినేతపై తిరుగుబాటు అస్త్రాన్ని ప్రయోగించారు. దీంతో ఎన్సీపీ రెండు ముక్కలుగా చీలిపోయింది. అనంతరం అజిత్ పవార్ వర్గం మళ్లీ భాజపాతో చేతులు కలిపింది. అప్పటినుంచి మహాయుతి కూటమిలో మిత్రపక్షంగా కొనసాగుతున్నారు. ఇటీవల మహారాష్ట్ర స్థానిక ఎన్నికల్లో పుణెలో గెలుపు కోసం పవార్ కుటుంబాలు మళ్లీ కలిశాయి. ఆ ఎన్నికల్లో కలిసి పోటీ చేసినప్పటికీ.. పెద్దగా ఫలితం లభించలేదు.

**నలుగురు సీఎంల వద్ద 'డిప్యూటీ'గా..** అజిత్ పవార్ తొలిసారి 2010లో ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చవాన్ సీఎంగా ఉన్నారు. ఆ తర్వాత చవాన్ హయాంలోనే 2012లో రెండోసారి డిప్యూటీ సీఎంగా పనిచేశారు. 2019లో భాజపా నేత దేవేంద్ర ఫడణవీస్ ప్రభుత్వంలో మరోసారి ఉప ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ఫడణవీస్? ప్రభుత్వానికి మెజార్టీ లేకపోవడంతో కేవలం 80 గంటల పాటు అజిత్ ఈ పదవిలో ఉన్నారు. అదే ఏడాది ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలో ఏర్పాటైన మహా వికాస్ అఘాడీ సంకీర్ణ ప్రభుత్వంలో అజిత్ పవార్‌కు మళ్లీ ఉప ముఖ్యమంత్రి పదవి దక్కింది.

ఈ ప్రభుత్వం రెండున్నరేళ్లకే కూలిపోయింది. అనంతరం శరద్ పవార్ నుంచి విడిపోయి మహాయుతి కూటమితో చేతులు కలిపారు. దీంతో 2022లో ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలో ఏర్పాటైన ప్రభుత్వంలో అజిత్ డిప్యూటీగా పనిచేశారు. ఇక, 2024లో జరిగిన ఎన్నికల్లో మహాయుతి కూటమి విజయం సాధించింది. ఆ సమయంలో అజిత్ పవార్ సీఎం పగ్గాలు చేపట్టనున్నట్లు ప్రచారం జరిగింది. కానీ, చివరకు దేవేంద్ర ఫడణవీస్ ముఖ్యమంత్రి పదవి చేపట్టగా.. అజిత్ మళ్లీ డిప్యూటీగా బాధ్యతలు అందుకోవాల్సి వచ్చింది.

## జగన్ హయాంలో ఏపీని గంజాయి మయంగా మార్చారు: ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

విజయవాడ, జనవరి 28 : వైసీపీ అధినేత వైఎస్.జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో ఏపీని గంజాయి మయంగా మార్చారని ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో గంజాయిని స్కూల్? వరకు తీసుకువచ్చారని ఆగ్రహించారు. ఎన్టీఆర్‌జిల్లా పోలీసులు ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై దండయాత్ర పేరుతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. రామలింగేశ్వర నగర్ నుంచి బెంజి సర్కిల్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మీడియాతో మాట్లాడుతూ.. డ్రగ్స్?పై దండయాత్ర పేరుతో ప్రజల్లో అవగాహన తెచ్చేలా కార్యక్రమాలు చేపట్టారని వెల్లడించారు.

**డ్రగ్స్‌పై ఉక్కుపాదం..** చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించాక.. నేడు ఉన్నతస్థాయిలో డ్రగ్స్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారని తెలిపారు. ఈగల్‌ను ఏర్పాటుచేసి మత్తు పదార్థాల రవాణాపై తమ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని చెప్పుకొచ్చారు. ఏపీలో ఎక్కడా మత్తు పదార్థాలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారని అన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో గంజాయి సాగు అనేది లేకుండా నిర్మూలించారని చెప్పుకొచ్చారు. సమాజం హితం కోసం అధికారులు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా పోలీసులు ఆధ్వర్యంలో మహిళా కానిస్టేబుళ్లు సైకిల్ యాత్ర చేస్తున్నారని వెల్లడించారు.




**డ్రగ్స్ సమాచారం తెలిస్తే పోలీసులకు చెప్పాలి..** డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని సూచించారు. డ్రగ్స్‌కు సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు చెప్పాలని కోరారు. ఇలాంటి అవగాహన యాత్ర ద్వారా ప్రజల్లో మార్పు రావాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ బారిన పడిన వారి వివరాలు తెలిసినా చెప్పాలని పేర్కొన్నారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చి మార్పు తెస్తారని తెలిపారు. ఈ డ్రగ్స్ వల్ల ఎన్నో జీవితాలు, కుటుంబాలు వీధిన పడుతున్నాయని వెల్లడించారు. పోలీసులు స్వయంగా యాత్రలు చేపట్టి ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రయత్నించడం మంచి పరిణామమని తెలిపారు.

చురకలు



చురకలు

## సంపాదకీయం


# రికార్డుల నిర్మలమ్మ... బడ్జెట్ సీతారామమ్మ !

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కి ఎంతో ప్రత్యేకత ఉంది. ఆమె 2014 నుంచి నరేంద్ర మోడీ కేబినెట్ లో పనిచేస్తూ వస్తున్నారు. ఆమె ఇందిరాగాంధీ తర్వాత రెండవ మహిళా రక్షణ మంత్రిగా పనిచేసిన కీర్తిని దక్కించుకున్నారు. రక్షణ మంత్రిగా జలాంతర్గాములలో ప్రయాణించి సాహసానికి మారు పేరుగా నిలిచారు. ఇక 2019లో నరేంద్ర మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చినపుడు ఆమె శాఖను మార్చి దేశానికే ఆర్థిక వ్యవహారాలు చూసే కీలక బాధ్యతలు అప్పగించారు. ఆ విధంగా నిర్మలా సీతారామన్ నాటి నుంచి నేటి వరకూ వరసగా ఎనిమిది బడ్జెట్ లను ప్రవేశపెట్టారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెడుతున్న కేంద్ర బడ్జెట్ తో కలుపుకుంటే ఆమె తొమ్మిదవ బడ్జెట్ తో రికార్డు క్రియేట్ చేశారు.

**ఆమెకు ఆమెనే సాటి :** ఈ రికార్డ్ ఏంటి అంటే ఒకే ప్రభుత్వంలో వరసగా ఇన్ని బడ్జెట్లు ప్రవేశపెట్టడం. నిజానికి తొమ్మిది బడ్జెట్లు దేశంలో ప్రవేశపెట్టిన వారు లేరా అంటే దిగ్గజ నేత పి చిదంబరం ఉన్నారు. కానీ ఆయన వరసగా తొమ్మిది బడ్జెట్లు ప్రవేశ పెట్టలేదు, వేరు వేరు ప్రభుత్వాలలో ఆయన బడ్జెట్లు ప్రవేశపెట్టారు. అలా గ్యాప్ తీసుకుని ఆయన తొమ్మిది బడ్జెట్లు దేశానికి ఇచ్చారు అన్న మాట. దాంతో నిర్మలమ్మనే ఈ విషయంలో గ్రేట్ అని అంటున్నారు. ప్రభుత్వం మారలేదు, ఒకే ప్రధాని నాయకత్వంలో ఆమె వరసగా బడ్జెట్లు ఇన్ని దేశానికి అందించారు అన్న మాట.

**ఒక్క అడుగు దూరంలో :** మరో వైపు చూస్తే ఈ దేశంలో అత్యధిక బడ్జెట్లు ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రిగా మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ కి తిరుగులేని రికార్డు ఉంది. ఆయన కూడా 1957 నుంచి 1969 మధ్యలో ఈ బడ్జెట్లు అందించారు. కానీ వేరు వేరు ప్రభుత్వాలలో అన్న మాట. సో కంటిన్యూగా ఇచ్చిన ఘనత ఇక్కడ కూడా నిర్మలమ్మదే. ఇక నిర్మలా సీతారామన్ ఇప్పటికే తొమ్మిది బడ్జెట్లతో రికార్డు సాధించారు. వచ్చే ఏడాది ఆమె 10వ బడ్జెట్ ప్రవేశపెడితే మొరార్జీ దేశాయ్ రికార్డు సమం చేస్తారు, 2028 తో ఆమె మొరార్జీ దేశాయ్ నే అధిగమిస్తారు, 2029లో ప్రవేశపెట్టే ఓటాన్ అకౌంట్ తో కలుపుకుంటే డజన్ బడ్జెట్లు దేశానికి అందించిన ఆర్థిక మంత్రిగా మహిళా నేతగా నిర్మలమ్మ రికార్డుని సమీప భవిష్యత్తులో ఎవరూ దాటి వెళ్ళలేరు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే నిర్మలమ్మ బడ్జెట్ విషయంలో సరికొత్త రికార్డుతో తనదైన చరిత్రను సృష్టించారు అని అంటున్నారు.

# తెలుగు నేల కీర్తి.... సుందర రామ మూర్తి - జనవరి 29...వేటూరి జయంతి



వేటూరి జయంతి తెలుగు పదానికి పునరావృత జన్మదినం. ఆయన గేయ రచనా వైవిధ్యం ఎందరికో స్ఫూర్తి దాయకం. శ్రీశ్రీ తర్వాత జాతీయ అవార్డు అందుకున్న తెలుగు పాటల రచయిత వేటూరి సుందర రామమూర్తి. మాతృదేవోభవ సినిమాలోని రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే పాటకు ఈ అవార్డు అందుకున్నారు వేటూరి. ఇటు క్లాసే కాదు.. అటు మాస్ సాంగ్స్ రాయడంలోనూ వేటూరి వారిది అందె వేసిన చెయ్యే. తొమ్మిది వేలకు పైగా అలవోకగా ధారాపాతంగా పాటలు రాసిన గొప్పతనం వేటూరిది. పల్లెటూరి మాటలైనా, సమాస భూయిష్ట సంక్లిష్ట పదాలైనా పండితుని నుండి పామరుని వరకూ అవలీలగా చేరి, సులభంగా ప్రతీ నోటా పాడుకునేలా చేసిన అసమాన ప్రతిభ ఆయనకే సొంతమైంది. వేటూరి సినిమా పాటలు రాయటానికి పూర్వం కొంతకాలం పత్రికల్లో పని చేసారు. తెలుగు భాష, సాహిత్యాలపై మక్కువ పెంచు కోవడానికి కారణం అయన పెదనాన్న వేటూరి ప్రభాకర శాస్త్రి, తెలుగులో ప్రథమ జ్ఞానపీఠ గ్రహీత కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ. 1960 సంవత్సర ప్రాంతాల్లో మొదట ఆంధ్ర పత్రికలో కాలూని, తర్వాత ఆంధ్రపత్రిక వీక్లీకి సహాయ సంపాదకుడుగా, ఆపై కొంతకాలం ఆంధ్రప్రభ వార పత్రిక కు చీఫ్ సబ్ ఎడిటర్ గా అయన పని చేశారు. ఎన్టీఆర్ నటించిన "దీక్ష" సినిమాలో మెదటి సారిగా సినిమాకు గీతరచన ప్రారంభించినా అది సినిమాలో రాలేదు. 1972 సంవత్సరం "ఓ సీత కథ" సినిమాలో లీల పాడిన హరికథతో, సినిమా దర్శకులు? కె.విశ్వనాథ్? ప్రోత్సాహంతో సినిమా పాటల రచయితగా శ్రీకారం చుట్టి, వెనుతిరిగి చూడకుండా సాగుతూ, వరసగా సినిమా పాటలు రాస్తూ వచ్చారు. వేటూరిగా పిలవబడే వేటూరి సుందర రామమూర్తి (జనవరి 29, 1936 – మే 22, 2010) లాంటి రచయిత సినీ పరిశ్రమకు పరిచయం కావడం తెలుగు ప్రజలు చేసుకున్న పురాకృత సుకృతం. సుందర రామమూర్తి 1936 జనవరి 29 న కృష్ణా జిల్లా, మోపిదేవి మండలం పెదకళ్ళే పల్లిలో జన్మించారు. మద్రాసులోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్మీడియట్, బెజవాడలో డిగ్రీ పూర్తి చేశారు. 1956 నుంచి పదహారేళ్ళ పాటు పాత్రికేయ వృత్తిలో ఉన్నారు. ముందుగా దైతా గోపాలం ఆ తర్వాత మల్లాది వద్ద శిష్యరికం చేశారు. వేటూరి సుందర రామ్మూర్తి 8 నంది అవార్డులతో పాటు మొత్తం 14 అవార్డులు, ఒక జాతీయ పురస్కారం అందుకున్నారు. తెలుగు పాటకు శ్రీశ్రీ తర్వాత జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టింది వేటూరియే. కేంద్ర ప్రభుతం తెలుగు భాషకు ప్రాచీన భాషా హోదా ఇవ్వనందుకు నిరసనగా తన పాటకు వచ్చిన జాతీయ పురస్కారాన్ని తిరిగి ఇచ్చి, తన మాతృ భాషాభిమానాన్ని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనది. వేటూరి మొదటి పాట ఓ సీత కథ. చివరి పాట బద్రినాథ్ లోని ఓంకారేశ్వరి పాట. ఆ మధ్యకాలంలో ఆయన వేల పాటలను రాశారు. ఓంకారేశ్వరి పాటలో 108 వైష్ణవ దివ్య స్థలాలను తన పాటలో వ్యక్త పరిచిన తీరు అసమానం. అపూర్వం, మహాద్భుతం. సంప్రదాయ కవిత్వ పద బంధాల నుండి జానపద గీతాల వరకు అన్నింటిలోనూ తన ప్రతిభను నిరూపించు కున్నారు. కవనంలో, భావంలో, భాషలో పండితుల నుండి పామరుల వరకు అందరిని అలరించిన విశిష్ట శైలి ఈయన సొంతం. వేటూరి సినీ పాటల పరంపర నాలుగు దశాబ్దాలకు పైగా నిరాటంకంగా కొనసాగింది. దర్శకులకు, నిర్మాతలకు, నటీ నటులకు, సినీ సంబంధీకులకు ఆలంబనగా నిలిచింది. శ్రోతల హృదయాలను దోచింది. పసలేని చిత్రాలను పాటల ద్వారా తీరాలకు చేర్చింది. ఒక్క మాటలో ... సినీ పరిశ్రమను అన్ని విధాలా ఆదుకుంది. వేటూరి పాటల పూదోటలో ప్రతీ పాటా పరిమళం కొల్పోని సుగంధ పుష్పాలే. ఎన్నటికీ వాడిపోని అందమైన లతాంతాలే. గాన గంధర్వుడు దివంగత ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం మాటల్లో చెప్పాలంటే... 'ఉపనిషత్తుల నుంచి ఉలిపిరి కాయితం వరకూ , దేన్ని గురించైనా అపారమైన పరిజ్ఞానం ' వేటూరిది. మహా కవి శ్రీశ్రీ అన్నట్లు...తాను కన్న, విన్న, అనుభవించిన, ఊహించిన ప్రతి అంశాన్ని పదబద్ధం చేసి, కాదేదీ కవితకు అనర్హం అని నిరూపించిన నేర్పరి వేటూరి. వేటూరి భువి నుండి దివికేగినా, ఆయన పాటలు అజరామరాలు, నిరంతరం తెలుగు వారి నాలుకలపై నడయాడే సుస్వరాలు. తెలుగు ప్రజల మనో ఫలకాలపై చెరగని ముద్రలు వేసి 75 సంవత్సరాల వయస్సులో మే 22, 2010 న హైదరాబాదులో గుండెపోటుతో మరణించారు. తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ఆకాశవాణి తొలి స్వరకర్త బాలాంత్రపు రజనీ కాంతరావు - జనవరి 29...బాలాంత్రపు రజనీ కాంతరావు జయంతి




బాలాంత్రపు రజనీ కాంతరావు సుప్రసిద్ధ వాగ్గేయకారునిగా, స్వరకర్తగా, గీత రచయితగా, విజయవాడలోని ఆకాశవాణి సంచాలకులుగా రేడియో శ్రోతలకు చిరపరిచితులు. అయన తొలితరం సంగీత దర్శకుల్లో ఒకరు. ఆయన రచించిన వాగ్గేయకార చరిత్ర 20వ శతాబ్దంలో తెలుగులో వచ్చిన గొప్ప పుస్తకాల్లో ఒకటి. 1947 లో దేశం స్వాతంత్ర్యం పొందిన అర్థరాత్రి భారత ప్రధాని సుప్రసిద్ధ ప్రసంగం పూర్తవగానే రజనీ రచించి, స్వరపరచిన 'మాదీ స్వతంత్రదేశం, మాదీ స్వతంత్ర జాతి' టంగుటూరి సూర్యకుమారి గానం ఆసేతుహిమాచలం ప్రతిధ్వనించింది. తొలి స్వాంత్ర్య దినోత్సవం రోజున స్వయంగా రచించి స్వరపర్చిన "జయభేరి, వాయించు నగారా గీతం" మద్రాసు ఆకాశవాణి కేంద్రం నుంచి ప్రసారమయ్యాయి. ఆ తర్వాత అర్థశతాబ్దం పైగా ఆయన తెలుగునాట లలిత సంగీతమనే ఒక నూతన గాన సంప్రదాయాన్ని సృష్టించి, పెంపొందించి, తానొక వాగ్గేయ కారుడిగా అవతరించడమే కాక, మరెందరో వాగ్గేయకారులకు మార్గదర్శకులుగా ఉన్నారు. 1920 జనవరి 29న పశ్చిమ గోదావరి జిల్లా నిడదోలులో రజనీకాంత రావు జన్మించారు. ఆయన తండ్రి బాలాంత్రపు వేంకటరావు ప్రసిద్ధి చెందిన వేంకట పార్వతీశ కవుల్లో ఒకరు కావడం విశేషం. 1940–41 ప్రాంతంలో ఇరవయ్యేళ్ల నాడు ఆల్ ఇండియా రేడియో సంస్థలో ఉద్యోగంలో చేరగా, నాటి నుండి రిటైరయ్యే వరకూ దేశంలోని వివిధ ప్రాంతాల్లోని కేంద్రాల్లో పనిచేసి 1978లో రేడియో స్టేషన్ డైరెక్టరుగా రిటైరయ్యారు. ఆకాశవాణిలో తొలి స్వరకర్తగా శ్రోతలను అలరించారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి జాతీయస్థాయి గుర్తింపు తెచ్చిన వారిలో రజనీకాంతరావు కీలకమైన వారు. అలాగే తొలితరం సంగీత దర్శకుల్లోనూ బాలాంత్రపు కూడా ఒకరు. రజనీ" అని పిలుచుకునే బాలాంత్రపు రజనీ కాంతరావు ఒక వ్యక్తి కాదు, ఆయన ఏదో ఒక కళకే పరిమితం కాదు. ఆయన ఒక రచయిత, వాగ్గేయ కారుడు, రేడియో కళాకారుడు, సినీ పాటల – మాటల రచయిత, సంగీత దర్శకుడు. సంగీతంలో , సాహిత్యంలో, ముఖ్యంగా కవిత్వంలో రజనీది ఒక ప్రత్యేక శైలి. సాధారణత్వం – సంక్లిష్టత, ప్రాచీనత – ఆధునికత, అచ్చ తెలుగు మాటలు – సంస్కృత భూయిష్ట సమాసాలు, అనేక పరస్పర విరుద్ధ విషయాలు అయన కవిత్వంలో పదబంధాల్లో చోటు చేసుకున్నాయి. ప్రయోగాలు – సంగీత రూపకాలు, యక్షగానాలు, నాటికలు, సంగీత శిక్షణ, ఉషశ్రీ గారి ధర్మ సందేహాలు, ఈ మాసపు పాట, బావగారి కబుర్లు, ఇంకా ఎన్నో కార్యక్రమాల రూపకర్త ఆయన. వీటికి సంబంధించిన రచనలు చేయడం, బాణీలు సమకూర్చడం ఒక ఎత్తు, వాటిని గాయనీ గాయకులతో, వాద్య బృందంతో నిర్వహించడం మరొక ఎత్తు, రేడియో కోసం రచయిత గుడిపాటి వెంకటాచలంను అయన చేసిన ఇంటర్వ్యూ ఈ నాటికి కూడా అపురూపమైనదిగా పరిగణిస్తారు. ఆలిండియా రేడియో లలిత సంగీత విభాగాన్ని తన ప్రతిభతో సుసంపన్నం చేశారు. రజనీ రచించి, స్వరపరిచిన అనేక కృతులు తెలుగు వారి సాంస్కృతిక, సంగీత రంగాల్లో నిలిచి పోయాయి. ప్రఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ తన సంగీతంలో లిరిసిజం రజనీ ప్రభావమేనన్నారు. లలిత సంగీతానికి, తెలుగు సాహిత్యానికి మధ్య సంబంధాన్ని నెలకొల్పి, దానికి రూపకల్పన చేసిన గొప్ప సంగీత కారులుగా ఘంటసాల వెంకటేశ్వరరావు, సాలూరి రాజేశ్వరరావులతో పాటు రజనీకాంతరావు తెలుగు సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారు. ఠాగూర్ అకాడమీ రత్న – రవీంద్రనాథ్ ఠాగూర్ 150 జయంతి సందర్భంగా సంగీత నాటక అకాడమీ ప్రదానం, కళాప్రపూర్ణ – ఆంధ్ర విశ్వ విద్యాలయం 1981 లో బహుకరించిన గౌరవ డాక్టరేట్, కళారత్న అవార్డు – ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2007 లో ఇచ్చిన పురస్కారం, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం – 1961. ఆంధ్ర వాగ్గేయకారుల చరిత్ర ఉత్తమ పరిశోధనా గ్రంథానికి , ప్రతిభా మూర్తి జీవితకాల సాఫల్య బహుమతి – అమెరికాలోని అప్పజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి పురస్కారం, నాథ సుధార్ణవ – మదరాసు మురళీరవళి ఆర్ట్ అకాడమీ, పుంభావ సరస్వతి, నవీన వాగ్గేయకార, 2008లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారాలు ఆయనకు లభించాయి. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, రజనీకాంతరావు 2018, ఏప్రిల్ 22 ఆదివారం రోజున మరణించాడు

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# తెలంగాణ విమోచన పోరాట యోధుడు చోళ లింగయ్య - జనవరి 29... చోళ లింగయ్య వర్ధంతి

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ఖాసిం రజ్వీ ఆధ్వర్యంలో రజాకార్ల దౌర్జన్యాలను ఎదిరించడానికి, నైజాం సర్కారు అంతానికి, హైదరాబాద్ రాజ్య, తెలంగాణ ప్రాంత విమోచోద్యమం నిర్వహించారు. ఎందరో ఎన్నో పోరాట రూపాలను నిర్వచించారు. ఎందరో ఎన్నో త్యాగాలు చేశారు. అలాంటి త్యాగమూర్తులలో చోళ లింగయ్య ఒకరు. నేతాజీ స్ఫూర్తితో, ఇండియన్ నేషనల్ ఆర్మీ లో పని చేస్తున్న లింగయ్య తన ఉద్యోగానికి తృణప్రాయంగా త్యజించి, అర్మీలో తనకున్న అనుభవంతో, సాయుధ పోరాటానికి తెర లేపి, రక్షణ దళాలను ఏర్పాటు చేశారు. హైదరాబాదు సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుంచి 1948 మధ్య చేసిన వీరోచిత పోరాటమే తెలంగాణ విమోచనోద్యమం. భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినా, నిజాం సంస్థానంలోని ప్రజలకు మాత్రం స్వాతంత్ర్యం లేకపోవడాన్ని ఇక్కడి ప్రజలు జీర్ణించు కోలేక పోయారు. దేశమంతటా స్వాతంత్ర్యోత్సవాలతో ప్రజలు ఆనందంతో మునిగి తేలగా, నిజాం సంస్థాన ప్రజలు మాత్రం నిరంకుశ బానిసత్వం నుండి స్వేచ్ఛా వాయువులు పీల్చ లేక పోయారు. నిజామ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ రాజ్యాన్ని సొంతం చేసుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తూ రజాకార్లను ఉసిగొల్పాడు. నిజాం ఇచ్చిన స్వేచ్ఛ తో, ఖాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్లు గ్రామాలపైబడి దోపిడి చేయడం, ఇండ్లు తగలబెట్టడం, మాన భంగాలు, లూటీలు లాంటి నానా అరాచకాలు సృష్టించారు. మతోన్మాద చర్యల కారణంగా ప్రజల నుండి బలవంతపు వసూలు చేసుకున్న సొమ్ముతో విలాసాలు, జల్సాలు, భోగభాగ్యాలు చేసుకొనేవారు. దీనితో రామానందతీర్థ నేతృత్వంలో ఆర్యసమాజ్ ఉద్యమాలు, కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటాలు ఉధృతమయ్యాయి. మొదట నల్గొండ జిల్లాలో ప్రారంభమైన ఉద్యమం శరవేగంగా నైజాం సంస్థానం అంతటా విస్తరించింది. తెలంగాణ సాయుధ పోరాటంలో పురుషులు, స్త్రీలు, పిల్లలు అనే తేడాలు లేకుండా తుపాకులు, బడిసెలు పట్టి రజాకార్ల మూకలను తరిమి కొట్టారు. మహబూబ్ నగర్ జిల్లాలో అప్పంపల్లి, ఆదిలాబాదు జిల్లాలో నిర్మల్, సిర్పూర్, కరీంనగర్ జిల్లాలో మంథని, మహమ్మదాపూర్, నల్గొండ జిల్లాలో మల్లారెడ్డిగూడెం, నిజామాబాదు జిల్లా ఇందూరు, తదితర ప్రాంతాలలో పోరాటం పెద్దఎత్తున సాగింది. జమలాపురం కేశవరావు, లక్ష్మీ నరసయ్య, ఆరుట్ల కమలా దేవి, రావి నారాయణరెడ్డి, ధర్మబిక్షం, చంద్ర రాజేశ్వరరావు, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్, షోయబ్ ఉల్లాఖాన్, మల్లు స్వరాజ్యం రాంజీగోండ్, విశ్వనాథ్ సూరి, దొడ్డి కొమరయ్య, బెల్లం నాగయ్య, కిషన్ తదితరులు తెలంగాణ విమోచనానికి కృషిచేశారు. వీరందరి కృషి, దాశరథి, కాళోజీల కవితల స్ఫూర్తితో సామాన్య ప్రజలు సైతం ఊరుఊ రున, వాడవాడన నిజాం పాలనపై తిరగబడ్డారు. కర్రలు, బరిసెలు, గుత్పలు, కారం ముంతలు, చేతికి అందుబాటులో ఉందల్లా ఆయుధాలుగా మలుచుకొని పోరాడారు. తుపాకులను సంపాదించుకొని యుద్ధరంగం లోకి దిగారు. ఇలా వివిధ జిల్లాలలో తెలంగాణ విమోచన పోరాటాలు కొనసాగాయి. అందులో భాగంగానే మెదక్ పట్టణానికి చెందిన చోళ లింగయ్య ఇండియన్ నేషనల్ ఆర్మీలోని ఇంజనీర్ ఉద్యోగానికి రాజీనామా చేసి తనకున్న మిలటరీ పరిజ్ఞానంతో రజాకార్ల దాడులను తిప్పికొట్టడం కోసం రక్షణ దళాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ విమోచన పోరాట యోధునిగా పేరుపొందిన చోళ లింగయ్య జూన్ 13, 1913న మెదక్ పట్టణంలో జన్మించారు. పాఠశాల దశలోనే విద్యార్థి సంఘాలను ఏర్పాటు చేశారు. గాంధీ – నెహ్రూ చిత్రపటాలను అవిష్కరించి నందుకు పాఠశాల నుంచి బహిష్కృతులైనారు. 1942లో భారత వైమానిక దళంలో చేరారు. ఇండియన్ నేషనల్ ఆర్మీ ఎయిర్ ఫోర్స్ గ్రౌండ్?లో పనిచేసిన చోళ లింగయ్య... సుభాష్ చంద్రబోస్



పిలుపును అందుకొని ఉద్యోగానికి రాజీనామా చేశారు. బోస్ ఆచూకీ లభ్యం కాని స్థితిలో ఆయన హైదరా బాదుకు వచ్చి తెలంగాణ విమోచన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 1947, ఆగస్టు 15న మెదక్ పట్టణంలోని పటేల్ కుంటలో జాతీయ జెండాను ఆవిష్కరించిన పిదప అరెస్ట్ వారెంట్ జారీ కావడంతో అజ్ఞాతంలోకి వెళ్ళారు. నిజాం సర్కారు లింగయ్యను 1947 సెప్టెంబరు 10న అరెస్ట్ చేసి 7 నెలల పాటు హైదరాబాదులోని చంచల్‌గూడ జైలులో ఉంచింది. విమోచన అనంతరం లింగయ్య హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెస్ సభ్యులుగా, ఆలిండియా కాంగ్రెస్ డెలిగేట్?గా, 1977లో మెదక్ జిల్లా పార్టీ కోశాధికారిగా పనిచేశారు. 2010 జనవరి 29న పోరాట యోధుడు లింగయ్య మరణించారు. చివరికి భారత ప్రభుత్వం సర్దార్ పటేల్ నేతృత్వంలో సైనిక చర్యతో నైజాం సంస్థానాన్ని 1948 సెప్టెంబర్ 18న భారత్ యూనియన్‌లో విలీనం చేసుకుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# వినోదం కాదు... విజ్ఞానం: పజిల్లతో మానవ మేధస్సు ప్రయాణం - జనవరి 29.. జాతీయ పజిల్ దినోత్సవం

ప్రతి సంవత్సరం జనవరి 29న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే జాతీయ పజిల్ దినోత్సవం, మొదట చూస్తే ఒక సాధారణ వినోద దినంలా అనిపించవచ్చు. కానీ లోతుగా పరిశీలిస్తే, ఈ దినోత్సవం మానవ మేధస్సు వికాస చరిత్రను, ఆలోచనా క్రమాల పరిణామాన్ని, సమస్య పరిష్కార సంస్కృతిని గుర్తు చేసే ఒక మేధో ప్రతీకగా నిలుస్తుంది. పజిల్ అనేది కేవలం విడి ముక్కలను కలిపే ఆట కాదు; అది మానవ ఆలోచనల నిర్మాణాన్ని పరీక్షించే ఒక మానసిక వ్యాయామం. అందుకే జాతీయ పజిల్ దినోత్సవం అనేది ఆటకు అంకితం చేసిన రోజు కాకుండా, ఆలోచనకు అంకితం చేసిన రోజు అని చెప్పుకోవచ్చు. పజిల్ భావన మానవ నాగరికతతో సమకాలీనంగా పుట్టిందని చరిత్ర చెబుతోంది. ప్రాచీన ఈజిప్టు నాగరికతలో గణిత సమస్యలు, కొలతల ఆధారంగా రూపొందించిన మేధో పరీక్షలు పజిల్ స్వరూపాలుగా కనిపిస్తాయి. క్రీ.పూ. 1650 నాటికి చెందిన రైండ్ మ్యాథమెటికల్ పాపిరస్‌లో ఇప్పటికీ పరిష్కరించగలిగే గణిత పజిళ్లు లభించడం, ఆ కాలంలోనే సమస్యల పరిష్కారానికి తార్కిక ఆలోచనకు ఎంత ప్రాధాన్యం ఇచ్చారో సూచిస్తుంది. గ్రీకు తత్వవేత్తలు ప్లేటో, అరిస్టాటిల్ తమ శిష్యులకు తర్కాన్ని అలవర్చేందుకు ప్రశ్నోత్తర పద్ధతిని ఉపయోగించేవారు. ఇవన్నీ ఆధునిక పజిల్ సంస్కృతికి పునాదులుగా నిలిచాయి. భారతీయ సంస్కృతిలో పజిల్ భావన మరింత జీవంతో కనిపిస్తుంది. వేదకాలం నుంచే సూక్తుల రూపంలో, సూత్రాల రూపంలో ప్రశ్నలు, సంకేతాలు ఉపయోగించారు. ఉపనిషత్తులలో కనిపించే 'కో అహం?', 'తత్వమసి' వంటి ప్రశ్నలు మానవ ఆలోచనను లోతుగా కదిలించే మేధో పజిల్లే. పురాణాల్లో బేతాళ ప్రశ్నలు, పంచతంత్ర కథల్లో నైతిక పజిళ్లు, తెనాలి రామకృష్ణుడి కథల్లో తక్షణ బుద్ధిని పరీక్షించే సంఘటనలు – ఇవన్నీ భారతీయ పజిల్ సంప్రదాయానికి సజీవ సాక్ష్యాలు. ఈ కథలన్నింటిలో ఒకే లక్షణం స్పష్టంగా కనిపిస్తుంది – సమస్యకు బలం కంటే బుద్ధే పరిష్కారం. ఆధునిక అర్థంలో పజిల్ చరిత్రను పరిశీలిస్తే, క్రీ.శ. 1760లో లండన్?కు చెందిన జాన్ స్పిల్స్?బరీ రూపొందించిన చెక్క మ్యాప్ పజిల్ ఒక కీలక మలుపుగా నిలుస్తుంది. విద్యార్థులకు భూగోళ విజ్ఞానం నేర్పాలనే ఉద్దేశంతో ఆయన తయారు చేసిన ఈ పజిల్, కాలక్రమేణా జిగ్?సా పజిల్?గా రూపాంతరం చెందింది. 19వ శతాబ్దం చివరికి యూరప్, అమెరికాలో పజిళ్లు కుటుంబ వినోదంగా మారాయి. 1900ల ప్రారంభంలో పత్రికల్లో క్రాస్?వర్డ్ పజిళ్లు ప్రవేశించడం ద్వారా పజిల్ సంస్కృతి సామాన్య ప్రజల జీవితంలోకి అడుగు పెట్టింది. 1913లో 'న్యూయార్క్ వరల్డ్' పత్రికలో ప్రచురితమైన తొలి క్రాస్?వర్డ్ పజిల్, అమెరికాలో పజిల్ విప్లవానికి నాంది పలికింది. జాతీయ పజిల్ దినోత్సవం ఆవిర్భావం కూడా ఈ పజిల్ విస్తరణకు అనుసంధానమే. అమెరికాలో మేధో వికాసాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో, పజిళ్ల సామాజిక ప్రాధాన్యాన్ని గుర్తుచేసేందుకు జనవరి 29ను ప్రత్యేక దినంగా ఎంపిక చేశారు. ఈ తేదీ ఎంపిక వెనుక స్పష్టమైన భావన ఉంది. శీతాకాలంలో శారీరక చురుకుదనం తగ్గే సమయంలో, మానసిక చురుకుదనాన్ని పెంచే చర్యలపై దృష్టి పెట్టాలనే ఉద్దేశమే దీనికి మూలం. నేడు ఈ దినోత్సవం అమెరికాకే పరిమితం కాకుండా, యూరప్, ఆసియా, ఆస్ట్రేలియా వంటి ప్రాంతాల్లోనూ గుర్తింపు పొందింది. పజిళ్ల రూపాలు కాలానుగుణంగా మారినా, వాటి లక్ష్యం మాత్రం ఒకటే -- ఆలోచనను ప్రేరేపించడం. జిగ్?సా పజిళ్లు దృశ్య స్మృతి, సహనం, స్థలిక అవగాహనను పెంపొందిస్తాయి. క్రాస్?వర్డ్ పజిళ్లు భాషా పరిజ్ఞానాన్ని, పదసంపదను విస్తరిస్తాయి. సూడోకు, మ్యాజిక్ స్క్వేర్ వంటి గణిత పజిళ్లు తార్కిక ఆలోచనకు పదును పెడతాయి. రిడిల్స్, బ్రెయిన్ టీజర్లు సృజనాత్మక ఆలోచనను ప్రోత్సహిస్తాయి. డిజిటల్ యుగంలో మొబైల్ యాప్?లు, ఆన్లైన్ గేమ్స్ రూపంలో పజిళ్లు మరింత విస్తరించాయి. ప్రపంచ వ్యాప్తంగా గణాంకాలను పరిశీలిస్తే, పజిల్ గేమ్స్ మార్కెట్ విలువ 2024 నాటికి సుమారు 11 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరిందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది పజిళ్లపై పెరుగుతున్న ఆసక్తికి స్పష్టమైన సూచిక. పజిళ్లు మానవ మెదడుపై చూపే ప్రభావాన్ని శాస్త్రీయంగా పరిశీలించిన పరిశోధనలు కూడా అనేకం ఉన్నాయి. అమెరికాలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ నిర్వహించిన అధ్యయనాల ప్రకారం, నిరంతరం పజిళ్లు పరిష్కరించే వారిలో జ్ఞాపకశక్తి మెరుగ్గా ఉండటమే కాకుండా, మానసిక ఒత్తిడి స్థాయి సగటున 20 నుంచి 30 శాతం వరకు తగ్గినట్లు గుర్తించారు. బ్రిటన్?లో నిర్వహించిన మరో పరిశోధనలో, వృద్ధుల్లో సూడోకు, క్రాస్?వర్డ్ వంటి పజిళ్లను అలవాటు చేయడం వల్ల అల్జీమర్స్ లక్షణాలు సగటున ఐదు నుంచి ఏడు సంవత్సరాల వరకు ఆలస్యంగా కనిపించినట్లు తేలింది. ఈ గణాంకాలు పజిళ్లు కేవలం వినోద సాధనాలు కాకుండా, మానసిక ఆరోగ్యానికి ఔషధాల్లాంటివని నిరూపిస్తున్నాయి. విద్యా రంగంలో పజిళ్ల పాత్ర మరింత కీలకంగా మారుతోంది. సంప్రదాయ బోధన పద్ధతుల్లో విద్యార్థి వినే స్థితిలో ఉంటే, పజిల్ ఆధారిత బోధనలో విద్యార్థి ఆలోచించే స్థితిలో ఉంటాడు. యునెస్కో నివేదికల ప్రకారం, పజిల్ ఆధారిత బోధనను అమలు చేసిన పాఠశాలల్లో విద్యార్థుల సమస్య పరిష్కార సామర్థ్యం సుమారు 40 శాతం వరకు మెరుగైనట్లు తేలింది. భారతదేశంలో




కూడా నూతన విద్యా విధానం ఆలోచనా నైపుణ్యాలపై దృష్టి పెట్టడం, పజిల్ సంస్కృతికి అనుకూలమైన మార్పుగా భావించవచ్చు. సామాజికంగా చూస్తే, పజిళ్లు వ్యక్తిగత వినోదాన్ని దాటి సామూహిక అనుభూతిగా మారాయి. కుటుంబ సభ్యులు కలిసి పజిల్ పరిష్కరించడం ద్వారా పరస్పర సంభాషణ పెరుగుతుంది. కార్యాలయాల్లో టీమ్ బిల్డింగ్ కార్యక్రమాల్లో పజిళ్లను ఉపయోగించడం ద్వారా సమన్వయం, సహకారం పెరుగుతుందని కార్పొరేట్ అధ్యయనాలు సూచిస్తున్నాయి. పజిల్ అనేది ఒక సమస్య మాత్రమే కాదు; అది ఒక సంభాషణకు, ఒక ఆలోచనా ప్రయాణానికి ప్రారంభ బిందువు. జాతీయ పజిల్ దినోత్సవం ఇచ్చే ప్రధాన సందేశం చాలా సరళమైనదే అయినా లోతైనది. వేగంగా మారుతున్న ప్రపంచంలో తక్షణ పరిష్కారాల కోసం పరుగులు తీస్తున్న మనిషికి, పజిళ్లు ఓర్పు, క్రమబద్ధత, లోతైన ఆలోచన అవసరమని గుర్తు చేస్తాయి. ప్రతి సమస్యకు బలం, శక్తి అవసరం లేదని; సరైన ఆలోచన ఉంటే పరిష్కారం దొరుకుతుందనే నమ్మకాన్ని పజిళ్లు నాటుతాయి. జనవరి 29న జరుపుకునే జాతీయ పజిల్ దినోత్సవం, మేధస్సు ఆరోగ్యాన్ని పండుగలా జరుపుకునే అరుదైన సందర్భం. వినోదం పేరుతో ఆలోచనను పక్కన పెట్టే కాలంలో, ఆలోచననే వినోదంగా మార్చిన సంస్కృతికి ఇది ప్రతీక. పజిళ్లు మనిషిని ఆటలో ముంచుతూనే, ఆలోచనలో నిలిపేస్తాయి. అందుకే ఈ దినోత్సవం ఒక తేదీ మాత్రమే కాదు; మానవ మేధస్సు విలువను గుర్తు చేసే ఒక నిరంతర సందేశం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ఊరి బడికి ఉపకారం

జగిత్యాల : ఎంత ఎదిగినా కన్నతల్లి లాంటి జన్మభూమిని మరచిపోలేదా సోదరులు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన పాఠశాల రూపురేఖలే మార్చారు.. వారిద్దరి కృషితో కార్పొరేట్ స్కూల్స్కు తలపిస్తోందా సర్కారు బడి. జగిత్యాల గ్రామీణ మండలం లక్ష్మీపూర్కు చెందిన ఎడమల సత్యనారాయణరెడ్డి అమెరికా వెళ్లి వచ్చి ప్రస్తుతం హైదరాబాద్లో రాంకీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్కు ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 96 మంది విద్యార్థులు చదువుతున్నారు. పుట్టిన ఊరికి ఏదైనా చేయాలనే ఉద్దేశంతో సత్యనారాయణరెడ్డి బడిని బాగు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.25 లక్షలు కేటాయించారు. ఆయనకు వరుసకు సోదరుడైన తిరుపతిరెడ్డి అమెరికాలో ఉంటున్నారు. తాను



రూ.5 లక్షలు జత చేశారు. మొత్తం రూ.30 లక్షలతో పాఠశాల భవనానికి మరమ్మత్తు చేపట్టారు. బాస్కెట్బాల్ కోర్టు అందుబాటులోకి తెచ్చారు. బడి ముందు వేదిక నిర్మించి చదువుల తల్లి సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. బడి గోడలకు బొమ్మలు వేయించడంతో.. ప్రస్తుతం కార్పొరేట్ హంగులు అద్దుకొంది. ఈ పాఠశాలలో జాబితాపూర్, ధర్మారం విద్యార్థులు సైతం చదువుతారు. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. సత్యనారాయణరెడ్డి తల్లిదండ్రులు శంకరమ్మ, గంగారెడ్డిల జ్ఞాపకార్థం, తిరుపతిరెడ్డి తండ్రి లక్ష్మారెడ్డికి గుర్తుగా బడిని బాగు చేశామని చెబుతున్నారు.

# అతుకుల తీగలు.. అగ్గిలో బతుకులు

హైదరాబాద్ : అవే తప్పులు.. అదే నిర్లక్ష్యం.. ఎంత మంది మరణించినా కనువిప్పు కలగని ప్రభుత్వ విభాగాలు.. వెరసి మహానగరాన్ని వరుస అగ్నిప్రమాదాలు హడలెత్తిస్తున్నాయి. నాంపల్లిలోని ఫర్నిచర్ దుకాణంలో తాజాగా జరిగిన అగ్నిప్రమాదంలో ఐదుగురు సజీవ దహనమయ్యారు. ఈ ప్రమాదానికి సెల్లార్లో షార్ట్ సర్క్యూట్ కారణమని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఇవే కాదు నగరంలో ఇళ్లు, వాణిజ్య భవనాల్లో సగటున 80 శాతం అగ్నిప్రమాదాలు షార్ట్ సర్క్యూట్ వల్లే జరుగుతున్నాయి. పాత భవనాలకు అదనపు హంగుల కోసం లైటింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయిస్తున్నా.. లోడుకు



సరిపడా విద్యుత్ వ్యవస్థల్ని మార్చడం లేదు. పాత వైర్లకు అతుకులు వేసి కొత్త కనెక్షన్లు ఇస్తున్నారు. లోడు అధికమై అతుకులు ఉన్నచోట షార్ట్సర్క్యూట్లు దారి తీస్తోంది. 18 మీటర్ల కంటే ఎత్తుండే భవనాలకు అగ్నిమాపక శాఖ ఎన్వోసీ ఇవ్వాలి. ఒకవేళ నిర్మాణం పూర్తయ్యాక నిబంధనలు పాటించనట్లు గుర్తిస్తే సీజ్ చేసే అధికారం అగ్నిమాపక శాఖకు లేకపోవడం విడ్డూరం. అగ్నిప్రమాదం జరిగినప్పుడే ఈ ఉల్లంఘనలు వెలుగులోకి వస్తుండడం పెద్ద విచిత్రం.

# అటు ఇటైతే.. సమస్యల జాతరే

వరంగల్ : మేడారం మహాజాతరకు వరంగల్ నుంచి వెళ్లే వారికి తాత్కాలిక బస్టాండ్లో మేడారం బస్పాయింట్ ఏర్పాటు చేశారు. ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు రోజూ.. 290 బస్సులను నడిపించేందుకు చర్యలు చేపట్టారు. రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచుతామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. అయితే వరంగల్ నూతన బస్టాండు నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో.. తాత్కాలిక బస్టాండులో రెండేళ్లుగా మేడారం మహాజాతర నిర్వహణ ఆర్టీసీ అధికారులకు కత్తిమీద సామవుతోంది. ఈసారి బస్టాండు పనులు జరుగుతున్నందున తాత్కాలిక బస్టాండ్ ఇరుకు ప్రాంతంలో జాతర ఏర్పాట్లు చేయడంతో ఇబ్బందులు తప్పేలాలేవు. గత జాతర సమయంలో మొత్తం 350 ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేయగా.. సుమారు లక్ష మంది భక్తులు ప్రయాణించారని ఆర్టీసీ అధికారులు చెప్పారు. ఈసారి సుమారు 1.50 లక్షల మంది ప్రయాణిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. వరంగల్ నుంచి మేడారం జారతకు వెళ్లడానికి పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.150 నిర్ణయించారు.

**ఆరురోజులు జంక్షన్లే బస్టాండ్లు..** తాత్కాలిక బస్టాండ్లో మేడారం బస్పాయింట్ ఏర్పాటు చేయడంతో.. ఇక్కడ కేవలం మేడారం బస్సులను మాత్రమే అనుమతిస్తున్నారు. బస్టాండ్ నుంచి రోజూ నడిచే సాధారణ బస్సులను దారి మళ్లించారు. బస్సు సర్వీసుల ఆధారంగా వెంకట్రామ జంక్షన్, అండర్బ్రిడ్జిల వద్ద బస్సులు ఆగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. మహబూబాబాద్, తొర్రూరు నుంచి వరంగల్, హనుమకొండ వైపు నడిచే బస్సులను చింతల్, వెంకట్రామ జంక్షన్ల ద్వారా దారి మళ్లిస్తున్నారు. నర్సంపేట నుంచి హనుమకొండ వెళ్లే బస్సులు వెంకట్రామ జంక్షన్, కాశీబుగ్గ మీదుగా నడిపిస్తున్నారు. కాజీపేట-వరంగల్ ఒకటి, 11 నంబరు రూటు సిటీ బస్సులు వయా కాశీబుగ్గ, వెంకట్రామ జంక్షన్ వరకు వెళుతున్నాయి. హంటర్రోడ్డు నుంచి నడిచే కాజీపేట- వరంగల్ 3వ నంబర్ రూటు బస్సు వరంగల్ అండర్బ్రిడ్జి వరకు మాత్రమే వస్తుంది. వరంగల్ రైల్వేస్టేషన్ గూడ్సు షెడ్డును రైల్వే అధికారులు చింతలపల్లి రైల్వేస్టేషన్కు తరలించారు. వరంగల్ తాత్కాలిక బస్టాండ్ను ఆనుకుని ఉండే విశాలమైన ఈ ప్రాంతాన్ని మేడారం బస్పాయింట్ కోసం వినియోగిస్తే.. మేడారం వెళ్లే ప్రయాణికులకు మెరుగైన సేవలందేవి. అయితే అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేపట్టకపోవడంతో ప్రస్తుతం ఇరుకు ప్రాంతంలో బస్పాయింట్ ఏర్పాటుతో.. ఇక్కడ ప్రయాణికులు ఎక్కువసేపు వేచి ఉండేందుకు అవకాశం లేదు. ఆర్టీసీ అధికారులు కొంచెం అప్రమత్తంగా లేకున్నా.. తాత్కాలిక బస్టాండ్ సమస్యల జాతర కానుంది.

# ఆశలసౌధం.. నిరుపయోగం



కరీంనగర్ : సొంత స్థలం లేని నిరుపేదలకు రెండు పడక గదుల ఇళ్లను మంజూరు చేయాలన్న లబ్ధిదారుల ఆశలను ప్రభుత్వం ఆవిరి చేస్తోంది. రెండు, మూడేళ్లుగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు అధికారులు, నాయకుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతుంది. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లు ఎవరికీ ఉపయోగంలేకుండా పోతున్నాయి.

**జిల్లాలో పరిస్థితి ఇది..**

జిల్లావ్యాప్తంగా 2,737 రెండు పడక గదుల ఇళ్లను భారాస ప్రభుత్వ హయాంలో మంజూరు చేశారు. వాటిలో 1,815 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. పలు మండలాల పరిధిలో చాలా మంది లబ్ధిదారులు కేటాయించిన ఇళ్లను స్వాధీనం చేసుకొని నివసిస్తున్నారు.

కరీంనగర్ నగర పరిధిలోని చింతకుంటలో 660 మంది లబ్ధిదారుల కోసం రెండు పడక గదుల ఇళ్లను అయిదు అంతస్తుల భవనంలో నిర్మించారు. దానికి సంబంధించి కొన్ని పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని తక్షణమే పూర్తి చేయాలని సెప్టెంబరులో రూ.2 కోట్ల నిధులను జిల్లా కలెక్టర్ కేటాయించారు. ప్రస్తుతం ఆ పనులు కూడా పూర్తి కావచ్చాయి. తీగలగుట్టపల్లి, కమాన్పూర్ గ్రామాల్లో నిర్మించిన రెండు పడక గదిలో ఇళ్లను ఇప్పటికే లబ్ధిదారులకు కేటాయించగా వారు స్వాధీనం చేసుకున్నారు.

**చింతకుంటలో పంపిణీకి కసరత్తు**

చింతకుంటలో నిర్మించిన 660 రెండు పడక గదుల ఇళ్లను కేటాయించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా అర్హులైన లబ్ధిదారుల వివరాలతో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి అర్హులా కాదా? అని తేల్చినట్లు తెలిసింది. నగర, పురపాలిక ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఇతర జిల్లాలో పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. కరీంనగర్లో కూడా అందించాలని ఇన్ఛార్జి మంత్రిపై ఒత్తిడి తీసుకొచ్చారు. కానీ ఇప్పటివరకు అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. కాగా ఒకట్రెండు రోజుల్లో సంబంధించిన దస్త్రంపై ఇన్ఛార్జి మంత్రి ఆమోద ముద్ర వేయించి ఇళ్లను కేటాయించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇళ్లు కేటాయించేందుకు కసరత్తు జరుగుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

# కొరవడిన వైవిధ్యం.. మార్పు అనివార్యం



జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో 20 ఏళ్ల క్రితం వరి సాగు 2.15 లక్షల ఎకరాలుండగా.. గడచిన వానాకాలంలో 9.66 లక్షల ఎకరాలను దాటింది. పత్తి సాగు 5.65 లక్షల ఎకరాలనుంచి 1.79 లక్షల ఎకరాలకు తగ్గగా.. మొక్కజొన్న 1.45 లక్షల ఎకరాల నుంచి 62 వేల ఎకరాలకు తగ్గింది. దాదాపు అన్ని రకాల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గడంతో.. పంటల వైవిధ్యం దెబ్బతిని ఉత్పత్తుల ధరల్లో హెచ్చు తగ్గులుంటున్నాయి.

**పైర్ల నడవాతో ప్రయోజనాలు**

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన క్రాప్కాలనీల(పైర్ల నడవా)తో చాలా సమస్యలు తీరతాయి. అన్ని పంటలను సమతూకంలో పండించనందున కొన్ని ఉత్పత్తులను ఎగుమతి చేయాల్సి రావడం, మరికొన్నింటి దిగుమతికి ఇబ్బందులున్నందునా కావాల్సిన అన్నిరకాల ఉత్పత్తులను మనమే పండించుకునే పరిస్థితిని కల్పించాలన్నదే క్రాప్కాలనీల ఉద్దేశం.

ఇందుకుగాను ప్రతి రైతు పండించే పంట వివరాలు, విస్తీర్ణం, మార్కెట్ అవకాశాలు, దక్కుతున్న ధరలు, మాంసం ఉత్పత్తి, పాల వినియోగం, కుటుంబాల్లో పోషకాహారం వాడకం తదితర 20 అంశాలతో కూడిన వివరాలను ప్రభుత్వం గతంలోనే సేకరించింది. ఆరుతడి పంటల విత్తనాలు, యంత్రాలను రాయితీపై ఇవ్వాల్సి ఉంది.

**పండ్ల తోటలకు అవకాశం**

జగిత్యాల జిల్లాలో నారింజ(సంత్రా)ను పండించేలా అనుకూల పరిస్థితులున్నట్లు ఉద్యానశాఖ గుర్తించగా.. ఈ సాగును పెంచాలి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో మామిడి తోటల సాగు మన అవసరాలకన్నా చాలా అధికంగా ఉండగా మామిడికాయల ఎగుమతిపై దృష్టి సారించాలి. అరటి, ద్రాక్ష, జామ, సీతాఫల్, దానిమ్మ తదితర అతి తక్కువగానే ఉత్పత్తవుతున్నాయి. కేవలం ఆయిల్పామ్ సాగుపైనే ప్రస్తుతం దృష్టి సారించింది.

**కూరగాయల సాగు పెంచేలా**

మనం దాదాపు 25 రకాల కూరగాయలను తింటుండగా.. కేవలం 39 శాతం కూరగాయలే మనవద్ద ఉత్పత్తవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు మొత్తం సుమారు 25 వేల ఎకరాలకు చేర్చేలా పాలీహౌజులు, షేడ్నెట్లు, విత్తనాలను రాయితీపై ఇవ్వాలి. ప్రతి నియోజకవర్గానికొక ఆహారశుద్ధి పరిశ్రమను నెలకొల్పితే రైతులతోపాటుగా స్థానిక వినియోగదారులకూ మేలు కలుగుతుంది.

**అనువైనవి ఎంచుకోవాలి**

అన్ని పంటల సాగుకు ఉమ్మడి జిల్లా నేలలు అత్యంత అనువుగా ఉన్నందున నేలలకు అనువైన పంటలను సాగుకు ఎన్నుకోవాలి. ఉత్పత్తుల మార్కెటింగ్కు అవకాశాలు కల్పించాలి. వ్యవసాయ అనుబంధ రంగాలతో అదనపు ఆదాయం వస్తుంది. డా. హరీశ్కుమార్శర్మ, సహపరిశోధన సంచాలకులు

# హద్దులు మార్చి.. ఆస్తులు మరిచి!



హైదరాబాద్ :నగరంలో డివిజన్ల పునర్విభజన ఇళ్ల కొనుగోళ్లపై ప్రభావం చూపుతోంది. అధికారులు హద్దులు మార్చినప్పటికీ, కొత్త డివిజన్లకు తగ్గట్టుగా ఆస్తులను నూతన కార్యాలయాలకు అప్పగించలేదు. ఫలితంగా ఒక డివిజన్ నుంచి మరో డివిజన్కు మారిన కాలనీల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మ్యుటేషన్ జరగకపోవడంతో ఇళ్లు, ఖాళీ స్థలాల అమ్మకాలు నిలిచిపోతున్నాయి. ఇంటి నంబర్ల జారీ, ఆస్తి మదింపు, ఇళ్ల అమ్మకాలు, బ్యాంకు రుణాల మంజూరు వంటివి ప్రభావితం అవుతున్నాయి. ఆస్తి కొనుగోలులో భాగంగా అడ్వాన్సు చెల్లించిన వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంది. జీహెచ్ఎంసీ తప్పిదం వల్ల లావాదేవీలు పూర్తికాక, బయానా కింద డబ్బు తీసుకున్నవారు తిరిగివ్వకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

250 డివిజన్లలో..: పాత జీహెచ్ఎంసీలో 150 డివిజన్లు ఉండేవి. ఇటీవల శివారులోని 27 పట్టణ స్థానిక సంస్థలను విలీనం చేసి 300 డివిజన్లుగా విభజించారు. ఈ క్రమంలో, 250 డివిజన్లు కొత్త హద్దులతో ఏర్పాటయ్యాయి. వాటి పరిధిలో ఒక డివిజన్ నుంచి మరో డివిజన్కు మారిన బస్తీలు, కాలనీల్లోని ఇళ్లు 5 లక్షల వరకు ఉండొచ్చని అంచనా. ప్రస్తుత విధానం ప్రకారం ఇల్లు లేదా అపార్ట్మెంట్లో ఫ్లాటు కొనుగోలు చేస్తే, రిజిస్ట్రేషన్ ప్రక్రియలోనే పాత యజమాని పేరుతో ఉన్న ఇంటి నంబరు.. కొత్త యజమాని పేరుతో మారిపోతుంది. అంటే, రిజిస్ట్రేషన్ ఆఫీసులోనే మ్యుటేషన్, ఆస్తిపన్ను మదింపు పూర్తవుతాయి. పునర్విభజన వల్ల రిజిస్ట్రేషన్తో పాటు మ్యుటేషన్ జరగట్లేదు. అంతేకాకుండా ఆయా బస్తీలు, కాలనీల పరిధిలో పారిశుద్ధ్యం, నిర్మాణ అనుమతులు, జనన, మరణ ధ్రువీకరణపత్రాల జారీ, పలు ఇతర పౌరసేవల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది.

ఇలా చేస్తే మేలు..: సమస్య నెలకొన్న ప్రాంతాలను ప్రత్యేక యూనిట్లుగా ఏర్పాటు చేసి, వాటిని ప్రస్తుత సర్కిల్ కార్యాలయాల పరిధిలోని పన్ను రికార్డుల్లో చేర్చితే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

సగం డబ్బు చెల్లించాక తెలిసింది

పాత ఎల్బీనగర్ జోన్ పరిధిలో ఇటీవల ఓ ఇంటిని కొనుగోలు చేశాం. ప్రస్తుత యజమాని ఆ ఇంటిని మరొకరి నుంచి కొన్నారు. ఆ సమయంలో ప్రస్తుత యజమాని తన పేరుతో ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకున్నా.. మ్యుటేషన్ చేసుకోలేదు. మేము సగం డబ్బు కట్టిన తర్వాత తెలిసింది. మ్యుటేషన్ దరఖాస్తు పెండింగ్లో ఉంది. ప్రస్తుతం పునర్విభజన వల్ల ఆ ప్రాంతం బడంగ్పేట్కు మారిందని, అక్కడికి వెళ్లాలని సూచించారు.

దిలీప్కుమార్, ఎల్బీనగర్

# తల్లులూ.. చల్లని చూపే దీవెనలు

తాడ్వాయి : తల్లులూ.. మీ చల్లని చూపే మాకు దీవెనలు అంటూ భక్తజనం వనదేవతలను కొలిచారు. మేడారం మహా జాతర ప్రారంభానికి ఇంకో మూడు రోజుల సమయం ఉంది. కానీ ఆదివారం మేడారానికి తరలివచ్చిన భక్తజనాన్ని చూస్తే.. అప్పుడే జాతర మొదలయిందా.. అన్నట్లనిపిస్తోంది. ఉత్సవాలు సమీపించడం, సెలవు దినం కావడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్తో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. బస్టాండు మొదలు అన్ని దారుల్లో భక్తజనం నిండిపోయారు. అన్ని మార్గాల్లో సుమారు పది కిలోమీటర్ల మేర ప్రైవేటు వాహనాలు, ఆర్టీసీ బస్సులు వరుస కట్టాయి. మేడారం, పరిసరాల్లో ప్రభుత్వ, ప్రైవేటు సత్రాలన్నీ భక్తులతో నిండిపోయాయి. చెట్టు, పుట్ట ఎక్కడ చూసినా జన సమూహామే కనిపించింది. ఇన్నాళ్లు ఖాళీగా ఉన్న పార్కింగ్ స్థలాలు వాహనాలతో నిండిపోయాయి.



అమ్మల దర్శనం కోసం జనం నుంచే మేడారం చేరుకొన్నారు. దీంతో ఉదయం ఏడు గంటల వరకే ప్రాంగణమంతా నిండిపోయింది. అధికారులు గద్దెలకు తాళాలు వేసి భక్తులనందరినీ క్యూలైన్లలోనే అనుమతించారు. భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం కంకవనం, రెడ్డిగూడెం, చిలకలగుట్ట సమీపంలోని అటవీ ప్రాంతాల్లో వంటలు చేసుకొని బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో సామూహిక భోజనాలు చేస్తూ కనిపించారు. భారీగా పెరిగిన జనంతో వ్యాపారాలు జోరుగా సాగాయి.

# అరణ్య రోదన..!

సంగారెడ్డి : ఓ వైపు ప్రభుత్వం అటవీ విస్తీర్ణం పెంచే లక్ష్యంతో మొక్కలు నాటిస్తోంది. గతంలో హరితహారం పేరిట కార్యక్రమం నిర్వహించగా, ప్రస్తుతం వన మహోత్సవంలో భాగంగా ఊరూరా మొక్కలు నాటుతున్నారు. పల్లెల్లో వననర్సరీలు ఏర్పాటు మొక్కల పెంపకానికి రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. మరోవైపు అక్రమార్కులు మాత్రం అడవులను ఇష్టానుసారంగా దోచుకుంటున్నారు. వృక్షాలను నరికేస్తూ తరలించేస్తుండటం గమనార్హం. కొందరు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది వారితో కలిసి దండుకుంటున్నట్లు విమర్శలు లేకపోలేదు. చెట్టు నరికిన స్థానంలో మొక్కలు నాటాలని నిబంధన ఉన్న ఎక్కడా అమలు కావడం లేదు.

**దందా తీరిలా..**

నాగల్గిద్ద మండలం గోప్యానాయక్ తండాలో భారీ ఎత్తున అనుమతి లేని కలప నిల్వ చేశారు. మనూరు, నాగల్గిద్ద, నారాయణఖేడ్ మండలాల్లో మంజీర పరీవాహక ప్రాంతాలు, అటవీ ప్రాంతాల్లో యథేచ్ఛగా చెట్లను కొట్టేస్తున్నారు. కలపను హైదరాబాద్, కర్ణాటక, నాందేడ్ ప్రాంతాలకు తరలిస్తున్నారు.



సదాశివపేట మండలంలోని ఓ గ్రామంలో గత నెలలో అక్రమార్కులు వృక్షాలను నరికివేశారు. వాటిని తరలిస్తుండగా, మార్గమధ్యలో అటవీ శాఖలో పని చేసే ఓ ఉద్యోగి దాన్ని అడ్డుకున్నాడు. అక్రమార్కులు అతడికి లంచం ఇచ్చి తీసుకెళ్లినట్లు సమాచారం. గతంలోనూ ఇలాంటి వాటికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

శివ్వంపేట మండలంలోనూ ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. తూప్రాన్, నర్సాపూర్ అటవీ ప్రాంతాల్లోనూ ఇది కొనసాగుతోంది.

**అధికారులే అండగా..**

అటవీ శాఖలో పని చేసే కొందరు అధికారులు, సిబ్బంది అక్రమార్కులకు అండగా నిలుస్తుండటం గమనార్హం. ఒక్కో వాహనానికి ఒక్కో రేటు చొప్పున వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

ఏ వాహనానికి ఎంతంటే..డీసీఎం: రూ.15 వేలు నుంచి రూ.20 వేలుట్రాక్టరు: రూ.10 వేలు

బొలేరో..: రూ.5 వేల నుంచి రూ.7వేలు

గతంలో తేలింది ఇలా..

మహారాష్ట్ర దూలే ప్రాంతంలోని ఓ డిపోలో అక్కడి విజిలెన్స్ అధికారులు తనిఖీ చేయగా 20 పర్మిట్లు దుర్వినియోగ మైనట్లు గుర్తించారు. దీనిపై గతేడాది సెప్టెంబరులో సంగారెడ్డి డీఎఫ్ఓకి లేఖ రాసిన విషయం విదితమే. మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అటవీ అధికారులు జారీ చేసిన పర్మిట్లు దుర్వినియోగం అయినట్లు తేలింది. ఈ దందాలో కంప్యూటర్ ఆపరేటర్ల ప్రమేయం ఉన్నట్లు డీఎఫ్ఓలు ప్రకటించడం గమనార్హం.

# మమకారం కురిపిస్తే కారాగారమే..!

కొత్తగూడెం : మా అబ్బాయి చిన్నపిల్లోడే కానీ.. ద్విచక్రవాహనం సూపర్గా నడుపుతాడు.. మా బాబు అలా.. ఇలా.. అంటూ గొప్పలకు పోయి లేనిపోని మమకారం ఒలకబోసి మైనర్లకు వాహనాలు ఇస్తే ఇకమీదట చెల్లుబాటయ్యే పరిస్థితులు లేవు సుమీ..! వల్లమాలిన ప్రేమతో మైనర్ల చేతికి వాహనాలు అప్పగించి హద్దులు దాటితే పెద్దలు కటకటాలపాలవటం ఖాయం. జిల్లా పోలీసులు ఈ విషయంపై ఈ ఏడాదిలో చట్టాన్ని పటిష‘ంగా అమలుచేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈమేరకు పోలీసు యంత్రాంగానికి ఎస్పీ బి.రోహిత్రాజు ఇప్పటికే సూచనలు చేశారు.

మైనర్లకు ఎలాంటి అర్హత లేకపోయినా ద్విచక్రవాహనాలపై విన్యాసాలు చేస్తుంటారు. రోడ్డు ప్రమాదాలు అదేస్థాయిలో విపరీతమవుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణ క్రతువులో భాగంగా పోలీసు యంత్రాంగం ఈ దిశగా అడుగులు వేస్తుంది. ఇక మీదట మైనర్లు వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కితే సంబంధిత ఇళ్లల్లో పెద్దవారిపై కేసులు నమోదుచేయనున్నారు. అవసరమైతే పెద్దల లైసెన్సులను రద్దు చేయటానికి వెనుకాడే పరిస్థితులు లేవని హెచ్చరిస్తున్నారు. పిల్లలు బాగానే వాహనం నడుపుతారనే ధీమాతో మార్కెట్ లేదా కళాశాలలకు పంపించినా తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవ్వాల్సి వస్తుంది. ఇకపై వాహనాలు ఇచ్చేముందు ఒకటికి పదిసార్లు ఆలోచించు కుని అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసులు సూచిస్తున్నారు.

తస్మాత్ జాగ్రత్త ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలు నడిపే మైనర్లను నియంత్రించేందుకు 2024 నుంచే క్రతువును పోలీసులు ఆరంభించా రు. అందులో భాగంగానే డ్రంకన్డ్రైవ్, ఈ-చలానా కేసులను విపరీతంగా పెంచుతూ వచ్చారు. డ్రంకన్ డ్రైవ్ కేసులు 2024తో పోల్చితే 2025లో 24శాతం పైగా పెరిగాయి. 2026 జనవరి ఆరంభం నుంచే మైనర్ల డ్రైవింగ్పై పోలీసులు ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించనున్నట్లు తెలిసింది.

చురకలు



# తెగబడితే.. తిరగబడేదెలా?

ఖమ్మం : నిజామాబాదు నగర శివారులో ఓ మహిళా కానిస్టేబుల్ను గంజాయి స్మగ్లర్లు కారుతో ఢీకొట్టిన ఘటన మొత్తం ఆబ్కారీ శాఖను ఉలిక్కిపడేలా చేసింది. ప్రస్తుతం బాధితురాలు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ అధికారులు, సిబ్బందిపై గంజాయి ముఠాలు దాడి చేసిన ఘటనలు గతంలో చాలా ఉన్నాయి. వాహనాలతో మీదకు దూసుకొచ్చి, మారణాయుధాలతో దాడి చేసిన సందర్భాలున్నాయి. తాజా ఘటనతో ఉభయ జిల్లాల్లో ఆబ్కారీ సిబ్బంది, అవసరాలు చర్చనీయాంశంగా మారాయి.

ఎందుకిలా?

1 ఖమ్మం జిల్లాలో ఏడు, భద్రాద్రిలో 6.. మొత్తం 13 ఆబ్కారీ స్టేషన్లున్నాయి. ఓ ఎన్ఫోర్స్మెంట్ విభాగం రెండు జిల్లాలను పర్యవేక్షిస్తుంది. టాస్క్ఫోర్స్ విభాగం జిల్లాకు ఒకటి సేవలందిస్తోంది. 13మంది సీఐలు ఉన్నా 23మంది ఎస్సైలకు ఆరుగురే పనిచేస్తున్నారు. చాలాచోట్ల హెడ్ కానిస్టేబుల్ పోస్టులు ఖాళీ. ఉమ్మడి జిల్లాలో 210 మంది సిబ్బంది ఉన్నారు. గంజాయి సాగు చేసే ఏపీ మన్యం, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు మనమీదుగానే సరకు సరఫరా అవుతోంది. ఎన్ని చెక్పోస్టులు ఏర్పాటు చేసినా అక్రమార్కులు కొత్తదారులు వెతుక్కుంటున్నారు. ఈ నేపథ్యంలో కనీసం 400మంది అందుబాటులో ఉండాలి.

2 జిల్లాకో సీఐ, ఎస్సై, పదిమంది కానిస్టేబుళ్లో మొబైల్ పార్టీలు ఏర్పాటు చేస్తున్నట్టు ఏడాది క్రితం ప్రకటించారు. సరిహద్దు ప్రాంతాల్లో గస్తీ నిర్వహించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి. నేటికీ ఈ వ్యవస్థ కార్యాచరణలోకి రాలేదు.

3 కాలంచెల్లిన అద్దె వాహనాలతోనే శాఖ ఇంకా నెట్టుకొస్తోంది. డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులకు సైతం సొంత వాహనాలు లేవు. ప్రైవేటు వాహనం ఎప్పుడు అందుబాటులో ఉంటుందో తెలియని పరిస్థితి.

4 నిత్యం గంజాయి స్మగ్లర్లు, నేరస్థులతో తలపడే తమకు ఆయుధాల సంగతి అటుంచితే కనీసం లాఠీ చేతిలో ఉండటం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శాఖ నిస్సహాయత..



గతేడాది ఖమ్మం నగరం శ్రీశ్రీ సర్కిల్ వద్ద తనిఖీ బృందాన్ని దాటుకొని గంజాయి స్మగ్లర్ల కార్లు దూసుకెళ్లిపోయాయి. అధికారులు వెంటాడే ప్రయత్నంలో వాహనం కదల్లేదు. నిందితులు పాలేరు వద్ద రాయిని ఢీకొట్టి దొరికిపోయారు. గతేడాది ఇలాంటి ఘటనలు తొమ్మిది చోటుచేసుకున్నాయి.

నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఓ నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన బృందంపై కత్తితో దాడికి దిగాడు. ఓ అధికారి చొక్కా చిరిగిపోగా సిబ్బందిలో ఒకరి చేతికి గాయమైంది.

గతేడాది పాల్వంచలో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఓ వాహనంలో రివాల్వర్లు, కత్తులు, మారణాయుధాలు దొరికాయి. ఈ కేసు రాష్ట్రంలోనే సంచలనంగా మారింది.

మణుగూరు వద్ద తనిఖీలకు వెళ్లిన ఎన్ఫోర్స్మెంట్ బృందంపై గంజాయి స్మగ్లర్లు దాడి చేశారు. ఉద్యోగ విరమణకు దగ్గర్లో ఉన్న ఓ ఎస్సై వారికి దొరికిపోగా, మిగిలిన వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పారిపోయారు.

'పెరుగుతున్న నేరాలను అదుపు చేసేందుకు ఆయుధాలు అవసరం. నేరస్థులు వాటిని చూసైనా జంకుతారు. తనిఖీలకు వెళ్లే సిబ్బందికి ఆయుధాలు ఉంటే కనీసం నిజామాబాదు లాంటి ఘటనలు జరగకుండా ఉంటాయి.'

నాగేంద్రరెడ్డి, ఖమ్మం జిల్లా ఆబ్కారీ అధికారి

# రోడ్ల మరమ్మతులకు గ్రహణం

తాండూరు: అధ్వానంగా మారిన గ్రామీణ రోడ్లను బాగు చేయడానికి ఏడాదిన్నర కిందటే రూ.15.20 కోట్లు మంజూరయ్యాయి. పనులు మాత్రం ఇప్పటికీ పూర్తి కాలేదు. కంకర, తారు తొలగి అడ్డదిడ్డంగా మారాయి. వర్షాకాలంలో సవ్యంగా వెళ్లే పరిస్థితి లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం పనులు చేయడానికి వాతావరణం అనుకూలంగా ఉన్నా.. వెరూ పట్టించుకోవడం లేదు.

**నిధుల మంజూరు ఇలా..**

తాండూరు మండలం జినగుర్తి- సంకిరెడ్డిపల్లికి రూ.కోటి, ధారూర్ వాగు సరిహద్దు నుంచి సంకిరెడ్డిపల్లి వరకు రూ.50 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బిజ్వార్కు రూ.61 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గోనూరుకు రూ.71 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డునుంచి రాంపూరుకు రూ.41 లక్షలు, పెద్దేముల్ నుంచి పెద్దేముల్ తండాకు రూ.80 లక్షలు, హన్మాపూరు ఎక్స్ రోడ్డు నుంచి జయరాంతండా సరిహద్దుకు రూ.2 కోట్లు, గిర్మాపూరు ఎక్స్ రోడ్డు నుంచి చింతామణిపట్నం, గిర్మాపూరు తండాకు రూ.83.50 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి ఖానాపూరుకు రూ.67లక్షలు, యాలాల మండలం పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కమాల్పూరు, విశ్వనాథ్పూరు వరకు రూ.1.75 కోట్లు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తిమ్మాయిపల్లికి రూ.32 లక్షలు, పీడబ్ల్యూడీ దారి నుంచి కమాల్పూరుకు రూ.21 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి నాగసమందర్కు రూ.71 లక్షలు, కోట్పల్లి మండలం అప్రోచ్ రోడ్డు నుంచి ఇందోల్కు రూ.35 లక్షలు, బషీరాబాద్ మండలం బషీరాబాద్ నుంచి కొత్లాపూరు, దామర్చేడ్కు రూ.3.25 కోట్లు, మైల్వార్ నుంచి కంసాన్పల్లి(బి) వరకు రూ.50లక్షలు, పీడబ్ల్యూడీ నుంచి మంథన్గౌడ్కు రూ.58 లక్షలు మంజూరయ్యాయి.

**17 రోడ్లు.. 34.57 కి.మీ. పొడవు..**

అన్ని మండలాల్లో 17 రోడ్లను బాగు చేస్తే 34.57 కి.మీ. దూరం బాగుపడతాయి. తాండూరు మండలంలో 5, యాలాల మండలంలో 4, బషీరాబాద్ మండలంలో 3, పెద్దేముల్ మండలంలో 4, కోట్పల్లి మండలంలో ఒక రోడ్డును బాగు చేయాల్సి ఉంది.

ఉన్నతాధికారులే నిరయం తీసుకోవాలి..

రహదారుల మరమ్మతులు చేపట్టడానికి గుత్తేదారులు ముందుకు రాకపోవడంతోనే పనులు కావడం లేదు. ఇప్పటికే ఏడు సార్లు టెండర్లు పిలిచాం. ఒక్కరూ రాలేదు. మరమ్మతుల విషయంలో ఉన్నతాధికారులు తగిన నిర?యం తీసుకోవాల్సి ఉంది.సత్యనారాయణరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఈఈ

# అరకొర వసతుల్లోనే ఏటా ఉత్సవాలు



కొడిమ్యాల : నల్లగొండ గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరగనున్నాయి. ఏటా బ్రహ్మోత్సవాలు వస్తూ.. పోతూ ఉన్నాయి కానీ సమస్యలు మాత్రం అలాగే ఉంటున్నాయి. ఉత్సవాలు, జాతరకు తరలివచ్చే భక్తులు ఆలయాల వద్ద సమస్యలతో, మౌలిక వసతుల కొరతతో ఇబ్బందులకు గురవుతున్నారు. భక్తుల ఇబ్బందులపై న్యూస్టుడే కథనం.

**మరుగుదొడ్లు నామమాత్రమే**

గుట్ట కింద, పైన రెండు ఆలయాలు ఉంటాయి. కిందనే ఉత్సవాలు జరుగుతాయి. పైన స్వామిని దర్శించుకొని కింద విందులు చేసుకుంటారు. పైన మరుగుదొడ్లు లేకపోగా.. కిందున్న ఒకటి జాతర సమయంలోనే వాడుకలోకి తీసుకొస్తున్నారు. వందల మంది భక్తులకు సరిపోక మహిళలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. ఉత్సవాల సమయంలో తడకలతో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నా.. అవి కేవలం చూడటానికి తప్ప వాడకానికి పనికిరావట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పార్కింగ్ సమస్య**

ఘాట్రోడ్డు నుంచి గుట్టపైకి వెళ్లేటప్పుడు రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. వాహనాలు ప్రమాదవశాత్తు అదుపుతప్పితే అంతే సంగతులు. వర్షాకాలం రోడ్డు కోతకు గురై మరింత ప్రమాదకరంగా మారుతోంది. జాతర సమయంలో ఆలయ పరిసరాల్లోకి రాకుండా పోలీసులు వాహనాలు నిలిపివేస్తారు. ఇదే అదనుగా కొందరు ఆలయ సమీపంలో ప్రైవేటు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి అడ్డగోలు డబ్బులు వసూలు చేస్తున్నారు. దీనిపై పోలీసులు దృష్టిసారించి పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలి. ఆలయ సమీపంలో పోలీసులు మద్యం అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

**పారిశుద్ధ్య లోపం**

భక్తులు విందులు, భోజనాల అనంతరం పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ఇతర వ్యర్థాలు అక్కడే పడేస్తున్నారు. దీంతో ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. ఉత్సవాల సమయంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని భక్తులు కోరుతున్నారు. శుద్ధజలం అందుబాటులో లేక నల్లా నీరు తాగుతున్నారు.

**గుంతలు పూడ్చాం**

ఘాట్రోడ్డుపై మట్టితో గుంతలు పూడ్చాం. శాశ్వత రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదిస్తాం. జాతర సందర్భంగా గుట్టపై స్నానాల గదులు, కొత్త క్యూలైన్లు ఏర్పాటు చేశాం. పార్కింగ్ కోసం పోలీసులతో మాట్లాడి ప్రైవేటు స్థలంలో ఏర్పాటు చేయిస్తున్నాం. ఎంపీడీవోతో మాట్లాడి పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకుంటాం. వెంకన్న, ఆలయ ఈవో

# ఈ కష్టాలు.. ఇంకెన్నాళ్లు




గంగాధర : ఈ చిత్రంలో దారి పొడవునా నిలిచిన వాహనాలు గంగాధర మండలం మంగపేట-తుర్కకాశినగర్ రైల్వే లైన్ సమీపంలోనిది. రైలు రాకతో గేటు వేయడంతో దారికిరువైపులా 2 కిలోమీటర్ల చొప్పున వాహనాలు నిలిచిపోయాయి. రైలు వెళ్లి గేటు తెరిచేసరికి సుమారు అరగంటపైనే పడుతుండటంతో ట్రాఫిక్ స్తంభించిపోయి

ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు. ఇదొక్కరోజు ఒక్కసారో కాదు.. ఒకరోజుకు 20 సార్లు ఇలాగే జరుగుతుండటంతో ప్రయాణికుల తిప్పలు అన్నీఇన్నీ కావు.

**ఈ మార్గం మీదుగానే పుణ్యక్షేత్రాలకు**

కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రెండు జిల్లాలను కలిపే ఈ రోడ్డుపై కొండగట్టు, ధర్మపురి పుణ్యక్షేత్రాలతోపాటు.. జగిత్యాలలోని పొలాస వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి వస్తుంటారు. ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర, ఇతర వాహనాలు ప్రయాణిస్తున్నాయి. అయితే మంగపేట-తుర్కకాశినగర్ రైల్వే లైన్పై నిత్యం బోధన్ నుంచి కరీంనగర్, కాచిగూడ నుంచి కరీంనగర్, కరీంనగర్ నుంచి కాచిగూడ, బోధన్కు నాలుగుసార్లు ప్యాసింజర్ రైలు నడిపిస్తుండగా.. 15 సార్లు గూడ్స్ రైళ్లు నడుస్తున్నాయి. శుక్ర, శని, ఆది, సోమవారాల్లో ఎక్స్ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. రైలు వచ్చిన ప్రతిసారి కనీసం 8 నుంచి 15 నిమిషాలు పడుతుండగా రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోతున్నాయి.

**వారధికి నిరీక్షణ?** కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఇక్కడ వారధి నిర్మించేవరకు కష్టాలు తప్పవని వాపోతున్నారు. ప్రధాన రహదారిపై గుంతలు తేలాయి. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చొరవ చూపి రైల్వే వంతెన నిర్మాణ పనులు చేపట్టి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.


**రోగుల ఆపసోపాలు**కరీంనగర్-జగిత్యాల రహదారిపై నిత్యం వేలమంది ప్రయాణిస్తుంటా రు. అయితే జగిత్యాల జిల్లాలోని ఆయా గ్రామాల నుంచి కరీంనగర్, హైదరాబాద్లోని పలు ఆసుపత్రులకు రోగులు అంబులెన్స్ వాహనాల్లో తీసుకెళ్తుండగా.. రైలు గేటు వేస్తున్న ప్రతిసారి బతుకుజీవుడా అంటూ నిట్టూరుస్తున్నారు. ఇక ఏదైనా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, నిరుద్యోగులు సమయానికి కేంద్రాలకు వెళ్లలేకపోతున్నారు. సాంకేతిక లోపంతో చాలాసార్లు వేసిన గేటు రైలు వెళ్లాక తెరిస్తే పైకి లేవక చాలా సమయం వరకు వాహనాలు నిలిచిన ఘటనలున్నాయి. కొన్నిసార్లు గేటు కిందినుంచి ద్విచక్ర వాహనదారులు వంగి వెళ్లిన సందర్భాలున్నాయంటే అతిశయోక్తి కాదు.

# జిగేల్.. ఢమాల్

మెట్పల్లి : మెట్పల్లి పట్టణంలో జాతీయ రహదారిపై రూఫ్లైట్లు పనిచేయటం లేదు. రోడ్డు మధ్యలో డివైడర్లపై నాలుగేళ్ల క్రితం హైమాస్ట్ స్తంభాలకు రూ.లక్షలు ఖర్చు చేసి వాటిని ఏర్పాటు చేశారు. దాదాపు రెండేళ్లు బాగానే పని చేశాయి. తర్వాత ఒక్కొకటిగా పనిచేయకుండా పోయాయి. 110 స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేస్తే.. ప్రస్తుతం మూడింటికే వెలుగుతున్నాయి. వర్షాలు, గాలి దుమారంతో విద్యుత్తు సరఫరాలో సమస్యలు ఏర్పడి, దీపాలు పనిచేయక అవి వెలగటం లేదని బల్దియా అధికారులు చెబుతున్నారు. కానీ వాటిని పరిశీలించి మరమ్మతులు చేయటంలో నిర్లక్ష్యం చూపుతున్నారు.

**కారణాలు తెలుసుకునే ప్రయత్నం కరవు**

రూ.లక్షల ఖర్చుతో ఏర్పాటు చేసిన రూఫ్లైట్లు చెడిపోయి నెలలు గడుస్తున్న మరమ్మతులు చేయించే వారు కరవయ్యారు. గుత్తేదారు లైట్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం 110 స్తంభాలకు గాను కేవలం మూడు స్తంభాలకు మాత్రమే లైట్లు వెలుగుతున్నాయి. వివిధ కారణాలతో దీపాలు చెడిపోయాయి. వాటికి మరమ్మతులు చేయించాల్సిన అధికారులు కనీసం పరిశీలించిన దాఖలాలు లేవు. వెలగకపోవటానికి కారణాలు కూడా తెలుసుకునే ప్రయత్నం చేయటం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రూఫ్లైట్లు పూర్తిగా వెలిగేలా చేస్తే ఖర్చు చేసిన రూ.లక్షల నిధులకు అర్థం ఉంటుంది.



**రూ.8 లక్షలతో ఏర్పాటు**

మెట్పల్లి పట్టణాభివృద్ధిలో భాగంగా జాతీయ రహదారి పైనున్న డివైడర్లపై 2022 ఏప్రిల్లో పట్టణ ప్రగతి నిధులు రూ.8లక్షలతో ఎల్ఈడీ రూఫ్(ట్రిప్) లైట్లను ఏర్పాటు చేశారు. రోడ్డుపై హైమాస్ట్ లైట్ల వెలుగులతో పాటు రంగురంగుల ఎల్ఈడీ రూఫ్లైట్లతో పట్టణమంతా జిగేల్మంది. పోలీస్స్టేషన్ నుంచి ఏకలవ్యనగర్ వరకు 80 స్తంభాలతో పాటు బస్సు డిపో మలుపు నుంచి వేంపేటరోడ్లో రైల్వేగేట్ సమీపం వరకు సుమారు 30 స్తంభాలకు.. ఇలా మొత్తం 110 స్తంభాలకు రూఫ్లైట్లను ఏర్పాటు చేసి ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు.

# యుద్ధానికి సన్నద్ధం

ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పురపాలిక ఎన్నికలకు అన్ని పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. కొద్ది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుండటంతో వ్యూహాలకు పదును పెడుతున్నాయి. అభ్యర్థుల ఎంపికకు పార్టీ శ్రేణులతో సమావేశమవుతూ పుర సమరానికి సిద్ధం చేస్తున్నాయి. సమయం తక్కువగా ఉండటంతో కొన్నిచోట్ల ఇప్పటికే ప్రచారం షురూ చేశారు.

**గులాబీ శ్రేణుల్లో ఇన్ఛార్జిల కోలాహలం**

ఎన్నికల కోలాహలం మొదలయ్యాక మధిర, ఇల్లెందు, కొత్తగూడెం, సత్తుపల్లిలో భారాస నాయకులు ముందస్తుగా సన్నద్ధమయ్యారు. మిగిలిన చోట్ల స్థానిక నాయకులు చర్చలు, వార్డుల సమావేశానికి పరిమితమయ్యారు. అభ్యర్థుల ఎంపికకు ఎమ్మెల్సీలు, ఎంపీలు, గతంలో కార్పొరేషన్ ఛైర్మన్గా పనిచేసిన వారిని అధిష్ఠానం పురపాలికల వారీగా ఇన్ఛార్జిలుగా ప్రకటించింది. ఏదులాపురంలో వార్డుల వారీగా కూడా ఇన్ఛార్జిలను నియమించారు.

**భారాస, సీపీఎం 'పొత్తుబంధం'**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో క్షేత్ర స్థాయిలో అవగాహన మేరకు భారాస, సీపీఎం మధ్య పొత్తు కుదిరింది. ఖమ్మం జిల్లాలో సీపీఎం బలంగా ఉన్న వైరా, మధిర, ఏదులాపురం పురపాలికలో భారాసతో కలిసి బరిలోకి దిగనుంది. ఇప్పటికే ఈ మూడింటిపై అవగాహన కుదిరినట్లు తెలిసింది. కల్లూరు, సత్తుపల్లిలో భారాస ఒంటరిగా పోటీ చేయనుంది. ఇల్లెందు, అశ్వారావుపేటలోనూ ఇదే పరిస్థితి ఉండొచ్చు. బలమున్న చోట వార్డులు ఇవ్వడానికి గులాబీ పార్టీ సిద్ధమవుతోంది.

ఖరారు కాని సీపీఐ మిత్రపక్షం

ఏదులాపురంలో సీపీఐకి బలం ఉంది. కొన్ని వార్డుల్లో సొంతంగా గెలుస్తామనే ధీమాతో పార్టీ నాయకులున్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ పీఠంపై ఇటు సీపీఐ, అటు కాంగ్రెస్ కన్నేసిన నేపథ్యంలో పొత్తుపై ఆసక్తి నెలకొంది. గత శాసనసభ, పంచాయతీ ఎన్నికల్లో తరహాలో రెండింటి మధ్య పొత్తు పొడుస్తుందో లేదో తేలాల్సి ఉంది.

సర్వేలకు కాంగ్రెస్ ప్రాధాన్యం

భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం కార్పొరేషన్, ఇల్లెందు, అశ్వారావుపేట మున్సిపల్, ఖమ్మం జిల్లాలో ఏదులాపురం, వైరా, సత్తుపల్లి, కల్లూరు, మధిర పురపాలికల్లో ఎన్నికలు జరగనున్నాయి. క్లీన్స్వీప్ చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్ఛార్జిలుగా మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ను నియమించారు. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరికి వారు పార్టీ శ్రేణులతో సమావేశమవుతున్నారు. ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఇల్లెందు, ఏదులాపురం, కొత్తగూడెం, అశ్వారావుపేట, సత్తుపల్లి, కల్లూరు పురపాలికల ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, జారె ఆదినారాయణతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సర్వే ఆధారంగా గెలుపు అవకాశాలున్న అభ్యర్థులకు బీ ఫామ్ ఇస్తామని, రెబల్గా దిగితే నష్టం తప్పదని హెచ్చరించారు.

**అన్నింటా కాషాయం పోటీ**

ఉమ్మడి జిల్లాలోని అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు భాజపా సిద్ధమవుతోంది. కొత్తగూడెంలో ఎన్నికల విజయ సంకల్ప సభలో కేంద్ర మంత్రి కిషన్రెడ్డి పాల్గొని నాయకులు, కార్యకర్తలు దిశానిర్దేశం చేశారు. ప్రజలు పార్టీ వైపు మొగ్గుచూపుతున్నారని, ఈ అవకాశాన్ని వదులుకోవద్దని, పట్టణాల్లో కాషాయం జెండా ఎగరవేయాలని కోరారు.

# ఊరిబాగుకు 'ఉపాధి'

పెద్దపల్లి : కోటి ఆశలతో పంచాయతీల్లో పాలకవర్గాలు పగ్గాలు చేపట్టగా గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఉవ్విళ్లూరుతున్న సర్పంచులకు కొన్ని సవాళ్లు ఎదురుకానున్నాయి. పంచాయతీల్లో నిధుల సమస్య వెంటాడుతుండగా ప్రతీ చిన్న పనికి దిక్కులు చూసే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పల్లెల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం బాసటగా నిలవనుంది. ప్రస్తుతం ఈ పథకాన్ని మార్చిన కేంద్రం వికసిత్ భారత్ – గ్యారంటీ రోజ్గార్ అండ్ అజీవికా మిషన్ (వీబీ-జీ రాం జీ)గా చట్టం చేసినా ఎప్పటి నుంచి అమలు చేస్తారన్న విషయమై స్పష్టత లేదు.

**కొత్త చట్టం ప్రభావం** వీబీ జీ రాం జీ చట్టం పనులపై కొంత ప్రభావం చూపనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు కూలీలకు కేంద్రం 90 శాతం, రాష్ట్రం 10 శాతం నిధులు కేటాయించేది. సామగ్రి వాటాలో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రం మంజూరు చేసేది. కొత్త చట్టంలో కూలీలకు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు విడుదల చేయాల్సి ఉంది. తాజా విధానంలో కూలీలకు కొంత ఇబ్బంది లేకున్నప్పటికీ సామగ్రి వాటాలో చేసే పక్కా భవనాలు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఆటంకం కలగనుంది. కొత్త చట్టం అమలుపై మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

**భూగరోజలాలకు భరోసా**

గుట్టలు, అటవీ ప్రాంతాల్లో కాంటూరు, సమతల కందకాలు నిర్మిస్తే భూగరోజలాలు పెరగనున్నాయి. ఆయకట్టు పెంపునకు చెరువులు, కాలువల పూడికతీత, పునరుద్ధరణ పనులు, చెక్డ్యాంలు, ఊట కుంటలు నిర్మించుకోవచ్చు.

**266 పనులకు అవకాశం**

గ్రామాల అభివృద్ధి ఎక్కువగా ఉపాధి హామీపై ఆధారపడనుంది. దీని ద్వారా 266 రకాల పనులు చేసుకోవచ్చు.సిమెంట్ రోడ్ల నిర్మాణానికి కూలీల, పని నిష్పత్తి ఆధారంగా నిధులు కేటాయిస్తున్నారు.

పంట భూములకు ఎరువులు, విత్తనాలు తీసుకెళ్లేందుకు దారులు



నిర్మించుకోవచ్చు.

జనావాసాల్లోని వృథా నీరు రోడ్లపై చేరకుండా మురుగు కాలువల నిర్మాణానికి అవకాశం ఉంది.

పంచాయతీలకు సొంత గూడు, పాఠశాలలు, అంగన్వాడీ భవనాలు నిర్మించుకునే వీలుంది.వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు నిర్మించుకునేందుకు నిధులు రానున్నాయి.

వన మహోత్సవంలో మొక్కల పెంపకం, బంజరు, బీడు భూముల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టవచ్చు.

ఉమ్మడి జిల్లా వివరాలుసొంత భవనాలు లేని పంచాయతీలు : 584

గూడు లేని అంగన్వాడీ కేంద్రాలు : 973

పునరుద్ధరణకు నోచుకోని చెరువులు : 2,758నిర్మించాల్సిన సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు : 847 కి.మీ.ల పొడవు

# రోడ్ల మరమ్మతులకు గ్రహణం

తాండూరు: అధ్వానంగా మారిన గ్రామీణ రోడ్లను బాగు చేయడానికి ఏడాదిన్నర కిందటే రూ.15.20 కోట్లు మంజూరయ్యాయి. పనులు మాత్రం ఇప్పటికీ పూర్తి కాలేదు. కంకర, తారు తొలగి అడ్డదిడ్డంగా మారాయి. వర్షాకాలంలో సవ్యంగా వెళ్లే పరిస్థితి లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం పనులు చేయడానికి వాతావరణం అనుకూలంగా ఉన్నా.. వెరూ పట్టించుకోవడం లేదు.

**నిధుల మంజూరు ఇలా..**

తాండూరు మండలం జిన్‌గుర్తి- సంకిరెడ్డిపల్లికి రూ.కోటి, ధారూర్ వాగు సరిహద్దు నుంచి సంకిరెడ్డిపల్లి వరకు రూ.50 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బిజ్వార్‌కు రూ.61 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గోనూరుకు రూ.71 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డునుంచి రాంపూరుకు రూ.41 లక్షలు, పెద్దేముల్ నుంచి పెద్దేముల్ తండాకు రూ.80 లక్షలు, హన్మాపూరు ఎక్స్ రోడ్డు నుంచి జయరాంతండా సరిహద్దుకు రూ.2 కోట్లు, గిర్మాపూరు ఎక్స్ రోడ్డు నుంచి చింతామణిపట్నం, గిర్మాపూరు తండాకు రూ.83.50 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి ఖానాపూరుకు రూ.67లక్షలు, యాలాల మండలం పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కమాల్‌పూరు, విశ్వనాథ్‌పూరు వరకు రూ.1.75 కోట్లు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తిమ్మాయిపల్లికి రూ.32 లక్షలు, పీడబ్ల్యూడీ దారి నుంచి కమాల్‌పూరుకు రూ.21 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి నాగసమందర్‌కు రూ.71 లక్షలు, కోట్‌పల్లి మండలం అప్రోచ్ రోడ్డు నుంచి ఇందోల్‌కు రూ.35 లక్షలు, బషీరాబాద్ మండలం బషీరాబాద్ నుంచి కొత్లాపూరు, దామర్‌చేడ్‌కు రూ.3.25 కోట్లు, మైల్వార్ నుంచి



కంసాన్‌పల్లి(బి) వరకు రూ.50లక్షలు, పీడబ్ల్యూడీ నుంచి మంథన్‌గౌడ్‌కు రూ.58 లక్షలు మంజూరయ్యాయి.

**17 రోడ్లు.. 34.57 కి.మీ. పొడవు..**

అన్ని మండలాల్లో 17 రోడ్లను బాగు చేస్తే 34.57 కి.మీ. దూరం బాగుపడతాయి. తాండూరు మండలంలో 5, యాలాల మండలంలో 4, బషీరాబాద్ మండలంలో 3, పెద్దేముల్ మండలంలో 4, కోట్‌పల్లి మండలంలో ఒక రోడ్డును బాగు చేయాల్సి ఉంది.

ఉన్నతాధికారులే నిరయం తీసుకోవాలి..

రహదారుల మరమ్మతులు చేపట్టడానికి గుత్తేదారులు ముందుకు రాకపోవడంతోనే పనులు కావడం లేదు. ఇప్పటికే ఏడు సార్లు టెండర్లు పిలిచాం. ఒక్కరూ రాలేదు. మరమ్మతుల విషయంలో ఉన్నతాధికారులు తగిన నిర?యం తీసుకోవాల్సి ఉంది.సత్యనారాయణరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఈఈ

# ఊరిబాగుకు 'ఉపాధి'

పెద్దపల్లి : కోటి ఆశలతో పంచాయతీల్లో పాలకవర్గాలు పగ్గాలు చేపట్టగా గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఉవ్విళ్లూరుతున్న సర్పంచులకు కొన్ని సవాళ్లు ఎదురుకానున్నాయి. పంచాయతీల్లో నిధుల సమస్య వెంటాడుతుండగా ప్రతీ చిన్న పనికి దిక్కులు చూసే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పల్లెల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం బాసటగా నిలవనుంది. ప్రస్తుతం ఈ పథకాన్ని మార్చిన కేంద్రం వికసిత్ భారత్ – గ్యారంటీ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (వీబీ–జీ రాం జీ)గా చట్టం చేసినా ఎప్పటి నుంచి అమలు చేస్తారన్న విషయమై స్పష్టత లేదు.

**కొత్త చట్టం ప్రభావం**

వీబీ జీ రాం జీ చట్టం పనులపై కొంత ప్రభావం చూపనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు కూలీలకు కేంద్రం 90 శాతం, రాష్ట్రం 10 శాతం నిధులు కేటాయించేది. సామగ్రి వాటాలో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రం మంజూరు చేసేది. కొత్త చట్టంలో కూలీలకు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు విడుదల చేయాల్సి ఉంది. తాజా విధానంలో కూలీలకు కొంత ఇబ్బంది లేకున్నప్పటికీ సామగ్రి వాటాలో చేసే పక్కా భవనాలు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఆటంకం కలగనుంది. కొత్త చట్టం అమలుపై మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

**భూగర్భజలాలకు భరోసా**

గుట్టలు, అటవీ ప్రాంతాల్లో కాంటూరు, సమతల కందకాలు నిర్మిస్తే భూగర్భజలాలు పెరగనున్నాయి. ఆయకట్టు పెంపునకు చెరువులు, కాలువల పూడికతీత, పునరుద్ధరణ పనులు, చెక్‌డ్యాంలు, ఊట కుంటలు నిర్మించుకోవచ్చు.

**266 పనులకు అవకాశం**

గ్రామాల అభివృద్ధి ఎక్కువగా ఉపాధి హామీపై ఆధారపడనుంది. దీని ద్వారా 266 రకాల పనులు చేసుకోవచ్చు.సిమెంట్ రోడ్ల నిర్మాణానికి కూలీల, పని నిష్పత్తి ఆధారంగా నిధులు కేటాయిస్తున్నారు.



పంట భూములకు ఎరువులు, విత్తనాలు తీసుకెళ్లేందుకు దారులు నిర్మించుకోవచ్చు.

జనావాసాల్లోని వృథా నీరు రోడ్లపై చేరకుండా మురుగు కాలువల నిర్మాణానికి అవకాశం ఉంది.

పంచాయతీలకు సొంత గూడు, పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు నిర్మించుకునే వీలుంది.వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు నిర్మించుకునేందుకు నిధులు రానున్నాయి.

వన మహోత్సవంలో మొక్కల పెంపకం, బంజరు, బీడు భూముల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టవచ్చు.

ఉమ్మడి జిల్లా వివరాలు

సొంత భవనాలు లేని పంచాయతీలు : 584

గూడు లేని అంగన్‌వాడీ కేంద్రాలు : 973

పునరుద్ధరణకు నోచుకోని చెరువులు : 2,758

నిర్మించాల్సిన సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు : 847 కి.మీ.ల పొడవు

# కోకాపేటలో ఇల్లు కట్టేద్దాం..!



హైదరాబాద్ : కోకాపేటలో ఇల్లు కట్టుకుంటే దర్జాగా ఉండొచ్చన్న అంచనాతో కొందరు ప్రభుత్వ భూములపై కన్నేశారు.సర్కారు స్థలాల్లో గుడిసెలు, చిన్న ఇల్లు కట్టుకుని క్రమబద్ధీకరించుకున్న వారి వివరాలను సేకరిస్తున్నారు. వారి పట్టాలను తీసుకుని నకిలీ పట్టాలు సృష్టించి ఇల్లు కట్టుకుంటున్నారు. 80, వంద గజాల్లో అంతస్తులు నిర్మిస్తున్నారు. అధికారులకు అనుమానం వచ్చి పరిశీలించగా... కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి కట్టుకుంటున్నారని తేలింది. కోకాపేటతో పాటు మణికొండలోనూ ఓ వ్యక్తి 60గజాల స్థలాన్ని ఆక్రమించి ఇల్లు కట్టాడు.

**దర్జాగా ఆక్రమణలు:** కోకాపేట, పుప్పాలగూడ, మణికొండ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములున్న కొన్ని ప్రాంతాల్లో వివాదాలు కొనసాగుతున్నాయి. రెవెన్యూ అధికారులు వీటిపై దృష్టిసారించడంతో రియల్ వెంచర్ల ప్రతినిధులు, పేదలకు ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములను ఆక్రమించుకోవడం ప్రారంభించారు. తాజాగా కోకాపేటలో నలుగురు వ్యక్తులు సర్వేనంబరు 147లోని 80 గజాల చొప్పున కొన్ని ప్లాట్లకు మార్కింగ్ వేసి ఇల్లు కట్టుకుంటున్నారు. అధికారులు పట్టాలను పరిశీలించగా... రంగారెడ్డి కలెక్టర్‌గా విధులు నిర్వహించిన హరీష్ సంతకంతో జారీచేసిన పట్టాగా ఉంది. ఫోరెన్సిక్ పరీక్ష చేయించగా... హరీష్ సంతకం కాదని తేలింది.

**సమగ్ర సర్వే నిర్వహిస్తాం** గండిపేట్ మండలంలోని ప్రభుత్వ భూములను ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారన్న సమాచారం ఉంది. 60గజాలు, 80 గజాల చొప్పున నాలుగైదు ప్లాట్లను ఆక్రమించి బహుళ అంతస్తుల భవనాలను నిర్మించాలన్నదే వారి ప్రణాళిక. భూములన్నింటినీ పరిశీలించి సమగ్రసర్వే నిర్వహించనున్నాం.ఎన్.శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్

# ఒక్క క్లిక్.. వివాదాలకు చెక్



హైదరాబాద్ : ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పట్టణ భూగరిష్ఠ పరిమితి భూములను రక్షించేందుకు రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారు. పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం(అర్బన్ ల్యాండ్ సీలింగ్) పరిధిలోని సర్కారు భూముల వివరాలను 'ఈ–కోర్టు–యూఎల్‌సీ ఆర్ఆర్' పోర్టల్‌లో నమోదు చేశారు. తాము యూఎల్‌సీ పరిధిలోకి రామని, తమ భూములు ఇప్పించాలంటూ కొందరు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఇవన్నీ తప్పేనంటూ రుజువు చేసేందుకు ఈ–కోర్టు పోర్టల్‌లోని ఆధారాలను ట్రిబ్యునల్ కోర్టులు, హైకోర్టులకు రెవెన్యూ అధికారులు సమర్పించనున్నారు. శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, రాజేంద్రనగర్, ఎల్బీనగర్, శంషాబాద్, మొయినాబాద్, చేవెళ్ల, మహేశ్వరం ప్రాంతాల్లో పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టంలో భాగంగా తొమ్మిదివేల ఎకరాలకుపైగా ఇప్పటికీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఎకరా రూ.25కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకూ పలుకుతోంది. కొందరు ప్రైవేటు వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఓ రియల్ వెంచర్ సంస్థ ప్రతినిధులు తాము యూఎల్‌సీ పరిధిలోకి రాని భూములను కొనుగోలు చేశామని, నాలా కన్వర్షన్ చేయాలంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా... రెవెన్యూ అధికారులు వారు సమర్పించిన ఆధారాలు సరైనవికావంటూ నిరూపించారు.

**ముందు జాగ్రత్తలు.. డిజిటల్ వివరాలు**

పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం ప్రకారం ప్రభుత్వానికి వచ్చిన భూముల సమగ్ర వివరాలను జియోట్యాగింగ్ ద్వారా డిజిటల్ రికార్డులుగా మార్చారు. యూఎల్‌సీ భూములున్న సర్వేనంబర్లలో స్థలాలు ప్రభుత్వం ఆధీనంలో ఉన్నాయా.. ఎవరైనా కోర్టుల్లో ఫిర్యాదులు చేశారా.. వివరాలు ఇందులో పొందుపరిచారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నుంచి కలెక్టర్ వరకూ ఒక్క క్లిక్‌తో వివరాలన్నీ తెలుసుకునేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు.ప్రజల అవసరాల దృష్ట్యా రక్షణ

రంగారెడ్డి జిల్లాలో భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకుని పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం భూములను కాపాడుకుంటున్నాం. న్యాయస్థానాల్లోని ఫిర్యాదులు, విచారణల సందర్భేగా రికార్డులను సులభంగా చూసుకునేందుకు వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉంటాయి. ప్రస్తుతం 900 ఎకరాల భూములపై వివాదాలు కొనసాగుతున్నాయి. పరిష్కరించేందుకు న్యాయస్థానాలకు త్వరలో ఆధారాలను సమర్పించనున్నాం.సి.నారాయణరెడ్డి, కలెక్టర్,రంగారెడ్డి

# అతివలకు ఆదాయ సృష్టి



బొంరాస్‌పేట : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపడుతోంది. మహిళా సాధికారత, ఆదాయం పెంపు, పాడి అభివృద్ధే లక్ష్యంగా ఇందిరా డెయిరీ ప్రాజెక్టును చేపట్టాలని నిర?యించింది. ఈ పథకం కింద స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రెండు గేదెలు లేదంటే ఆవులు పంపిణీ చేయనుంది. ఈ పథకంతో అతివలకు జీవనోపాధి లభించడమే కాకుండా ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి అవకాశం కలుగుతుంది.

**పెరగనున్న పశుసంతతి, పాల ఉత్పత్తి**

గ్రామాల్లో పశువుల సంఖ్య బాగా తగ్గిపోయింది. వ్యవసాయ పనులు యంత్రాలతో చేయడం, గ్రామాల్లో ఖాళీ ప్రదేశాలు తగ్గి మేతకు కొరత ఏర్పడడంతో పశువులను పెంచుకోవడం తగ్గించారు. దీంతో వాటి సంతతి తగ్గడంతోపాటు పాల ఉత్పత్తి బాగా పడిపోయింది. ప్రభుత్వం అమలు చేసే డెయిరీ ప్రాజెక్టుతో గ్రామాల్లో 31,324 గేదెలు లేదా ఆవుల సంతతి జిల్లాలో అదనంగా పెరుగుతుంది.

**రూ.2 లక్షలతో గేదెలు లేదా ఆవులు..**

ప్రతి మండలాన్ని మూడు జోన్లుగా విభజిస్తారు. పది గ్రామాలను యూనిట్‌గా ఏర్పాటు చేస్తారు. పథకంలో ఒక్కో యూనిట్ ధర రూ.2 లక్షలు. ఇందులో ప్రభుత్వం రూ.1.40 లక్షలు రాయితీ ఇస్తుంది. మిగిలిన రూ.60వేలు బ్యాంకులు రుణంగా అందిస్తాయి. ఈ డబ్బుతో రెండు గేదెలు లేదంటే రెండు ఆవులు కొనిస్తారు. పశువులకు గడ్డి, దాణా సరఫరాను స్థానిక యువతకు అప్పగించి వారికి ఉపాధి కల్పించనున్నారు.

**కొడంగల్‌లో మైనార్టీల కోసం..**

సీఎం నియోజకవర్గం కొడంగల్‌ను ఇందిరా డెయిరీ షీప్ ఫార్మింగ్ పథకానికి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. దీంతో నాలుగు మండలాల్లో 315 మంది మైనార్టీలకు గేదెలు, మేకలు ఇవ్వాలని ప్రభుత్వం నిర?యించింది. వీరికి రూ.2లక్షల యూనిట్ ధరలో రూ.1.60 లక్షలు రాయితీ, రూ.40వేలు బ్యాంకు రుణం ఇస్తుంది. ఇప్పటికే 20 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. మిగిలిని వారినీ ఎంపిక చేస్తామన్నారు.

గ్రామపంచాయతీలు: 594

మొత్తం స్వయం సహాయక సంఘాలు: 15,662

గ్రామైక్య సంఘాలు: 657

మండల మహిళా సమాఖ్యలు: 19

సంఘాల్లోని సభ్యులు: 1,63,703

# ఆచరిస్తే.. అభివృద్ధికి అడుగు

కరీంనగర్ : 2026 కొత్త సంవత్సరం ప్రారంభం అయింది. జిల్లాలో గతంలో కంటే మెరుగైన అభివృద్ధికి అడుగులు పడాల్సిన అవసరముంది. గత సంవత్సరం(2025)లో ప్రభుత్వాలు ప్రకటించిన పలు పథకాలు, పనులు, ఉపాధి, విద్యారంగ అభివృద్ధికి దోహదపడుతున్నాయి. పాలకులు, అధికార యంత్రాంగం దృష్టిసారిస్తే మరింత మెరుగైన ఫలితాలు లభించనున్నాయి.

**తెలంగాణ బ్రాండ్ కొరమీను**

తెలంగాణలో లభించే బొమ్మె(కొరమీను)ను కేంద, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. కరీంనగర్‌లోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో పెంపకానికి సంబంధించి శిక్షణ కేంద్రంతోపాటు ఉత్పత్తి చేపట్టాలని ప్రభుత్వం రూ.5.60 కోట్ల నిధులు మంజూరు చేసింది. మొదటి విడతగా రూ.కోటి మంజూరు చేశారు. తద్వారా మత్స్యకారులకు మరింత ఉపాధి పెరగనుంది.

**శాతవాహన పరిధిలో లా కళాశాల**

శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో లా కళాశాల మంజూరైంది. ఎల్ఎల్ఎం, ఎల్ఎల్‌బీ కోర్సులు ప్రవేశపెట్టారు. ప్రస్తుతం ఎల్ఎల్‌బీ కోర్సుకు సంబంధించి సీట్ల కేటాయింపు జరిగింది. దీంతో ఇక్కడి విద్య మరింత మెరుగుపడనుంది.

**అటోమేటిక్ టెస్టింగ్ సెంటర్**

మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో కరీంనగర్ జిల్లా కేంద్రంగా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షించే అటోమేటిక్ టెస్టింగ్ కేంద్రం మంజూరైంది. రూ.8.50 కోట్లతో ఏర్పాటు చేసే ఈ కేంద్రం శంకుస్థాపనకే పరిమితమైంది. ఈ పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

అమృత్‌తో తీరనున్న తాగునీటి కష్టాలు



కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో గతంలోని విలీన కాలనీలకు తాగునీటి సరఫరా మెరుగుపర్చేందుకు అమృత్ 2.0 కింద రూ.142 కోట్లు కేటాయించారు. ఈ ఏడాది జూన్ 2026 కల్లా పనులు పూర్తి చేస్తే నీటి కష్టాలు దూరమవుతాయి.

మానేరు రివర్‌ఫ్రంట్

మానేరు రివర్ ఫ్రంట్ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికే ఆ పనులు కొంతమేర జరగగా మిగతావి చేసేలా పాలకులు స్పందించాలి.

**నిధులు అవసరం**

కరీంనగర్ విస్తీర?ం పెరగగా మౌలిక వసతులకు రూ.50 కోట్లు మంజూరుకాగా టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించాల్సి ఉంది. ముఖ్యమంత్రి హామీ నిధులకు సంబంధించిన పెండింగ్ పనులు రెండేళ్లుగా ఆగిపోయాయి. ఈ నిధులు విడుదల చేసి పాత 60 డివిజన్లలో 64 పనులు పూర్తి చేస్తే ఆయా ప్రాంతవాసులకు ఇబ్బందులు దూరం కానున్నాయి.

చెత్త శుద్ధీకరణ సాగాలి నగరంలో డంపింగ్‌యార్డు నిండిపోయింది. బయోమైనింగ్ ద్వారా చేపడుతున్న శుద్ధీకరణను వేగంగా చేపడితే చెత్త నిల్వలు తగ్గే అవకాశముంది. ప్రస్తుతం ఉన్న యంత్రాలతోపాటు మరో రెండు యంత్రాలు ఏర్పాటు చేయడంతోపాటు ఉత్పత్తి ప్రక్రియకు పచ్చజెండా ఊపాలి.

# బండరాతి గుట్ట.. అక్రమ పేలుళ్లకు అడ్డా

పెద్దపల్లి: పెద్దరాళ్లను పగులగొట్టడానికి చిన్నపాటి పేలుళ్లకు అనుమతులు పొందుతూ అక్రమార్కులు ఒకేసారి గుట్టను కూల్చేందుకు బోర్‌బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్నారు. దీంతో సమీప పొలాల్లో రాళ్లు ఎగిరిపడుతున్నాయి. ఎగిసిపడే దుమ్ము దిగుబడులపై ప్రభావం చూపగా రైతులు ఆందోళన చెందుతున్నారు.రాళ్లు కొట్టి ఉపాధి పొందే కూలీల స్థానంలో జిల్లాలో పేలుడు పదార్థాల వినియోగం పెరగడంతో పర్యావరణ హననం జరుగుతోంది. అనుమ తులకు, క్షేత్రస్థాయిలో చర్యలకు పొంతన లేకుండా అక్రమ దందా యథేఛగా సాగుతోంది. సమస్యలు వచ్చినప్పుడు మినహా పేలుళ్లపై చూసీచూడనట్లు వ్యవహరించే అధికారుల తీరు తరచూ వివాదాస్పదమవుతోంది.

**కఠవైన నియంత్రణ**

క్వారీల్లో పేలుళ్ల నియంత్రణపై పర్యవేక్షణ లేకపోవడంతో జిల్లావ్యాప్తంగా ఈ దందా జోరుగా సాగుతుంది. బొంపల్లిలో పేలుడు పదార్థాల నిల్వ కేంద్రం ఉండగా పాలకుర్తి మండలం కన్నాల, మంథని,



జూలపల్లి, ధర్మారం ప్రాంతాలకు రవాణా జరుగుతోందన్న ఆరోపణలున్నాయి.

ప్రతిరోజు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఆరు గంటల మధ్య అక్రమ రవాణా సాగుతున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం బొంపల్లిలోని నిల్వ కేంద్రం బొంపల్లి గుట్టలపై జరిగే పేలుళ్లకే పేలుడు పదార్థాలను సరఫరా చేయాలి. కానీ ఇతర ప్రాంతాల్లో అనుమతుల్లేని క్వారీలకు అక్రమ రవాణా జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

**ధ్వంసం కాగా..** భూమి లోపలి వరకు రాళ్లను తవ్వుకుంటూ వెళ్లడంతో జిల్లాలోని వివిధ క్వారీల్లో లోతైన లోయలు ఏర్పడుతున్నాయి. వీటిలోని బండరాయిని తొలిచేందుకు పేలుడు పదార్థాలు ఎక్కువగా వినియోగించడంతో వీటికి డిమాండ్ పెరిగింది. పేలుళ్ల కారణంగా పెద్దపల్లి మున్సిపాలిటీకి చెందిన పాత నీటిశుద్ధి కేంద్రం ధ్వంసమైంది. ఇక్కడి పోచమ్మ గుట్ట ప్రమాదంలో పడింది. కన్నాలలో జరుగుతున్న పేలుళ్లు, లోయలాంటి గోతులు భారీగా ఉండటంతో బసంత్‌నగర్ సమీపంలో విమానాశ్రయానికి సైతం గతంలో వైమానిక అధికారులు అనుమతులివ్వలేని పరిస్థితి ఏర్పడింది. విచారణ చేపడతాంనిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులొస్తే విచారణ చేపడతాం. కఠిన చర్యలు తీసుకుంటాం.శ్రీనివాస్, జిల్లా మైనింగ్ అధికారి

# వక్క పంట.. దిగుబడి పక్కా



హిందూపురం: వక్క పంట సాగు, తోటల పెంపకం అంటేనే మడకశిర పరిధిలోని అమరాపురం, అగళి, రొళ్ల, గుడిబండ, పొరుగున ఉన్న కర్ణాటక ప్రాంతాల్లోనే ప్రాధాన్యం ఉండేది. ఇప్పుడు హిందూపురం ప్రాంతంలో అరకొరగా ప్రారంభమై ప్రస్తుతం 400 ఎకరాల విస్తీర్ణంలో వక్క పంట విస్తరించింది. ఇక్కడి రైతులు 20 సంవత్సరాల కిందట ప్రధానమైన వాణిజ్య పంట వేరుసెనగ, మల్బరీ, ఇతరత్రా పంటలపై ఆధారపడి జీవనం సాగించేవారు. వర్షాభావం, తెగుళ్ల ప్రభావం, ఇతరత్రా కారణాలతో ఏడాది ఏడాదికీ నష్టాలు రావడంతో పెట్టుబడి ఖర్చులు కూడా చేతికందక దిక్కుతోచని స్థితిలో ఉంటూ వ్యవసాయ మంటేనే విసుగు చెందుతున్న అన్నదాతలకు ప్రత్యామ్నాయంగా వక్క పంట ఊరట ఇస్తోంది.

**ఇదిగో వేరు వేశారు..**

చలివెందల పంచాయతీలో రైతులు మధుసూధనరెడ్డి 10 ఎకరాలు, వెంకటరెడ్డి 5, దళపతిరావు 3, గంగాధరప్ప 2, శ్రీనివాసరెడ్డి 1 ఎకరంలో, గ్రామీణ మండలానికి ఉత్తర దిక్కున, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లోని 25 గ్రామాల్లో 40 మంది రైతు కుటుంబాలు ఎకరా, అర్థ ఎకరా సాగుచేస్తున్నారు.

**మార్కెట్ సౌకర్యం ఉంటే మరింత లాభం**

మడకశిర ప్రాంతంలో ప్రభుత్వం మార్కెట్ సదుపాయం కల్పిస్తే రైతులకు ప్రయోజనంగా ఉంటుంది. ప్రతి రైతూ వచ్చిన అవకాశాన్ని ఆలోచించి నిర్ణయం తీసుకొని ఆచరణలో పాటిస్తే రైతేరాజు అవుతాడనేది వాస్తవం.

**2020లో నాటాను** అమరాపురంలో బంధువులు ఉండటంతో తరచూ వెళ్లేవాడిని. అక్కడి రైతులు సాగుచేస్తున్న వక్కపంటను చూసి అడిగాను. సొంతూరు చలివెందలలో నాకున్న 2 ఎకరాల పొలంలో 2020లో నర్సరీ వక్క మొక్కలను తెచ్చి నాటుకున్నాను. ఐదేళ్లు స్వయంగా యాజమాన్య పద్ధతులను పాటించి తోట పెంపకం అయ్యేలా కాపాడుకున్నాను. ఒక సంవత్సరం నుంచి దిగుబడి తీసుకుంటున్నాను. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి ఖర్చు వచ్చింది. తాజాగా 45 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కర్ణాటక ప్రాంతం నుంచి వచ్చే వ్యాపారులకు క్వింటాల్ రూ.6వేలకు అమ్ముకున్నాను. రూ.4.50లక్షల ఆదాయం వస్తే ఖర్చులు పోనూ రూ.3.50లక్షల నికరాదయం దక్కింది. ఏడాది కాలంలో స్థిరాస్థులు సంపాదించకపోయినా కూతురు, కుమారుడి పెళ్లి చేశాను. కొద్దిపాటిగా ఉన్న అప్పులు తీర్చుకున్నాను. మొత్తంమీద హిందూపురం ప్రాంత రైతులకు ఇది ఊరట నిస్తూ వరంగా సంక్రమించిందని నా అభిప్రాయం. గంగాధరప్ప, రైతు

# భూముల విలువ పెంపు

భీమవరం : స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఫిబ్రవరి ఒకటో నుంచి కొత్త మార్కెట్ విలువలు అమల్లోకి రానున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని సాధారణ రోజుల్లో కంటే రెట్టింపు సంఖ్యలో స్లాట్లు బుక్ చేసుకునే సౌకర్యాన్ని ఆ శాఖాధికారులు కల్పించారు. ఉదాహరణకు భీమవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇప్పటి వరకు రోజుకి 58 దస్త్రాలు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు స్లాట్ల సౌకర్యం ఉంది. ఇప్పుడు దాన్ని 117కి పెంచారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని 15, ఏలూరు జిల్లాలోని 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ స్లాట్ల సంఖ్య పెంచారు.

**పశ్చిమ గోదావరి జిల్లాలో:** భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, సజ్జాపురంలో 117 చొప్పున, గునుపూడి, ఆకివీడు, ఉండి, వీరవాసరం, పెంటపాడు, అత్తిలి, పెనుగొండ, నరసాపురం, మొగల్తూరు, ఆచంట, తణుకు కార్యాలయాల్లో 78 చొప్పున పెంచారు.



ఏలూరు జిల్లాలో: ఏలూరు, నూజివీడు, చింతలపూడి, జంగారెడ్డిగూడెంలో 117 చొప్పున, భీమడోలు, కామవరపుకోట, పోలవరం, వట్లూరు, గణపవరం, కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి కార్యాలయాల్లో 78 వంతున పెంచారు.

**రేపటి నుంచి వెబ్సైట్లో వివరాలు**


కొత్త మార్కెట్ విలువలకు సంబంధించిన కసరత్తు కొనసాగుతోంది. ఏ ప్రాంతంలో ఎంత పెంచాలనే ప్రతిపాదనలు ఇప్పటికే తయారు చేసి వాటిని సంయుక్త కలెక్టర్కు పంపించారు.. ఆయన ఆధ్వర్యంలో సంబంధిత కమిటీ ఆమోదం తెలిపాక ఆ వివరాలను మంగళవారం నుంచి ఆ శాఖ వెబ్సైట్లో ఉంచుతారు. వాటిని అన్ని సబ్రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద నోటీసుబోర్డులో ప్రదర్శిస్తారు. వాటిపై అభ్యంతరాలుంటే ప్రజలు ఈనెల 29లోగా అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు. తర్వాత దానిపై తుది నిర్ణయం తీసుకొని అమలు చేస్తారు.

**సబ్రిజిస్ట్రార్ కార్యాలయం వారీగా ఇలా..**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 1 నుంచి జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల విలువ పెంచుతున్నామని ఏలూరు జిల్లా రిజిస్ట్రార్, పశ్చిమ గోదావరి జిల్లా ఇన్ఛార్జి రిజిస్ట్రార్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. పురపాలక సంఘాల పరిధిలో పాలకొల్లు, నరసాపురం, తణుకుల్లో 0-10 శాతం, గునుపూడి 0-12, తాడేపల్లిగూడెం, ఆకివీడు, భీమవరంలో 0-15, సజ్జాపురం 0-25, గ్రామీణ పరిధిలోని ఆచంట 0-16, అత్తిలి, మొగల్తూరు, పెంటపాడు 0-15, పెనుగొండ, వీరవాసరం 0-20, ఉండి 0-10 శాతం చొప్పున పెంచినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలుంటే ఈనెల 29లోగా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రాతపూర్వకంగా అందజేయాలని, registration.ap.gov.in వెబ్సైట్లో పొందుపరచాలని సూచించారు.

# వెలిగొండ... నిర్వాసితులకు కావాలి అండ!

మార్కాపురం: వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం పంపిణీ ఓ ప్రహసనంలా మారింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఈ అంశంలో ఓ అడుగు ముందుకేసి... తొలివిడతగా రూ.80 కోట్లు అందజేసేందుకు చర్యలు తీసుకుంది. ఇంతవరకు బాగానే ఉన్నా గతంలో తమను నిర్వాసితులుగా గుర్తించినా జాబితాలో మాత్రం పేర్లు లేవని కొందరు వాపోతున్నారు. ఈ విషయమై అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతున్నారు. 2023లో వెలిగొండ నిర్వాసితుల గెజిట్ జాబితాను ప్రకటించారు. ఇందులో 7,320 మందికి చోటు కల్పించారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే దరఖాస్తు చేసుకోవచ్చని అప్పట్లో అధికారులు ప్రకటించారు. దీంతో 11 ముంపు గ్రామాల నుంచి మొత్తం 1,457 దరఖాస్తులు వచ్చినా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టలేదు. చేయి తడిపిన వారికే చోటు కల్పిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. న్యాయం చేయాలంటూ నేటికీ 'మీ కోసం...' కార్యక్రమంలో అర్జీలు సమర్పిస్తున్నా ప్రయోజనం లేకపోతోందని వాపోతున్నారు. ఈ విషయమై మార్కాపురం ఇన్ఛార్జి ఉప కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి మాట్లాడుతూ... వివరాలు పరిశీలించి అందరికీ న్యాయం చేస్తామని తెలిపారు.



**నిర్వాసిత గ్రామాలు...**

మార్కాపురం మండలంలోని గొట్టిపడియ, అక్కచెరువు తండా; పెద్దారవీడులోని సుంకేసుల, కలనూతల, గుండంచెర్ల, కాటంరాజు తండా, చింతలముడిపి; అర్ధవీడు మండలంలోని లక్ష్మీపురం, సాయిరాంనగర్, రామలింగేశ్వరపురం, కృష్ణనగర్

**కాళ్లరిగేలా తిరుగుతున్నాం...**

'పూర్వీకుల నుంచి కలనూతలలో ఉంటున్నాం. మా అమ్మ, అన్నదమ్ముల పేర్లు జాబితాలో ఉన్నా... నాతో పాటు నా పిల్లల పేర్లు లేవు. సర్వే సమయంలో మా వివరాలు సేకరించి, ఫొటోలు సైతం తీసుకున్నారు. న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్తో పాటు ప్రజా ప్రతినిధులు, గ్రామంలోకి వచ్చిన అధికారులందరికీ విన్నవిస్తున్నా ఫలితం లేకపోయింద'ని నిర్వాసితుడు గుడిపాటి మల్లికార్జున వాపోయారు.

# రెవెన్యూ రికార్డులకు డిజిటల్ భద్రత..!




కాకినాడ : గత ప్రభుత్వంలో రెవెన్యూ కార్యాలయాల్లో చాలాచోట్ల రికార్డులు మాయమయ్యాయి. కాకినాడ కలెక్టరేట్లోనే రికార్డుల ట్యాంపరింగ్ జరిగింది. మదనపల్లెలో రికార్డులు అగ్నికి ఆహుతయ్యాయి. దాంతో రెవెన్యూ కార్యాలయాల్లో దస్త్రాలను కంప్యూటరీకరించాలని ప్రభుత్వం ఆదేశించినా.. ఎక్కడా అమలు కాలేదు. కాకినాడ ఆర్డీవో కార్యాలయ అధికారులు ముందడుగు వేశారు. ఇక్కడ 1975 నుంచి ఉన్న దస్త్రాలకు డిజిటల్ భద్రత కల్పించారు. సాఫ్ట్వేర్ ఇంజినీరుగా పనిచేసి ప్రస్తుతం రెవెన్యూశాఖలో వీఆర్వోగా ఉన్న రాజ్కిరణ్ దస్త్రాల నిర్వహణకు ప్రత్యేక యాప్ రూపొందించారు. భూసేకరణ, భూకేటాయింపులు, భూవివదాలు, కోర్టు కేసులు, ల్యాండ్ సీలింగ్, ఈనాంకు సంబంధించిన దస్త్రాలు తదితరాల రికార్డులను విభజించి, వాటిని అల్మరా, ర్యాక్లలో భద్రపర్చి, ఆ వివరాలతో ట్యాగ్ వేశారు. ఏ వివరాలు కావాల్సినా, కంప్యూటర్లో ప్రత్యేక యాప్ ద్వారా సెర్చ్చేసి సులభంగా గుర్తిస్తున్నారు. కాకినాడ అర్బన్, రూరల్, సామర్లకోట, కరప, పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, తాళ్లరేవు, కాజులూరు, పెదపూడి మండలాలకు సంబంధించి ఇక్కడ నిర్వహిస్తున్న దస్త్రాలను యాప్ ద్వారా పొందే అవకాశం కల్పించారు.

**ప్రత్యేక భద్రత**

కొందరు సిబ్బంది ద్వారా అక్రమంగా దస్త్రాలు మాయం చేయడం, పేజీలు చించేయడం వంటి ఘటనలు కొన్నిప్రాంతాల్లో జరిగాయి. ఇక్కడ అలాంటివి జరక్కుండా అడ్డుకట్ట వేశారు. రికార్డు గదినుంచి దస్త్రాన్ని తీసిన వారి వివరాలు, సమయం తదితర వివరాలను ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేస్తున్నారు.సామర్లకోట మండలం కాకినాడ నుంచి పెద్దాపురం డివిజన్కు మారింది. అక్కడున్న దస్త్రాలను పెద్దాపురం ఆర్డీవో కార్యాలయానికి తరలించడానికి సిబ్బంది ప్రస్తుతం ఏర్పాట్లు చేస్తున్నారు.

**మిగతా దస్త్రాలకూ..**

ఆర్డీవో కార్యాలయంలో 21 వేల దస్త్రాలున్నాయి. 14 వేల దస్త్రాలను ప్రత్యేక యాప్ ద్వారా నిర్వహిస్తున్నాం. మిగతా 7 వేలను యాప్ ద్వారా ట్యాగింగ్ చేస్తాం. ప్రజలకు ఈ విధానం ద్వారా వీలైనంత త్వరగా వివరాలు అందిస్తున్నాం. రికార్డుల భద్రతకు మరిన్ని చర్యలు చేపడతాం. ఎస్.మల్లిబాబు, ఆర్డీవో, కాకినాడ **రెండు గంటల్లో ఇచ్చారు..**కాకినాడ గ్రామీణం మండలం వాకలపూడిలో 1992లో రోడ్డు నిర్మాణంలో మాభూములు కోల్పోయాం. ఆ రికార్డు కావాలని అయిదేళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. కాకినాడ ఆర్డీవోను కలిసి దరఖాస్తు చేయగా రెండు గంటల్లో వివరాలు అందించారు. ఇక్కడున్న సాంకేతికతతో సెర్చింగ్ చేసి రికార్డు నకళ్లను అందించారు. వట్టికూటి రామం, విశ్రాంత ఇంజినీరు

# ఘాట్ల అనుసంధానంతోనే.. రద్దీ నియంత్రణ..!



రాజమహేంద్రవరం : వచ్చే ఏడాది నిర్వహించే గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో నిర్వహించాలని, రద్దీ నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించిన నేపథ్యంలో కార్యాచరణ ప్రారంభించారు. ప్రధానంగా ఘాట్ల అనుసంధానంతోనే రద్దీ నియంత్రణ సులభంగా చేయాలని భావిస్తున్నారు. ఆ దిశగా సన్నాహాలు చేస్తున్నారు.

**2.1 కిమీ మేర విస్తరించి..**

గతంలో రాజమహేంద్రవరంలో సుమారు 1.20 కి.మీలు ఉన్న కోటిలంగాల ఘాట్కు పుష్కరాల ఘాట్ను అనుసంధానం చేశారు. 2.1 కి.మీ మేర ఒకే స్నానఘట్టాన్ని నిర్మించాలని ప్రాథమికంగా అధికారులు నిర్ణయించారు. గౌతమ, సరస్వతీ ఘాట్లను అనుసంధానం చేసి, కిలోమీటరు మేర మరో పొడవైన ఘాట్ తీసుకొస్తే రద్దీ నియంత్రించవచ్చు.**ప్రజాభిప్రాయ సేకరణ** భక్తులు ఏం కోరుకుంటున్నారు? వారి అవసరాలు? ఏ సదుపాయాలు కల్పించాలో తెలుసుకుని ఆ దిశగా ఏర్పాట్లు చేస్తారు. ప్రత్యేక వెబ్ పోర్టల్ సిద్ధం చేస్తారు. దీనిలో ప్రజల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకుంటూనే పుష్కరాల సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తారు.

**11 ప్రధాన రహదారుల విస్తరణ..**

రాజమహేంద్రవరంలోని 11 ప్రధాన రహదారుల విస్తరణకు అధికారులు నిర్ణయించారు. స్టేడియం రోడ్డు, తూర్పు రైల్వేస్టేషన్ మార్గం, కంబాలచెరువు-కోరుకొండ వెళ్లే రోడ్డు ఇలా.. మరికొన్నింటిని 60-100 అడుగుల మేర విస్తరిస్తారు. భవనాలు, భూములు కోల్పోయేవారికి టీడీఆర్ బాండ్లు ఇచ్చేలా యోచిస్తున్నారు.

**ప్రముఖులకు ప్రత్యేకంగా...**

పుష్కరాలకు ప్రముఖులు (వీఐపీ) వచ్చే సమయంలో వాహనాల తాకిడి ఉంటుంది. భక్తుల రద్దీ సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో వారికి నగరానికి కొంత దూరంలో కాతేరు ప్రాంతంలో స్నానఘట్టం నిర్మించే యోచనలో ఉన్నారు. విమానాల్లో వచ్చే ప్రముఖులను నేరుగా గోదావరి మధ్యలో లంకల్లోకి హెలికాప్టర్ ద్వారా తీసుకెళ్లి పుణ్యస్నానాల తరువాత విమానాశ్రయంలో దించేలా ఆలోచన చేస్తున్నారు. దీనిపై స్పష్టత వచ్చిన తరువాత బ్రిడ్జిలంకలో హెలీపాడ్తోపాటు, స్నానఘట్టాన్ని ఏర్పాటు చేస్తారు.

# భూముల విలువ పెరిగిందోచ్!

ఒంగోలు : జిల్లాలో పెంచిన భూముల విలువలు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. గత వైకాపా ప్రభుత్వం... ఆదాయార్జనే లక్ష్యంగా భూముల విలువను 30 నుంచి 50 శాతం మేర పెంచింది. అప్పట్లో అశాస్త్రీయంగా ఈ ప్రక్రియ చేపట్టడంతో ఆ ప్రభావం క్రయవిక్రయాలపైనా పడింది. దీనిని సరిచేసేందుకు కూటమి ప్రభుత్వం గతేడాది ప్రాంతాల వారీగా సవరణ చేపట్టింది. తాజాగా జిల్లా వ్యాప్తంగా 5 నుంచి 10 శాతం మేర ధరలు పెంచేందుకు ప్రతిపాదించింది. ఈ మేరకు జేసీ రోణంకి గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కమిటీ సమావేశంలో మార్కెట్ విలువ పెంపును ఆమోదించారు.

**అభ్యంతరాలకు అవకాశం...**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో భూముల విలువ పెంపు అమల్లోకి రానుంది. జిల్లా వాసుల పరిశీలన నిమిత్తం ఈ వివరాలను స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. వీటిపై ఏవైనా అభ్యంతరాలుంటే పునఃపరిశీలన నిమిత్తం స్థానిక సబ్ రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్, సంయుక్త కలెక్టర్కు తెలియజేసే అవకాశం కల్పించారు.



**పెరగనున్న ఆదాయం...**

ప్రకాశం జిల్లా పరిధిలో ఒంగోలు, అమ్మనబ్రోలు, చీమకుర్తి, దర్శి, సంతనూతలపాడు, సింగరాయకొండ, కందుకూరు, అద్దంకి; మార్కాపురం జిల్లా పరిధిలోని మార్కాపురం, కంభం, గిద్దలూరు, కనిగిరి, పొదిలి, యర్రగొండపాలెంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ఆయా ప్రాంతాల్లో జరిగే క్రయవిక్రయాల ద్వారా ఏటా స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖకు సుమారు రూ.442 కోట్ల ఆదాయం సమకూరుతోంది. తాజాగా పెంచిన విలువలతో రూ.490 కోట్ల మేర ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**ప్రాంతాల వారీగా ఇలా...**

ఒంగోలు ట్రంకురోడ్డులో ప్రస్తుతం గజం ధర రూ.49 వేలు ఉండగా... రూ.51 వేలకు పెంచారు. నగరంలోని అన్ని వ్యాపార ప్రాంతాల్లోనూ ఇలానే ప్రతిపాదించారు.

లాయర్పేటలో రూ.30 వేల నుంచి 31 వేలకు; రామనగర్, భాగ్యనగర్, అన్నవరప్పాడులో రూ.28 వేల నుంచి 30 వేలకు పెంచారు.

కర్నూలు రోడ్డులో డెయిరీ ఎదుట గజం ధర రూ.6 వేలు ఉండగా... రూ.6,300; అమరావతినగర్లో రూ.7 వేల నుంచి రూ.7,500; మంగమూరు రోడ్డులోని ఆశ్రమం వద్ద రూ.9 వేలు నుంచి రూ.9,500కు పెంచుతూ ప్రతిపాదించారు. టంగుటూరు మండలం వల్లూరులో హైవే పక్కన ఎకరా రూ.36 లక్షలు ఉండగా... రూ.37 లక్షలు; సంతనూతలపాడు మండలం మైనంపాడు, చిలకపాడు, గుమ్మళంపాడు గ్రామాల్లో ఎకరా రూ.4 లక్షలు ఉండగా... రూ.4.20 లక్షలకు పెంచేలా ప్రతిపాదించారు.

# రండి త్వరపడండి

పాలకోడేరు : ఆధార్ బయోమెట్రిక్ నవీకరణ పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలు, డ్రైవ్లు నిర్వహిస్తున్నా చాలా మంది చిన్నారులు, విద్యార్థులతో ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు వారి తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో ఐదు రోజులపాటు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. అయినా ఆశించిన స్థాయిలో శిబిరాలను సద్వినియోగం చేసుకోలేదు. దీంతో 10వ తరగతి, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పలు సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు బయోమెట్రిక్ హాజరు సందర్భంగా ఇబ్బందులు తలెత్తే ఆస్కారం ఉంది. ఆధార్లో పేరు, పుట్టిన రోజు తేదీ వంటివి తప్పుగా పడినవారు త్వరగా సవరణ చేయించుకోవాలని డీఈవో నారాయణ తెలిపారు.

**మొదటి సారి ఉచితం..**

5 నుంచి 7 సంవత్సరాల మధ్య వయసు గల వారికి మొదటి సారి బయోమెట్రిక్ ఉచితం 15 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్కులకు కూడా ఉచితమే
పేరు, జండర్, పుట్టిన తేదీ, చిరునామా, చరవాణి నంబరు, తండ్రి పేరు సవరణకు రూ.75 చెల్లించాలి.

**ఈ పత్రాలు అవసరం**

ఆధార్ బయోమెట్రిక్ తాజాపర్చడానికి ఆధార్కార్డు తీసుకెళ్తే సరిపోతుంది. కొత్తగా నమోదుకు జనన ధ్రువపత్రం, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు తీసుకెళ్లాలి. మార్పులు, చేర్పులకు జనన ధ్రువపత్రం, పదో తరగతి ఒరిజినల్ మార్కుల జాబితా, చిరునామా నిర్ధారణ ధ్రువపత్రాలుండాలి.

**జిల్లా వివరాలు..**

మొత్తం పిల్లల సంఖ్య 47,841 (5-16 సంవత్సరాల మధ్య వయస్కులు)
బయోమెట్రిక్ తాజాపర్చడం పూర్తయినవారు - 18,930
పూర్తి కానివారు - 28,911

# భద్రత.. ఎవరికీ పట్టని బాధ్యత!

చీమకుర్తి : భద్రతా అంశాలను పునశ్చరణ చేయడం, చేపట్టాల్సిన చర్యలను మెరుగుపరచడం..బాగా పనిచేస్తున్న వారిని బహుమతులతో ప్రోత్సహించడం లక్ష్యంగా గ్రానైట్ గనుల్లో నిర్వహించే భద్రతా వారోత్సవాలు ఎప్పుడు నిర్వహిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రానైట్ గనుల్లో ప్రమాదాలు పెరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో గత డిసెంబరులోనే భద్రతా వారోత్సవాలు నిర్వహించాలనే చర్చ జరిగింది. అయినా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో గెలాక్సీ, స్టీల్గ్రే, బ్లాక్ పెరల్, బ్లాక్ గ్రానైట్ ఖనిజాలను వెలికి తీస్తున్న క్వారీలు 105 వరకు ఉన్నాయి. వీటన్నింటినీ నాలుగు విభాగాలుగా విభజించి దాదాపుగా ప్రతి ఏడాది భద్రతా వారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పరికరాలు అందించి.. అవగాహన కల్పించేవారు లేరు..

వారోత్సవాల్లో భాగంగా రామతీర్థంలోని గ్రానైట్ వృత్తి శిక్షణా కేంద్రంలో ముందుగా ట్రేడ్ పరీక్షలు నిర్వహిస్తారు. ఆయా విభాగాల్లో పనిచేసే సిబ్బంది, కార్మికులు ముందుగా సన్నద్ధమై వీటికి హాజరవుతుంటారు. ట్రేడ్పరీక్షలు ముగిసిన తర్వాత వారం రోజుల పాటు నిపుణులైన బృందాలతో ఆయా ప్రాంతాల్లో ఉన్న గ్రానైట్ గనులతో తనిఖీలు నిర్వహిస్తారు. గతంలో డీడీఎంఎస్ స్థాయి అధికారులు ఈ బృందాలకు నేతృత్వం వహించి ఆయా క్వారీల్లో తనిఖీలు నిర్వహించే వారు. అన్ని క్వారీలను తనిఖీలకు ముస్తాబు చేస్తారు. కార్మికులకు వ్యక్తిగత భద్రతా పరికరాలు అందజేస్తారు. ప్రథమ చికిత్సకు ప్రాధాన్యం ఇస్తారు. కార్మికులు, సిబ్బందికి భద్రతా అంశాలను పునశ్చరణ చేయడంతోపాటు, గనుల్లో చేపట్టాల్సిన భద్రతా అంశాలకు ఈ తనిఖీల్లో ప్రాధాన్యత ఇచ్చి సూచనలు చేసే వారు. అనంతరం ముగింపు వేడుకలతో ఈ వారోత్సవాలు ముగిసేవి.

గతేడాది వరుస ప్రమాదాలు.. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న క్వారీల్లో గత సంవత్సరం ప్రమాదాల సంఖ్య పెరిగింది.

## అరుదైన పుస్తకాలకు భద్రత..!

దేవీచౌక్ : పుస్తకం కొనడం, చదవడం అలవాటు కొంత మందికే ఉంటుంది. శతాబ్దాల కాలంనాటి అరుదైన పుస్తకాలు పాడైతే దొరకడం కష్టం. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని అతిపురాతన గ్రంథాలయంలోని అరుదైన పుస్తకాల భద్రతకు యాజమాన్యం శ్రీకారం చుట్టింది. డిజిటలైజేషన్ ద్వారా వాటి భద్రతకు చర్యలు తీసుకుంటున్నారు.

**ఎలా చేస్తారంటే..?**

గుర్తించిన విలువైన పుస్తకాల స్కానింగ్ కోసం హన్సా సొల్యూషన్ సంస్థ రూ.2లక్షలు విలువచేసే నాలుగు స్కానర్లను సమకూర్చింది. 16వ శతాబ్దం నుంచి ఉన్న అరుదైన పుస్కకంలోని ప్రతీ పేజీని స్కానింగ్ చేసి ఆ పుస్తకానికి ఒక నంబరు ఇస్తున్నారు. అనంతరం క్లౌడ్కు అనుసంధానం చేస్తారు.ఎప్పుడు కావాలంటే అప్పుడు వెబ్ ఒ



ప్యాక్ లింక్ ద్వారా ఆన్లైన్లో చూసుకునే అవకాశం ఉంటుంది.

**విద్యార్థులకు అవకాశం**

పుస్తకాలను డిజిటలైజేషన్ చేసే అవకాశం కళాశాల విద్యార్థులకు ఇచ్చారు. లాంగ్టెర్మ్ ఇంటెర్న్షిప్లో భాగంగా మ్యాథ్స్ విభాగానికి చెందిన 60 మంది విద్యార్థులు దీనిలో భాగస్వాములయ్యారు. ఉదయం 30, మధ్యాహ్నం 30 మంది విద్యార్థులు చొప్పున పుస్తకాలను డిజిటలైజేషన్ చేస్తున్నారు. వీరికి హన్సా సొల్యూషన్ ద్వారా ఇంటెర్న్షిప్ సర్టిఫికెట్ లభిస్తుంది. రోజుకు 10 నుంచి 20 పుస్తకాలు మాత్రమే డిజిలైజేషన్ చేసే అవకాశం ఉందని గ్రంథాలయ సిబ్బంది తెలిపారు.

మొత్తం పుస్తకాలు : 1.10 లక్షలు
అరుదైనవిగా గుర్తించింది : 45 వేలు
డిజిటలైజేషన్కు పట్టే సమయం : ఒక సంవత్సరం (సుమారు)

## గురుకులాలు పిలుస్తున్నాయ్!

విజయనగరం : ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాల పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో విద్యనందించడానికి డా.బి.ఆర్. అంబేడ్కర్ విద్యా కేంద్రాలను తీసుకొచ్చింది. ఇందులో సీటు సాధిస్తే ఇంటర్ వరకు ఉచితంగా చదువు కోవచ్చు. ఈ కేంద్రాల్లో 2026–27లో 5, ఇంటర్, ఐఐటీ/నీట్ శిక్షణతో కూడిన ఇంటర్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 19 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.

**విభాగాల వారీగా సీట్లు ఇలా..**

బాలుర కేంద్రాలు పాలకొండ, బాడంగి, కొప్పెర్ల, సాలూరు, పార్వతీపురం, బాలికలకు వంగర, చీపురుపల్లి, నెల్లిమర్ల, వియ్యంపేట, వేపాడ, భామిని, కొమరాడ, గరుగుబిల్లి కేంద్రాలున్నాయి. అయిదో తరగతి, ఇంటర్లకు కేంద్రానికి 80 సీట్లు చొప్పున మొత్తం చెరో 1,040 సీట్లు కేటాయించారు. ఇంటర్లో ఎంపీసీ 360, బైపీసీ 360, ఎంఈసీ 80, సీఈసీ 200, హెచ్ఈసీ 40 సీట్లు విభాగాల వారీగా కేటాయించారు.

**పరీక్షల షెడ్యూల్ ఇదీ..**

పది రోజుల ముందు ఆన్లైన్లో హాల్టిక్కెట్లు ఉంచుతారు. మార్చి 1న ఉదయం 9.30–11.00 గంటల వరకు అయిదో తరగతికి, 12 నుంచి 1.30 గంటల వరకు ఇంటర్ వారికి, నీట్, ఐఐటీ శిక్షణ కోరే వారికి మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు.

**నీట్, ఐఐటీలకు శిక్షణ..**

ఇంటర్ కోసం దరఖాస్తు చేసినప్పుడే నీట్, ఐఐటీ శిక్షణ కోసం ఆప్షన్ ఇచ్చుకోవాలి. వారికి ప్రభుత్వం నిర్వహించిన కామన్ పరీక్షలకు పంపిస్తారు. ముందుగా ప్రతిభా పరీక్షలో రాణిస్తే శిక్షణ పొందేందుకు ఎంపిక చేస్తారు.

**ఇవి తప్పనిసరి..**

సొంత జిల్లాలో 2024–25లో 3వ తరగతి, 2025–26లో 4వ తరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివుండాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్ష మించకూడదు.



**రిజర్వేషన్లు..**

ఈ విద్యాలయాల్లో ఎస్సీ 75 శాతం, ఎస్సీ కన్వర్టర్ క్రిస్టియన్ 12, ఎస్టీ 6, బీసీ 5, ఇతరులు 2, దివ్యాంగులకు 3, ప్రత్యేక విభాగాలకు చెందిన వారు, సైనికోద్యోగుల పిల్లలకు 15 శాతం సీట్లు కేటాయిస్తారు.

దరఖాస్తు ఇలా.. : అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. అంతర్జాలం లేదా 13 గురుకులాల్లోని ప్రత్యేక సహాయ కేంద్రాల్లో ఉచితంగా నమోదు చేసుకోవచ్చు. పాఠశాల/ కళాశాల వివరాలు రాయాలి. అయిదో తరగతికి http://apbragcet.apcfss.in, ఇంటర్కు http://apbragcet.apcfss.inter ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. సబ్మిట్ చేశాక మార్పునకు అవకాశం లేదు.

నమోదు సమయంలో ఇవి ఉండాలి: దరఖాస్తు నమోదు సమయంలో విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ ప్రతం, తెల్లరేషన్ కార్డు, పూర్వ తరగతికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలుండాలి. ఫోను నంబరు నమోదు తప్పనిసరి. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలకూ అదే వెబ్సైట్లో నమోదు చేసుకోవచ్చు.

ఎం.మాణిక్యం, సమన్వయాధికారిణి, డా.బి.ఆర్.అంబేడ్కర్ గురుకులం

## చెర'బట్టి'.. చెరువు మట్టిని అక్రమార్కులు



వెల్దుర్తి : చెరువు మట్టిని అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. ఇష్టానుసారంగా తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. చెరువు రూపు కోల్పోతున్నా.. అడుగడుగునా గుంతలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వెల్దుర్తి మండలం.. బ్రహ్మగుండం సమీపంలోని ఎర్రచెరువులోని సారవంతమైన మట్టిని పెద్దఎత్తున తవ్వేస్తున్నారు. రైతుల అవసరాలకు ఉపయోగపడే మట్టిని సొమ్ము చేసుకునేందుకు అక్రమార్కులు నిత్యం యంత్రాలతో తవ్వి వందలాది ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిస్తున్నారు. మొక్కుబడిగా అనుమతులు తీసుకుని పెద్దఎత్తున మట్టిని తవ్వేస్తున్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు.

**రూపు కోల్పోతూ..**

చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టి తరలించేందుకు రెవెన్యూ, భూగర్భ గనులు, చిన్న నీటి పారుదల శాఖ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంది. అధికారులు సైతం అనుమతులు మంజూరు చేసే సమయంలో చెరువును పరిశీలించి నిర్దేశించిన ప్రాంతంలో.. కేటాయించిన ప్రదేశం వరకు తవ్వకాలు చేపట్టేందుకు హద్దులు చూపాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇష్టానుసారంగా తవ్వేస్తుండటంతో చెరువు రూపు కోల్పోతుండటం గమనార్హం.

**వందల ట్రాక్టర్లలో తరలింపు**

నాయకుల అండదండలతో ప్రతిరోజూ 200కుపైగా ట్రాక్టర్లలో ఎర్ర మట్టిని ఇటుకల పరిశ్రమలకు తరలిస్తున్నారు. ఒక వర్గం కొన్ని రోజులు.. మరో వర్గం మరికొన్ని రోజులపాటు పెద్దఎత్తున తవ్వకాలు చేస్తుండటం గమనార్హం. ఒక్కో ట్రాక్టర్ మట్టిని దూరాన్ని బట్టి రూ.1,000 నుంచి రూ.1,500 వరకు అమ్ముతున్నారు. ఈ లెక్కన ప్రతి నెలా రూ.కోటి విలువైన మట్టి తరలిపోతోంది.

**విద్యుత్తు స్తంభాలు కూలేలా..**

గత వైకాపా ప్రభుత్వ హయాం నుంచి చెరువులో యథేచ్ఛగా తవ్వకాలు సాగుతున్నాయి. విద్యుత్తు స్తంభాల చుట్టూ సైతం తవ్వేయడంతో అవి కూలిపోయేలా ఉన్నాయి. చెరువులో నీరు చేరిన సమయంలో మట్టి నాని కూలిపోయే అవకాశముండటంతో జనం ఆందోళన చెందుతున్నారు. చెరువులో నుంచి వెళ్లే విద్యుత్తు స్తంభాల ఆధారంగా 7 గ్రామాలు ఆధారపడి ఉన్నాయి. ఏమాత్రం పడిపోయినా విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతుంది.

చెరువులో మట్టి తవ్వకాలను ఇటీవల సీపీఐ నాయకులు సైతం అడ్డుకున్నారు. రాత్రి వేళల్లో అక్రమంగా తవ్వకాలు సాగించి మట్టిని తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి తనిఖీలు జరిపి అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

## గట్టెక్కని పనులు.. ఏవీ పరవళ్లు



నంద్యాల : ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ పనులు నెమ్మదించాయి. ఇప్పటికే ప్రభుత్వం రెండుసార్లు గడువు పెంచినా వేగం కానరావడం లేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో పైసా నిధులు విడుదల కాకపోవడంతో పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు విడుదల చేసింది. దీంతో తిరిగి ప్రారంభమైనప్పటికీ 'నత్త'ను తలపించేలా సాగుతున్నాయి.

పోతిరెడ్డిపాడు నుంచి రోజుకు 80 వేల క్యూసెక్కుల నీటిని (వరద సమయంలో) తీసుకొని బనకచర్లకు అందించడంలో భాగంగా ఎస్ఆర్ఎంసీని వెడల్పు చేయాలని 2021లో అప్పటి ప్రభుత్వం నిర్ణయించి రూ.939.65 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా పోతిరెడ్డిపాడు నుంచి గోరుకల్లు ప్రాజెక్టు వరకు చేసే పనులకు రూ.570.45 కోట్లు కేటాయించింది. రెండు ప్యాకేజీలుగా విభజించి రెండో ప్యాకేజీ కింద బనకచర్ల నుంచి గోరుకల్లు వరకు ఎస్సార్బీసీని విస్తరించేందుకు నిధులు కేటాయించారు. 56.775 కి.మీ. పొడవునా కాల్వను వెడల్పు చేయడంతోపాటు లైనింగ్ తదితరాలు చేయాల్సి ఉంది.

**గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో..**

ఎస్సార్బీసీ కాల్వకు ప్రస్తుతం బనకచర్ల సముదాయం నుంచి 4,988 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 21,700 క్యూసెక్కులు ప్రవహించేలా కాల్వను వెడల్పు చేయాలని నిర్ణయించి నిధులు కేటాయించారు. 2022లో పనులు ప్రారంభమయ్యాయి. నాలుగేళ్లుగా పనులు అధ్వానంగానే సాగుతున్నాయి. వైకాపా ప్రభుత్వంలో ప్రారంభించినా నిధులు ఇవ్వకపోవడంతో గుత్తేదారు సంస్థ పనులు ఆపేసింది. కూటమి ప్రభుత్వం రూ.250 కోట్లు మంజూరు చేయగా పనులు తిరిగి ప్రారంభమయ్యాయి.

**7.64 శాతమే పూర్తి**

ఎంతో ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్టు పనులు ఇప్పటివరకు పరిశీలిస్తే 7.64 శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఇందుకు రూ.39.6 కోట్లు వ్యయం చేశారు. 56 కి.మీ. బెడ్ లైనింగ్ పనుల్లో కేవలం 6 కి.మీ. మాత్రమే జరగడం గమనార్హం.

**గడువు పొడిగించినా..**

వాస్తవానికి 36 నెలల్లో పనులు పూర్తి చేయాలన్న నిబంధన ఉంది. పనులు పూర్తికాకపోవడంతో ఆరు నెలలపాటు గడువు పెంచారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో ఈ ఏడాది సెప్టెంబరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితులను చూస్తే పూర్తయ్యేట్లు లేవు. సాధారణంగా కాల్వలో ఏప్రిల్ వరకు నీరు ఉంటుంది. మార్చిలోనూ పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల ఉంటుంది. ఈ ఏడాది సైతం మార్చి 31 వరకు నీటి విడుదల ఉంటుందని ఐఏబీ తీర్మానించింది. ఈ లెక్కన పనులు చేయడానికి కేవలం ఏప్రిల్ నుంచి జులై వరకు మాత్రమే అవకాశం ఉంటుంది.

## వైకాపా నిర్లక్ష్యం..

పరిగి : కరవు జిల్లాలో వరద నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సబ్సర్ఫేస్ డ్యామ్ నిర్మాణాలకు పూనుకొంది. అయితే గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పనులు పట్టాలెక్కలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిర్మాణం ప్రారంభించేందుకు సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు.పరిగి మండలం పైడేటి సమీపంలోని పెన్నానది, కాలువపల్లి వద్ద జయమంగళి నదిలో సబ్సర్ఫేస్ డ్యామ్ల నిర్మాణాలకు అప్పటి పెనుకొండ ఎమ్మెల్యే బీకే పార్థసారథి నిధులు మంజూరు చేయించారు. జయమంగళి నదిపై సబ్సర్ఫేస్ డ్యామ్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. పెన్నానదిపై రూ.4.71 కోట్ల వ్యయంతో చేపట్టనున్న డ్యామ్ నిర్మాణానికి 2019లో బీకే భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆతర్వాత జరిగిన ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి.



**పూర్తయితే ఇవీ ప్రయోజనాలు** వర్షాకాలంలో పెన్నా, జయమంగళి నదులకు వరదలు వస్తే ఆ నీటిని ఒడిసిపట్టి భూమిలోకి ఇంకిపోయేలా చేసి భూగర్భజలాలను అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యం. ఆయా నదులకు అడ్డంగా 50 మీటర్లమేర లోతు ఇసుక మేటలను తొలగించి రబ్బరు పట్టా అమర్చుతారు. దానిపై పలు లేయర్లలో మట్టి వేసి రోలర్లతో తొక్కించి సబ్సర్ఫేస్ డ్యామ్ను నిర్మిస్తారు. ఒకసారి వరద ఈ డ్యామ్ మీదుగా ప్రవహిస్తే నాలుగేళ్లపాటు సమీపంలోని బోర్లలో భూగర్భ జలం పెరుగుతుందని జలవనరుల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం**పెన్నానదిలో సబ్సర్ఫేస్ డ్యామ్ నిర్మాణ పనులకు రీఎస్టిమేట్లు పూర్తి అయ్యాయి. వారం రోజుల్లోపు పనులు ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. గురుమూర్తి, జలవనరుల శాఖ ఈఈ, పెనుకొండ

## శిరస్త్రాణం.. శిరోధార్యం

రాజాం : శిరస్త్రాణం చోదకులకు రక్షణ కవచం. ప్రమాదాల బారిన పడితే తలకు గాయం కాకుండా నిలువరిస్తుంది. తీవ్రత తగ్గిస్తుంది. వీటిపై చాలామందికి అవగాహన ఉండడం లేదు. పూర్తిగా ధరించనివారు కొందరైతే.. నెత్తిన పెట్టుకున్నా నాసిరకమైనవి కావడంతో ప్రాణాలు కోల్పోతున్నవారు మరికొందరు. రహదారి ప్రమాదాల్లో ద్విచక్ర వాహన చోదకుల మరణాలు పెరగడానికి నాణ్యతలేని శిరస్త్రాణాలే కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్వో) గతంలో అప్రమత్తం చేసింది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ధ్రువీకరించిన ఐఎస్ఐ ముద్ర కలిగిన వాటినే వినియోగించాలని అధికారులు చెబుతున్నారు.

బీఐఎస్ ధ్రువీకరించిన సంస్థలు నాణ్యమైన ఫైబర్ శిరస్త్రాణాలను తయారు చేస్తాయి. ఇది అన్ని రకాలుగానూ మనిషి తలకు సరిగ్గా సరిపోతుంది. ఓస్థాయి ప్రమాదాల వరకు చెక్కుచెదరదు. తల పైభాగానికి అతుక్కునేలా ఉండి, ప్రమాదాల వేళ ఎగిరిపోవు. ఈ శిరస్త్రాణాల పైభాగంలో దృఢమైన కవచం ఉంటుంది. దానిలోపల



తలకు మెత్తదనాన్ని ఇచ్చే ఫోమ్లాంటి భాగం ఉంటుంది. వాటికి వాడే బెల్టులు కూడా పటిష్ఠంగానే ఉంటాయి. ముందువైపు ముఖాన్ని రక్షించేలా సూర్యకిరణాల ప్రభావం లోపలకు పడకుండా నాణ్యమైన ఫైబర్ ప్లేట్ ఉంటుంది.

**నాణ్యత గుర్తించండిలా..**

నాసిరకం శిరస్త్రాణాలకు నకిలీ ఐఎస్ఐ స్టిక్కర్లు అంటించేసి, రోడ్డు పక్కన విక్రయిస్తున్నారు. ద్విచక్ర వాహనచోదకులు వాటిని చూసి తక్కువ ధరకు వస్తున్నాయని కొనుగోలు చేస్తున్నారు. బీఐఎస్ ధ్రువీకరించిన ఐఎస్ఐ హెల్మెట్లపై వెనుక వైపున ఎనిమిది అంకెల సెంట్రల్ మాస్ అండ్ లైసెన్స్ (సీఎంఎల్) నంబరు ఉంటుంది. బీఐఎస్ వెబ్సైట్లోనూ వివరాలు ఉంటాయి.

జిల్లాలో ద్విచక్ర వాహనాలు: 4.64 లక్షలు
నాణ్యమైన హెల్మెట్ ధర: రూ.1000 నుంచి 3,000 వరకు
నాసిరకం ధర: రూ. 300 నుంచి 600

**ప్రాణం విలువైనది..** ప్రాణం అత్యంత విలువైనది. ద్విచక్ర వాహనం కొనుగోలు సమయంలోనే హెల్మెట్ను డీలర్లు ఇవ్వాలి. చోదకులు వీటిని పరిశీలించి, నాణ్యమైనవి అడిగి తీసుకోవాలి. కళాశాలల్లో యువతకు అవగాహన కల్పిస్తున్నాం. శిరస్త్రాణం లేకుండా వాహనంతో వచ్చేవారికి లోపలకు అనుమతించొద్దని కోరాం. పోలీస్శాఖతో పాటు తనిఖీలు నిర్వహించి, కేసులు పెడుతున్నాం.

డి.మణికుమార్, ఉపకమిషనర్, రవాణాశాఖ

## కన్నేసి.. కబ్జా చేసి..!

నూజివీడు : మూగ జీవాల గ్రాసానికి సర్కారు కేటాయించిన 'పశువుల బీడు'ను ఆక్రమిస్తూ పామాయిల్ సాగు చేస్తున్న ఘటన యర్రావారిగూడెంలో ఆలస్యంగా వెలుగు చూసింది. సర్వే నంబర్ 26లో 10 ఎకరాలు ఉంది. ఏళ్ల తరబడిగా ఇక్కడ పశువులు గడ్డి మేస్తున్నాయి. కొత్తగూడెంలో రీ–సర్వే చేసినప్పుడు ఈ భూమి వదిలే కొలతలు వేశారు.

**వాణిజ్య పంటలకు..**

వాణిజ్య పంటల సాగుకు అనువైన భూమిపై కొందరు కన్నేసి ఆక్రమణలకు తెరతీశారు. గ్రూపులోని కొందరే సాగు చేసుకుంటామనడంతో ఇతరులు అంగీకరించక విషయం బయటకు పొక్కింది.

ఎకరా రూ.20 లక్షల పైమాటే

పశువుల బీడు ఎకరా రూ.20 లక్షలకు పైగా ఉంది. అత్యంత సారవంతమైన ఈ భూమి వాణిజ్య పంటలకు మేలు. వారం వ్యవధిలో 80 శాతం అయిల్పామ్ మొక్కలను నాటారు.

యంత్రాలు స్వాధీనం.. ఆపై మాయం..

భూమిని యంత్రాలతో చదును చేస్తుండగా వీఆర్వో వెళ్లి అడ్డుకున్నారు. ఇద్దరు కానిస్టేబుళ్లు వెళ్లి బ్లేడ్ ట్రాక్టర్, పొక్లెయిన్, మూడు ట్రాక్టర్లను తీసుకునిలో పెట్రోల్ బంకుకు తరలించారు. మరుసటి రోజుకు యంత్రాలు అక్కడ లేవు. ఈ వ్యవహారంలో వేలాది రూపాయలు చేతులు మారినట్లు తెలిసింది. బంకు సీసీ కెమెరాల్లో ఇవన్నీ ఉన్నాయి.

మూగ జీవాలకు గ్రాసం ఎలా..



మూగ జీవాల గ్రాసం కోసం కేటాయించిన భూమిని ఆక్రమిస్తే పశువులకు మేత ఎలా అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కారు దస్త్రాల్లో బీడుగా ఉన్న.. భూ ఆక్రమణకు రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం పరోక్షంగా సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

అధికారుల దృష్టికి..

పది ఎకరాల్లో ఆక్రమణ వాస్తవమే. ఆక్రమణ చేసే వ్యక్తులపై వీఆర్వోతో ఫిర్యాదు చేయించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆక్రమణలు లేకుండా మొక్కలు తొలగించాం.

ఈశ్వరరావు, ఉప తహసీల్దారు

**మాట్లాడుకుంటామంటే వదిలాం..**

యంత్రాలు తీసుకురావడం వాస్తవమే. గ్రామస్థులు మాట్లాడుకుంటామనే హామీతో పంపాం. కానిస్టేబుళ్లు వెళ్లినప్పుడు యంత్రాలు పని చేయడం లేదు. ఆక్రమణలపై ఫిర్యాదు లేదు. డి.రామకృష్ణ, ఎస్సై

## మ్యాప్స్ తొలగింపు.. దాతలే దిక్కు

తిరుమల : ఎస్వీ మ్యూజియం ఆధునికీకరణ పనుల నుంచి బెంగళూరుకు చెందిన మ్యాప్స్ సిస్టమ్స్ (సాఫ్ట్‌వేర్) సంస్థను తితిదే తొలగించింది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో మ్యూజియాన్ని అందుబాటులోకి తీసుకురావాలని 2020లో నిరయించి దాతల సహకారంతో పనులు ప్రారంభించారు. 3డీ, 7డీ టెక్నాలజీ కోసం టీసీఎస్ సంస్థ రూ.125 కోట్లు, బెంగళూరుకు చెందిన మ్యాప్ సంస్థ రూ.20 కోట్లు వెచ్చించడానికి ముందుకు వచ్చాయి. టీసీఎస్ సంస్థ అంతర్గత ఆధునికకీరణ పనులు పూర్తిచేయడంతో పలు గ్యాలరీలు అందుబాటులోకి వచ్చాయి. మ్యాప్స్ సంస్థ సివిల్, ఎలక్ట్రికల్, ఏసీ డక్టింగ్ వర్క్‌ను కొంతవరకు చేసి నిలిపివేసింది. ఐదు గ్యాలరీల పనులు చేయాల్సిఉన్నా ఒక్క దానిలో మాత్రమే 80 శాతం పూర్తిచేసిం



ది. ఈ నేపథ్యంలో తితిదే అధికారులు పలుమార్లు లేఖలు రాసినా పట్టించుకోలేదు. చివరకు గత సంవత్సరం జులైలోగా పూర్తిచేస్తామని చెప్పినా పట్టించుకోలేదు. దీంతో డిసెంబర్ 16న జరిగిన తితిదే ధర్మకర్తల మండలి తీర్మానం మేరకు సదరు సంస్థను అభివృద్ధి పనుల నుంచి తొలగించారు.

**రూ.20 కోట్ల పనులు**

ప్రస్తుతం మ్యాప్స్ సంస్థ చేపటాల్సిన మిగిలిన పనులు పూర్తిచేసేందుకు ఆసక్తి కలిగిన దాతలను సంప్రదించి వారిచ్చే విరాళాలతో ఉచితంగా పూర్తిచేయాలని తితిదే బోర్డులో నిర?యం తీసుకున్నారు. మరోవైపు రూ.20 కోట్ల కోసం ఏళ్లతరబడి పనులు సాగదీయడంపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధర్మకర్తల మండలి, అధికారులు చొరవతీసుకుని నూతన సంవత్సరంలోనైనా అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

## శివయ్యా.. ఇవెక్కడి పనులు

శ్రీకాళహస్తి : బృహత్తర ప్రణాళిక అమలులో భాగంగా శివయ్య గోపురం సమీపంలో రూ.1.80 కోట్ల వ్యయంతో అత్యాధునిక సాంకేతికతతో ఆర్జిత సేవా కౌంటర్లను ఆలయ అధికారులు సిద్ధం చేయించారు. వీటిని ఇంకా ప్రారంభించనేలేదు. అప్పుడే మరమ్మతులు చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అప్పుడు ఆమోదించిన వారే**




సాధారణంగా క్యూలైన్లు ఐదు అడుగుల ఎత్తు ఉంటాయి. ఇక్కడ రద్దీ సమయాల్లో భక్తులు క్యూలైన్లు ఎక్కేందుకు వీల్లేకుండా ఆరు అడుగుల ఎత్తు పెట్టారు. ప్రణాళిక దశ నుంచే పలు దఫాలుగా దేవాదాయశాఖ కమిషనర్, సంబంధిత ఎస్ఈ ఆదేశాలతో పనులు పూర్తి చేశారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న తరుణంలో క్యూలైన్ల ఎత్తు తగ్గించాలని ఉన్నతాధికారి ఆదేశించారని ఆలయ అధికారులు ముందూవెనుక ఆలోచించకుండా వాటిని నాలుగు అడుగులకు తగ్గించే పనులు ప్రారంభించారు. క్యూలైన్లు అందుబాటులోకి వచ్చాక భక్తులు వాటిని దాటుకుంటూ వెళ్లే పరిస్థితి వస్తే మళ్లీ పెంచరన్న గ్యారంటీ లేదు. దీనివల్ల నిధులు పెద్దఎత్తున వృథా కాకుండా ఆలయ అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

## నకిలీ పత్రాలు.. అక్రమ వ్యూహాలు

విశాఖపట్నం : మధురవాడ ప్రాంతంలో ఎంతో విలువైన జీవీఎంసీ పార్కు, ప్రభుత్వ స్థలాలకు నకిలీ పత్రాలు సృష్టించి కొందరు తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. మధురవాడలోని ఆర్టీసీ కాలనీ సమీపంలో 2004లో శ్రీలక్ష్మీనగర్ పేరుతో 3.02 ఎకరాల్లో 29 ప్లాట్లతో ఓ ప్రైవేటు లే-అవుట్ వేశారు. కాలనీ అవసరాలను దృష్టిలో పెట్టుకుని 31 సెంట్లు పార్కు నిమిత్తం జీవీఎంసీకి ఇచ్చారు. ఇందులో సుమారు 500 గజాలకు ముగ్గురు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించారు. వాటిని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో రూ.1.13 కోట్లకు తనఖా పెట్టారు. అయితే డబ్బులు చెల్లించలేదని... 500 గజాల స్థలంలో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు నోటీసు బోర్డు పెట్టారు. దీంతో అసలు బాగోతం వెలుగులోకి వచ్చింది. బహిరంగ మార్కెట్‌లో నకిలీ పత్రాలు సృష్టించి తనఖా పెట్టిన స్థలం విలువ రూ.4కోట్లపైగానే ఉంటుంది. **ఆ స్థలానికి మరోవైపు:** మధురవాడలో పార్కు స్థలానికి ఆనుకుని మరో సర్వే నంబరులో ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 200 గజాలు ఓ వ్యక్తి ఆక్రమించారు. సుమారు వంద గజాల్లో జీవీఎంసీ నుంచి ప్లాన్ పొంది ఏకంగా మూడంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. విచిత్రం ఏంటంటే... జీవీఎంసీకి ప్లాన్ కోసం పెట్టిన దస్త్రాల్లో శ్రీలక్ష్మీనగర్ లేఅవుట్‌కి చెందిన సర్వే నెంబరును ఇక్కడ చూపించడం. అలాగే ఆర్టీసీ కాలనీలో ఓ ఇంటికి సంబంధించిన ఇంటి పన్ను ఇక్కడ ప్లాన్‌లో చూపించారు. మిగిలిన వంద గజాల్లో ఓ షెడ్డు ఏర్పాటు చేశారు. ఇది ప్రభుత్వ భూమి అని తెలిసినా ఎలాంటి చర్యల్లేవు. ఆక్రమించిన 200 గజాల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.2కోట్లపైగానే ఉంటుంది. **అందరూ కుమ్మక్కు:** నిర్మాణానికి ప్లాన్ అనుమతి కోరగానే క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ఇదేమీ లేకుండా సర్వే విభాగం, పట్టణ ప్రణాళిక అధికారులు నిర్మాణదారులతో కుమ్మక్కై ప్లాన్ అనుమతి ఇచ్చేశారనే ఆరోపణలొస్తున్నాయి. అక్రమం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ప్లాన్ రద్దు చేసి అనుమతులు ఆపేయాల్సి ఉన్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలోని షిప్‌యార్డు లేఅవుట్‌లో నకిలీ ప్లాటు నెంబర్లు, పత్రాలు సృష్టించి ప్రభుత్వ రాస్తా స్థలంలో భవన నిర్మాణానికి అనుమతులు ఇచ్చేశారు. విషయం తెలిసినా చర్యలు తీసుకోకుండా చేతులు కట్టేసుకొని ఉండిపోయారు.

## అరటి, దానిమ్మ అ'ధర'హో



ధర్మవరం : జిల్లాలో అరటి, దానిమ్మ ధరలు అమాంతం పెరిగాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సరిగ్గా రెండు నెలల కిందట అరటి ధరలు దారుణంగా పడిపోయాయి. ఎంతలా అంటే.. టన్ను కేవలం రూ.1,000 పలికాయి. అది కూడా కాయలకు ఎటువంటి తెగుళ్లు, మచ్చలు లేకపోతేనే కొనుగోలు చేశారు. ఎగుమతులు పడిపోవడంతో కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. దీంతో వందల ఎకరాల్లో అరటి గెలలు చెట్ల మీదే మగ్గి రాలిపోయాయి. కొందరు రైతులు గెలలను పశువులకు మేతగా వేయగా.. మరికొందరు తోటల్లోనే వదిలేశారు. దసరా, దీపావళి వంటి పెద్ద పండగలు వచ్చినా రైతులకు ఎటువంటి ఉపయోగం లేకుండా పోయింది. ఈ సీజన్‌లోని అరటి, దానిమ్మ పంట ఉత్పత్తులున్నా.. రైతులు నష్టాల బారిన పడ్డారు.

**వాతావరణంలో మార్పులే కారణం**

గత నెలలో వాతావరణంలో మార్పుల కారణంగా వర్షాలు కురిశాయి. దీంతో దానిమ్మ, అరటి పంటల విక్రయానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. డిసెంబరు మొదటి వారంలో టన్ను దానిమ్మ రూ.1.35 లక్షల నుంచి రూ.1.45 లక్షల వరకు పలికింది. వారం రోజుల తరువాత అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి. తేమ శాతం అధికం కావడం.. దానిమ్మకు మచ్చ తెగులు సోకడంతో ధరలు ఒక్కసారిగా రూ.70 వేల నుంచి రూ.80 వేలకు పడిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందారు. గత వారం నుంచి రాత్రిపూట చలి ఉన్నా పగటిపూట ఉషో?గ్రతలు పెరిగాయి. దీంతో దానిమ్మకాయల పరిమాణం బాగా వృద్ధి చెంది మంచి రంగు తేలాయి.

**ధరలు, విస్తీర?ం పరిశీలిస్తే..**

ప్రస్తుతం టన్ను దానిమ్మ రూ.1.40 లక్షల నుంచి రూ.1.55 లక్షల వరకు ఉంది.

అరటి మొదటి కోత టన్ను రూ.18 వేల నుంచి రూ.22 వేలు

రెండో కోత రూ. 10 వేల నుంచి రూ.14 వేలు


ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా అరటి 950 హెక్టార్లు, దానిమ్మ 274 హెకార్లల్లో సాగులో ఉంది.

రెండు, మూడు నెలలు ఇవే ధరలు ఉండవచ్చు

చంద్రశేఖర్, జిల్లా ఉద్యానశాఖాధికారి

బయట ప్రదేశాల్లో అరటి, దానిమ్మ పంట పూర్తయ్యింది. అందుకే మన మార్కెట్‌లోకి అవి రావడం లేదు. అరటిని బయట ప్రాంతాలకు ఎగుమతి చేస్తుండటంతో ధరలు పెరిగాయి. రెండు, మూడు నెలలపాటు ఇవే ధరలుండవచ్చు.

## చిరిగిన సంచుల్లోనే ధాన్యం



కణేకల్లు : రైతులు ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్నారు. చేతికి వచ్చిన పంటను విక్రయించడానికి నానా తంటాలు పడాల్సి వస్తోంది. జిల్లాలో హెచ్చెల్సీ, చెరువులు, వ్యవసాయ బోర్ల కింద సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. మద్దతు ధర క్వింటాలుకు రూ.2,389 ప్రకటించింది. ఖరీఫ్‌లో సుమారు 25 వేల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేసి.. కొనుగోళ్లు చేపట్టారు.

**సగానికి సగం అధ్వానం**

జిల్లాలో ఏర్పాటు చేసిన పలు కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలకు చిరిగిన గోనె సంచులు ఇస్తుండటంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం 40, 60 కిలోల ధాన్యం పట్టే గోనె సంచులు పంపిణీ చేస్తోంది. వాటిల్లో సగానికిపైగా చిరిగిపోయి ఉన్నాయి. మరికొన్ని వినియోగించుకోలేని దుస్థితిలో ఉన్నాయని అన్నదాతలు వాపోతున్నారు. వాటిల్లో నింపాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. మరోవైపు హమాలీలు సైతం లారీల్లో లోడ్ చేయడానికి అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలు ద్వారా బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో సేకరించిన ధాన్యాన్ని వందలాది లారీల్లో కాళహస్తి, తిరుపతి తదితర ప్రాంతాల్లోని మిల్లులకు తరలిస్తున్నారు. సంచులకు రంధ్రాలు ఎక్కువగా ఉండటంతో రవాణాలో ధాన్యం పోతుండటంతో నష్టం వాటిల్లుతోంది.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

రమేష్‌రెడ్డి, డీఎం, పౌర సరఫరాల సంస్థ

క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. రైతులు అధైర్యపడకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి. ఇప్పటికే సుమారు 20 వేల టన్నులు కొనుగోలు చేశాం. మంచి సంచులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం.

## ఇక్కడా.. మట్టికొట్టారు



శ్రీకాళహస్తి : వైకాపా హయాంలో అవినీతి జలగలు మట్టినీ వదలిపెట్టలేదు. ఏర్పేడు మండలంలో చిందేపల్లి, శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని ఊరందూరులో జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. ఊరందూరు కాలనీని ముఖ్యమంత్రి హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఇక్కడి కాలనీ అభివృద్ధికి వందలాది టిప్పర్లతో మట్టిని నింపడంలో అవినీతి, అక్రమాలు జరిగినట్లు గతంలోనే అధికారులు గుర్తించడం విశేషం.

**బిల్లుల చెల్లింపుల్లో..**

జగనన్న కాలనీల్లో భూసేకరణ, కాలనీల అభివృద్ధిలో జరిగిన అవినీతి, అక్రమాలను గుర్తించిన విషయం తెలిసిందే. అప్పట్లో క్యూబిక్ మీటరు మట్టి తవ్వకాలకు రూ.75 నుంచి రూ.86 వరకు చెల్లించారు. తరలింపునకు రూ.23.30 నుంచి రూ.75.30 వరకు నిర?యించారు. చుట్టుపక్కలే మట్టిని యథేచ్ఛగా తోడేసి ఇష్టానుసారం బిల్లులు పెట్టి రూ.కోట్లు దండుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల రికవరీలు జరుగుతున్న నేపథ్యంలో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది.

ప్రాంతాల వారీగా భూసేకరణ

చిందేపల్లి :ఎకరాలు: 407

మంజూరైన ఇళ్లు: 10,500

ఊరందూరు :

ఎకరాలు: 175

మంజూరైన ఇళ్లు: 4,650

## క్వాంటమ్.. ఆసక్తి

తిరుపతి : రాజధాని అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా మార్చేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోంది. సిలికాన్ వ్యాలీ తరహాలో అభివృద్ధి చేస్తామని, సాంకేతిక విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా రెండు ప్రఖ్యాత సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల నమోదుకు అవకాశం కల్పించింది. 4 వారాల ఆన్‌లైన్ శిక్షణను కేవలం రూ. 500కే ఇచ్చేలా ఏర్పాట్లు చేసింది. దీంతో ఇంజినీరింగ్, ఐఐటీ విద్యార్థులు నమోదుకు ఆసక్తి చూపారు. ఇంజినీరింగ్ కళాశాలల ఆచార్యులకు శనివారం ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించనుంది.

నిర?యమిలా.. క్వాంటమ్ వ్యాలీ అవసరాలు తీర్చేలా రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మందికి శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర?యించింది. దీని కోసం అమెరికాకు చెందిన 'వైజర్', హైదరాబాద్‌లోని 'క్యూబిటెక్ స్మార్ట్ సొల్యూషన్స్' సంస్థలతో ఒప్పందం చేసుకుంది. దరఖాస్తులు ఆహ్వానించగా 54 వేల మందికి పైగా ఆసక్తి చూపారు. వీరికి నాలుగు వారాల పాటు మొదటి విడత శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు గాను ఒకరికి రూ. 2 వేల ఫీజుగా నిర?యించగా అందులో ప్రభుత్వమే రూ. 1500 చెల్లిస్తుంది. మిగిలిన రూ.500 విద్యార్థి భరించాలి.

మొదటి విడతలో క్వాంటమ్ కంప్యూటింగ్, డీప్ టెక్, ఏఐ, అల్గారిథంలపై ప్రాథమిక అవగాహన కల్పిస్తారు. తిరుపతి జిల్లాలో రెండు ప్రభుత్వ, నాలుగు ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు, ఓ ఐఐటీకి చెందిన 1614 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో ఎస్వీయూకు చెందినవారే 473 మంది ఉన్నారు.

విద్యార్థులకు వరమే

క్వాంటమ్ శిక్షణ డిగ్రీతోపాటు ఎంటెక్ చేసిన వారికి, చదివేవారికి ఉపయోగం. ఎంఎస్సీ, ఎంసీఏ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, స్టాటిటిక్స్ విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. నూతన సాంకేతిక విధానాలు నేర్చుకుంటే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. జి.శ్రీనివాసులు, ప్రిన్సిపల్, ఎస్వీయూ

## ఆగలేదు.. ఆపలేదు!

పాడేరు : జిల్లాలో గంజాయి అక్రమ రవాణాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడలేదు. పోలీసులు జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు పెట్టి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నా.. అక్రమార్కులు కొత్త ఎత్తుగడతో దందా సాగిస్తున్నారు. అక్రమ రవాణా, క్రయవిక్రయాలు, వినియోగించే వారిపై ప్రత్యేక నిఘాపెట్టి.. ఎప్పటికప్పుడు నివారణ చర్యలు తీసుకుంటున్నా ఆశించిన స్థాయిలో మార్పు కనిపించడం లేదు. యువకులే అధికంగా గంజాయి రవాణా ఊబిలో కూరుకుపోతున్నారు. జల్సాలకు అలవాటు పడి.. అధికంగా డబ్బు వస్తుందన్న ఆశతో.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి మరీ గంజాయి తరలిస్తున్నారు. ఒడిశా నుంచి అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలమీదుగా తరలిస్తున్నారు. ఒడిశాలో కేజీ రూ. 5 వేల నుంచి రూ. 6 వేల మధ్య కొనుగోలు చేసి.. వారి స్వస్థలాల్లో కేజీ రూ. 25 వేలకు అమ్ముతున్నారు. కరా?టక, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చి.. రోడ్డు, రైలు మార్గాల ద్వారా రవాణా చేస్తున్నారు. కొద్దిరోజుల నుంచి దందాతీరు మారింది. పోలీసుల కళ్లుగప్పేందుకు మహిళలతో రవాణా చేయిస్తున్నారు.

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో (ఏఓబీ) దేశంలో ఎక్కడా




లభించని శీలావతి రకం పండుతుంది. దేశవిదేశాల్లో దీనికి మంచి డిమాండ్ ఉంది. దీంతో ఇతర రాష్ట్రాలకు చెందిన ముఠాలు.. ఏజెన్సీ బాటపడుతున్నాయి. ఏజెన్సీకి దగ్గరగా ఉన్న నర్సీపట్నాన్ని ఆసరాగా చేసుకుని దందా సాగిస్తున్నారు. ఇటీవల విజయనగరం జిల్లా సంతకవిటి మండలానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గాదె రేణుక నర్సీపట్నంలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వారిని బృందంగా ఏర్పరుచుకున్నారు. ఈమె నెట్‌వర్క్ రాష్ట్రాలు దాటి విదేశాలకు చేరింది. ఏజెన్సీలో గంజాయి కొనుగోలు చేసి.. కరా?టక, తమిళనాడుతోపాటు శ్రీలంకకు కూడా సరఫరా చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

**దొరికితే కఠిన చర్యలు**

**- తుహిన్‌సిన్హా, ఎస్పీ, అనకాపల్లి**

జిల్లాలో సంకల్పం పేరుతో అవగాహన కార్యక్రమాలు, సదస్సులు పెడుతున్నాం. జిల్లాలో గంజాయి అక్రమ రవాణాలో పట్టుబడిన వారికి చట్టప్రకారం కఠిన చర్యలుంటాయి. గంజాయి రవాణా చేస్తున్నట్లు ఎవరికైనా తెలిస్తే.. సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వండి. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

## పాఠం సులువే చిన్నా!

నక్కపల్లి : బోధనా విధానంలో ఎప్పటికప్పుడు నూతన పద్ధతులు అమలుచేస్తున్న కూటమి ప్రభుత్వం.. పాల్ (పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్) ల్యాబ్ ద్వారా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు కృషి చేస్తోంది. జిల్లాలోని పలు పాఠశాలల్లో దీన్ని పటిష'ంగా అమలు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజూ జరిగే బోధనతోపాటు, కనీస ప్రాథమిక అంశాల్లో విద్యార్థుల సమర్థతను తెలుసుకోడానికి విద్యాశాఖ పాల్ ల్యాబ్‌ను ప్రవేశపెట్టింది. గతేడాది తొలివిడతగా 29 (20 కేజీబీవీలు, అయిదు ఆదర్శ, గురుకుల, గిరిజన సంక్షేమ పాఠశాలలు) పాఠశాలల్లో అమలులోకి తెచ్చారు. ఈ ఏడాది మరో 18 పీఎం శ్రీ పాఠశాలల్లో కూడా ప్రవేశపెట్టారు. రెండు విడతల్లో వెరసి 47 పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు పాల్ ల్యాబ్ అమలు చేస్తున్నారు. ప్రతి పాఠశాలకు 30 చొప్పున ట్యాబ్‌లు, హెడ్‌ఫోన్ సెట్లు అందించారు. ట్యాబ్‌లో ప్రతి పాఠానికి సంబంధించి ప్రత్యేకంగా 45 నిమిషాల చొప్పున విద్యార్థులకు పరీక్ష ఉంటుంది. ఇందులో వారి సామర్థ్యాన్ని ఆన్‌లైన్‌లో గుర్తించి నివేదిక ఇస్తారు. 10 వేల మంది విద్యార్థులకు దీనిపై సాధన చేస్తున్నారు.

**ఎన్నో ప్రయోజనాలు..**

బడిలో విద్యార్థి చదివిన చదువుకు సంబంధించి రోజూవారీ ప్రణాళిక పాఠశాలలకు ఇచ్చిన ట్యాబ్‌ల్లో ఉంటుంది. ఇందులో తెలుగు, ఆంగ్లం, గణితంపైనే సాధన జరుగుతుంది. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రాథమిక అంశాలపై పరీక్ష ఉంటుంది. ఇది ట్యాబ్‌లోనే చేయాల్సి ఉంటుంది. దీని ఆధారంగా వారి చదువు పరిస్థితిని స్థానిక, జిల్లా స్థాయి అధికారులు గుర్తిస్తారు.



ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు ట్యాబ్‌లో మరోసారి వస్తాయి. వీటిని విద్యార్థులు చదువుకుని పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఎవరైనా వెనుకబడినట్లు ఉంటే మరింత సాధన చేసేలా ఇందులో సూచనలు తెలుస్తాయి. దీనికనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగాల్సి ఉంటుంది.

**ఆత్మవిశ్వాసం పెరిగింది**

పాల్ ల్యాబ్ విధానంలో మాకు బోధించిన పాఠ్యాంశాలను పునశ్చరణ చేసుకునే అవకాశం కలుగుతోంది. దీని ద్వారా సందేహాలుంటే పూర్తిగా నివృత్తి అవుతున్నాయి. మరింత ఆత్మవిశ్వాసం పెరిగింది.

**పక్కాగా అమలు–** అప్పారావు నాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి

దశలవారీగా పాల్ ల్యాబ్‌ల సంఖ్య పెంచుతున్నారు. విద్యార్థుల చదువు సామర్థ్యం పెంపొందించేలా ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. ఇందుకోసం ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం. కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసేలా ఉపాధ్యాయులు, బోధనా సిబ్బందికి సూచనలు ఇస్తున్నాం.

చురకలు



# వృథా వస్తువులిస్తారా.. సరకులిస్తారు!

అనకాపల్లి : శుభ్రమైన పల్లెసీమలే లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛరథాలకు స్వీకారం చుట్టింది. ఇంటిలో నెలల తరబడి ఎందుకూ పనికిరాకుండా పడి ఉండే వస్తువులను తీసుకుని వాటికి బదులు నిత్యావసరాలను నేరుగా ఇంటివద్దే అందజేస్తారు. స్వచ్ఛరథం రోజుకు రెండు గ్రామాలకు వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మూడు మండలాలకు ఈ స్వచ్ఛరథాలను కేటాయించారు. అనకాపల్లి మండలానికి కేటాయించిన స్వచ్ఛరథాన్ని ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ వాహనంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, లోహపు వస్తువులు తీసుకొని మార్కెట్ ధరకు అనుగుణంగా నగదు అందజేస్తారు. నగదు వద్దంటే నిత్యావసర వస్తువులను అందిస్తారు. ఈ విధానం వల్ల గ్రామాల్లో ఇబ్బడి ముబ్బడిగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. గతంలో ఇంటింటికి బియ్యం పంపిణీ చేసిన ఎండీయూ వాహనాలను అద్దెకు తీసుకొని అవసరమైన మార్పులు చేసి స్వచ్ఛ



రథంగా మార్పు చేశారు. స్వచ్ఛరథం నిర్వహణకు ప్రభుత్వం నెలకు రూ. 25 వేల చొప్పున అందిస్తుంది. నిర్వాహకులు కేజీ పాత ఇనుము రూ. 20, పేపర్లు రూ.15, పుస్తకాలు రూ. 10, అట్టపెట్టెలు రూ.10, ప్లాస్టిక్ సీసాలు రూ. 20, స్టీలు వస్తువులు రూ. 20, అల్యూమినియం రూ. 120, గాజుసీసా రూ. 2 చొప్పున కొనుగోలు చేస్తారు. వస్తుమార్పిడి విధానం కావాలని కోరుకునే వారికి కొబ్బరినూనె, దుస్తుల సబ్బులు, ఉల్లిపాయలు, కందిపప్పు, గోధుమపిండి ఇలా పలురకాల నిత్యావసర సరకులు ఇస్తారు.

ప్రభుత్వం మంజూరు చేసిన స్వచ్ఛరథం జనవరి 1 నుంచి సేవలు ప్రారంభించింది. షెడ్యూల్ ప్రకారం నిర్దేశించిన రోజుల్లో ఆయా గ్రామాల్లో పర్యటిస్తుంది. గ్రామాలను శుభ్రంగా ఉంచే ప్రక్రియలో ఇదో ముందడుగుగా నిలుస్తుందని ఎంపీడీఓ ఆశాజ్యోతి తెలిపారు.

# వసూళ్లాలయం..!

రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరం క్వారీ ప్రాంతం లో ఉన్న సచివాలయంలో ఓ వ్యక్తి కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్ర స్థాయిలో ఇంటికొచ్చి పరిశీలించి న వీఆర్వో రూ.వెయ్యి డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం బాలాజీపేట లో ఉంటున్న ఓ మహిళ భర్త చనిపోవడంతో ఫ్యామిలీ ధ్రువ పత్రం కోసం దరఖాస్తు చేశారు. గతంలో వారు దేవీచౌక్ ప్రాంతంలో ఉండేవారు. దీంతో సచివాలయంలో దరఖాస్తు తీసుకోలేదు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వీఆర్వో వారింటికొచ్చి, రూ.12000 డిమాండ్ చేశారు. ఇదే విషయా న్ని ఉన్నతాధికా రులకు ఫిర్యాదు చేస్తే దరఖాస్తు కాగితాలు వెనక్కి ఇచ్చేశారు. పారదర్శకంగా, వేగంగా ప్రజలకు మెరుగైన సేవలందించడానికి తెరపైకి తెచ్చిన సచివాలయాల వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. ప్రస్తుతం ఏ సంక్షేమ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నా సచివాలయాలకు వెళ్లాల్సిందే. రేషన్‌కార్డు నుంచి కులధ్రువీకరణ పత్రాలు వరకు ఇక్కడే మంజూరు చేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం ద్వారా అవినీతికి అడ్డుకట్ట వేయచ్చని సర్కారు భావిస్తున్నా..క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.

**కొరవడిన పర్యవేక్షణ**

సచివాలయంలో ఏదైనా పని కోసం ముందుగా దరఖాస్తు చేయాల్సి ఉంది. అక్కడ నుంచి మున్సిపల్ కార్యాలయం, అర్బన్ తహసీల్దార్ కార్యాలయాలకు దరఖాస్తులు చేరతాయి. ఆ తర్వాత సంబంధిత శాఖల అధికారులు సచివాలయ సిబ్బంది సహకారంతో క్షేత్ర స్థాయి పరిశీలన చేసి ధ్రువీకరించాల్సి ఉంటుంది. సచివాలయాల్లోనే బేరసారాలు చేస్తున్నారు. ఆయా శాఖల అధికారులకు కూడా ఇది సులువైన మార్గంగా మారింది. దీంతో వారూ సచివాలయ సిబ్బందిని ప్రోత్సహిస్తున్నారు. సచివాలయాలు డివిజన్ పరిధిలో ఉండటంతో పర్యవేక్షణ కొరవడింది.

**అందుబాటులో లేక** కొన్ని చోట్ల పూర్తి స్థాయిలో సచివాలయం సిబ్బంది



అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ వీరు అందుబాటులో ఉండాలి. ప్రధానంగా సాయంత్రం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రజా సమస్యలపై అర్జీల స్వీకరణకు గ్రీవెన్స్ నిర్వహించాల్సి ఉంది. కానీ ఇవేమీ ఆచరణకు నోచుకోవడం లేదు. మరో వైపు నగరపాలక సంస్థ యంత్రాంగం చేయాల్సిన పనులను కూడా సచివాలయాల సిబ్బందికి అప్పగించడంతో వారిలో అసహనం పెరుగుతోంది. ఒక్కొక్క సచివాలయంలో పది మంది వరకూ ఉద్యోగులు ఉన్నా.. ప్రయోజనం లేకుండా ఉంది.

# కంకర పరిచి.. వెన్నువిరిచి

కోడుమూరు : కోడుమూరు- వెల్దుర్తి రహదారి విస్తరణ రాళ్లను దాటడం లేదు.. గుత్తేదారు ఇరువైపులా కంకర పరిచి మిగిలిన పనులు వదిలేశారు.. రాళ్లల్లో బస్సులు నడపలేమంటూ ఆర్టీసీ సర్వీసులు నిలిపివేసింది.. పది గ్రామాల ప్రజలకు ద్విచక్రవాహనాలు, ఆటోలే దిక్కయ్యాయి.. దుమ్ము, రాళ్లలో ప్రయాణం ప్రాణసంకటంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

28 కి.మీ.. రూ.20 కోట్లు

కోడుమూరు- వెల్దుర్తి రహదారి పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాలను అనుసంధానం చేస్తుంది. దారంతా గుంతలమయంగా మారింది.. దారిలో ప్రయాణం నరకయాతనలా మారింది.. బాగు చేయాలంటూ ఆయా గ్రామాల ప్రజలు గత వైకాపా సర్కారుకు విన్నవించినా పట్టించుకోలేదు.. 'కూటమి' ప్రభుత్వం వచ్చిన వెంటనే 28 కి.మీ. మేర రహదారిని బాగు చేసేందుకు రూ.20 కోట్లు మంజూరు చేసింది. రోడ్డును 7 మీటర్లు వెడల్పు చేసి రెండు వరుసలుగా తీర్చిదిద్దాలి..12 కల్వర్టులు, వెంకటగిరి, గోరంట్ల గ్రామాల్లో సీసీ దారి వేయాలి.

తప్పని అవస్థలు..

కోడుమూరు నుంచి వయా వెంకటగిరి, గోరంట్ల, లద్దగిరి వరకు రెండు వైపులా కంకర పోశారు. 14.5 కి.మీ. మేర ఇదే పరిస్థితి ఉంది. రాళ్లల్లో వెళ్లలేక వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు.

రోడ్డుకు ఇరువైపులా ఉన్న 10 గ్రామాల ప్రజలకు వివిధ అవసరాల నిత్యం వెల్దుర్తి, కోడుమూరు వెళ్తుంటారు. పనులు ముగించుకొని రాత్రి వేళ బిక్కుబిక్కుమంటూ వెళ్తున్నారు.శిథిలావస్థకు చేరిన 12 కల్వర్టులను కొత్తగా నిర్మించాల్సి ఉంది. ఇందుకు సంబంధించి పెద్ద గుంతలు తవ్వి వదిలేశారు. కనీసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. కంకర పరిచి దానిపై ఎర్రమన్ను పోశారు. చదును చేయకపోవడంతో విపరీతమైన దుమ్ములేస్తోంది. ఓ వైపు కంకర రాళ్లు.. మరోవైపు దుమ్మును దాటి వెళ్లలేక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. " త్వరలో తారు పనులు చేపడతామని' డీఈ రమణ తెలిపారు.

# తుంగలో వాలి.. కన్నడలో బేరం



ఎమ్మిగనూరు : తుంగభద్ర దిగువ కాల్వ పరిధిలో సాగైన వరి ధాన్యం సరిహద్దులు దాటుతోంది. కరా?టకలో కర్నూలు సోనాకు డిమాండ్ ఉండటంతో వ్యాపారులు కన్నేశారు. ఇక్కడికొచ్చి తక్కువ ధరకు కొనుగోలు చేసి మార్కెట్ సెస్సు చెల్లించకుండా గుట్టుగా అక్కడికి తీసుకెళ్లి లాభం పొందుతున్నారు. సరిహద్దులో తనిఖీ కేంద్రాల్లో సిబ్బంది కొంత సొమ్ము తీసుకొని రైట్ చెప్పేస్తున్నారు. ఒక లారీకి రూ.9వేల నుంచి రూ.11వేల వరకు మార్కెట్ శాఖకు సెస్సు రావాల్సి ఉంది. ఒక లారీకి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు తీసుకొని పంపిస్తున్నారు. ఇలా మార్కెటింగ్ శాఖ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.

**సెస్సు లక్ష్యం తుస్సు**

సరిహద్దు మండలాలైన హాలహర్వి, హొళగుంద, ఆదోని, మంత్రాలయం మండలాల్లో తనిఖీ కేంద్రాలున్నాయి. సెక్యూరిటీ గార్డులు, మార్కెట్ కమిటీ సిబ్బంది కలిసి వసూళ్లకు పాల్పడుతున్నారు. బిల్లు పుస్తకాలు వారి దగ్గరే ఉన్నా.. ఐదు లారీలు రవాణా చేస్తే.. ఒక లారీకి మార్కెట్ సెస్ వసూలు చేయడం.. డబ్బులు తీసుకొని మిగిలిన లారీలు పంపిస్తున్నట్లు ఫిర్యాదులొచ్చాయి. మరికొన్ని లారీలు రైతుల పేరుతో సరిహద్దు దాటిస్తున్నారు.

**పొరుగులో పొందు లాభం**

తుంగభద్ర దిగువ కాల్వ నీటి ఆధారంగా 36వేల ఎకరాల్లో వరి సాగైంది. ఎకరానికి 25-35 సంచుల దిగుబడి వచ్చింది. క్వింటా ధాన్యానికి ఏ గ్రేడ్ రూ.2,389, సాధారణ రకం రూ.2,369 మద్దతు ధర ప్రకటించారు.

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో పొరుగు రాష్ట్రం(కరా?టక) వ్యాపారులు కన్నేశారు. తుంగా తీరంలో వాలిపోయారు. రూ.2,200 నుంచి రూ.2,300 వరకు ధర చెల్లిస్తున్నారు. కరా?టకకు తీసుకెళ్లి అక్కడ క్వింటాకు రూ.2,500 వరకు అమ్మేస్తున్నారు.

నేరుగా బియ్యం మిల్లులకు

తుంగభద్ర తీరంలో కర్నూలు సోనా ఎక్కువగా సాగు చేస్తారు. ఈ బియ్యానికి అక్కడ డిమాండ్ ఎక్కువ. కరా?టక రాష్ట్రంలోని సిరుగుప్ప, రాయచూరు, బళ్లారిలో బియ్యం మిల్లులు ఎక్కువ. ఆయా ప్రాంతాలకు చెందిన కొందరు జిల్లాకొచ్చి తక్కువ ధరకు ధాన్యం తీసుకొని నేరుగా మిల్లులకు తరలిస్తున్నారు.

ఒక లారీలో 320-400 సంచులు(ఒక సంచిలో 70కిలోలు) తీసుకెళుతున్నారు. ఈ లెక్కన లారీలో 280 క్వింటాళ్ల నుంచి రూ.225 క్వింటాళ్ల వరకు ధాన్యం ఉంటుంది. ఒక లారీపై రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు మిగులుతుంది. లాభం అధికంగా ఉండటంతో వ్యాపారులు దండిగా వస్తున్నారు. నిత్యం 15 నుంచి 20 లారీల్లో తరలి వెళ్తోంది.. తుంగా తీరంలో చేతికొచ్చిన వరి ధాన్యంలో 90 శాతం కరా?టక రాష్ట్రానికే వెళ్లినట్లు అంచనా.

# ప్రయోగ'మాయే'నా?



అమలాపురం : జిల్లాలో ఇంటర్మీడియట్ స్థాయిలో ప్రయోగశాల గదుల బోర్డులకే పరిమితం అవుతున్నాయి. వాటి తలుపులు తెరిచి చూస్తే లోపల ఖాళీ టేబుళ్లు, పగిలిన సీసాలు, బూజు పట్టిన పరికరాలే దర్శనమిస్తున్నాయి. ఈ నెల 27 నుంచి ప్రయోగ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఎంతవరకు రాణిస్తారోనన్న సందేహం తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతోంది.

**కొరవడిన తనిఖీలు**

విద్యాశాఖ అధికారుల తనిఖీలు నామమాత్రంగా మారడంతో సైన్స్ ప్రయోగశాలల నిర్వహణపై ఎవరికీ పట్టింపులేకుండా పోయింది. విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు జరుగుతున్నాయా.. లేదా.. కావాల్సిన ముడిసరకులు, రసాయనాలు, అందుబాటులో ఉన్నాయా.. లేవా.. వంటివి ఎవరూ పట్టించుకోవడం లేదు.

**80 శాతం పైగా ఇదే తీరు**

జిల్లాలోని కొన్నిచోట్ల మాత్రమే విద్యార్థులకు ప్రయోగాలకు సంబంధించిన పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. ముఖ్యంగా ప్రైవేటులో వీటికి ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వడం లేదు. రెండో సంవత్సరంలో ప్రయోగ పరీక్షలకు 30 మార్కులు ఉన్నా ఏదోలా మాయ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**హైస్కూల్ ప్లస్‌లలో..**గత ప్రభుత్వం జిల్లాలో 26 ఉన్నత పాఠశాలలను ఇంటర్మీడియట్ స్థాయికి పెంచింది. ఇక్కడ అవసరమైన కనీస వసతుల కల్పించడంలో మాత్రం పూర్తిగా విఫలమైంది. దీంతో ఇక్కడ చేరిన సైన్సు విద్యార్థులను సమీపంలో ఉన్న గురుకులాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు తీసుకు వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అల్లవరం హైస్కూల్ ప్లస్‌లో ఎంపీసీ, బైపీసీ విద్యార్థినులు 32 మంది ఉన్నారు. వీరికి ప్రయోగ పరీక్షల ప్రాక్టీస్‌ను గోడి గురుకుల పాఠశాలలో నిర్వహించేవారు. పరీక్షలను అమలాపురంలో పూర్తి చేయనున్నారు.

: అల్లవరం జూనియర్ కళాశాలలో ప్రయోగ తరగతులు నిర్వహించలేదు. అయినా వారితో రికార్డులు రాయించి, వారికి కేటాయించిన కేంద్రాల్లో సిబ్బందిని సర్దుబాటు చేసుకుని పరీక్షలు పూర్తయ్యాయి అనిపించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

రావులపాలెం పరిధి ఓ కళాశాలలో పూర్తి సామగ్రి అందుబాటులో లేకపోవడంతో ఉన్నవాటితోనే విద్యార్థులకు అవగాహన కల్పించారు.

**చర్యలు తీసుకుంటాం**

- చంద్రశేఖర్‌బాబు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్మీడియట్ కళాశాలల్లో ప్రయోగ పరీక్షలు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం. హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు సమీపంలో ఉన్న కళాశాలల్లో, ఇతర కళాశాలల వారికి జంబ్లింగ్ విధానంలో నిర్వహిస్తాం.

# వేడినీళ్లకు వెచ్చించాల్సిందే..!



రాజమహేంద్రవరం : ప్రస్తుతం శీతాకాలం నేపథ్యంలో జిల్లాలో కనిష' ఉష్ణో?గ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం పది గంటలు దాటినా చలి తీవ్రత తగ్గడం లేదు. ఈ సమయంలో వేడినీటి స్నానం, గోరు వెచ్చని నీరు తాగడం శ్రేయస్కరమని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. చన్నీటి స్నానం చేయాలంటే అందరికీ ఇబ్బందే. అదీ బాలింతలు, గర్భిణులు, పసికందులైతే ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముంది. రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని మాతాశిశు విభాగంలో ప్రసవానికొచ్చిన గర్భిణులు, పురుడు పోసుకున్న బాలింతలకు చన్నీటితో కష్టాలు తప్పడం లేదు.

**కానరాని సౌకర్యం..**

జీజీహెచ్‌లోని మాతాశిశు విభాగానికి రోజుకు 150కు పైగా ఓపీతోపాటు 15 వరకు ప్రసవాలు జరుగుతాయి. గర్భిణులు, బాలింతలకు 100 పడకలున్నాయి. నిత్యం జిల్లాతోపాటు మన్యం, కోనసీమ ప్రాంతాల వాసులు ఎక్కువగా వస్తుంటారు. పురుడు కోసం వచ్చిన వారు వారం నుంచి పది రోజులు వార్డుల్లో ఉండాల్సి ఉంది. జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో మాతాశిశు విభాగాలకు వేడినీళ్ల కోసం గీజర్ల సౌకర్యం ఉంటుంది. ఇంత పెద్దాసుపత్రి అయినా ఇక్కడ ఆ సౌకర్యం లేక బాలింతలు, గర్భిణులు స్నానాలకు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి.

**బయట కొనుగోలు చేసి..**

చలి తీవ్రత తట్టుకోలేక కొందరు ఆసుపత్రి బయట వేడి నీళ్ల బకెట్‌కు రూ.80 చెల్లించి కొనుగోలు చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగేందుకు సైతం వేడినీళ్లు రావడం లేదని వాపోతున్నారు. వాటిని లీటరు రూ.30-40 చెల్లించి కొనుగోలు చేసుకుంటున్నామని పోలవరం జిల్లాకు చెందిన ఓ బాలింత సహాయకురాలు ఆవేదన వ్యక్తం చేశారు. మన్యం ప్రాంతం నుంచి వచ్చే గర్భిణులు, బాలింతల సహాయకులు జీజీహెచ్‌లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వారి కోసం ప్రత్యేకంగా 'బర్త్ వెయిటింగ్ హాలు' పేరిట భవనం ఉండేది. సంబంధిత అధికారులు స్పందించి గీజర్ల కొనుగోలుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# ఎకరాకు 32 బస్తాల ధాన్యం

నర్సీపట్నం : జిల్లాలో పంట కోత ప్రయోగాలు విజయవంతంగా పూర్తయ్యాయి. దిగుబడులను అంచనా వేయడంతోపాటు పంటలకు బీమా వర్తింపునకు ఏటా వీటిని చేపడుతుంటారు. గత ఏడాది నవంబరు మూడో వారం నుంచి ప్రారంభించారు. డిసెంబరు నెలాఖరు వరకు 1318 పంట కోట ప్రయోగాలు చేసి వాటి వివరాలను ఇటీవల ఆన్‌లైన్లో నమోదు చేశారు.

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) కింద ఈ ప్రయోగాలు చేపడుతుంటారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటలకు నష్టం వాటిల్లితే బీమాతో అన్నదాతలను ఆదుకునేందుకు వీటిని నిర్వహిస్తారు. గతంలో పొలాల్లో ఉండిపోయి నాశనమైన పంటకు బీమా వర్తించేది కాదు. ఇప్పుడు నారుమడి మొదలు ధాన్యం ఇంటికి చేరే వరకు ఏ దశలో పంటకు నష్టం వాటిల్లినా బీమా వర్తించేలా చర్యలు చేపడుతున్నారు. నర్సీపట్నం డివిజన్‌లతో ఉప గణాంకాధికారి భానూజీ పర్యవేక్షణలో పంట కోత ప్రయోగాలు



ముగిశాయి.జిల్లాలోని సిబ్బంది అందరికీ ముందుగా శిక్షణ ఇచ్చి ప్రయోగాలను ప్రారంభించారు. 200 ఎకరాలను యూనిట్‌గా తీసుకుని జిల్లాను 325 యూనిట్లుగా విభజించారు. నర్సీపట్నం డివిజన్‌లో 169 యూనిట్లలో ప్రయోగాలు చేశారు. వరి, చెరకు సాగులో 5శ్రీ5 ప్లాట్లలో ర్యాండమ్ విధానంలో చేపట్టారు. వరి 60 హెక్టార్ల విస్తీర?ంలో సాగవుతోంది. చెరకు 4 వేల హెక్టార్లలో ఉంది. వరిలో 97, చెరకులో 61 ప్రయోగాలు చేశారు. ఒక్కో ప్లాటుకు సగటున 13 నుంచి 15 కేజీలు, ఎకరాకు 32 బస్తాల చొప్పున దిగుబడి వస్తుందని అంచనాలు రూపొందించారు.

# పది ఫలితాల్లో మెరిసేలా..!

నర్సీపట్నం : పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా అమలు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని రోజూ పర్యవేక్షించేలా ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించింది. బోధన, సాధన, పరీక్షలు, ఇతర అంశాలను పరిశీలించి మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోనున్నారు.

నిత్యం తనిఖీలు..

మండల స్థాయి అధికారులు.. తహసీల్దారు, ఎంపీడీవో, ఎంఈవో, పంచా యతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, గృహ నిర్మాణం, వ్యవసాయం, పశుసంవర్ధక, ఇతర శాఖలకు సంబంధించిన అధికారులను



ఉన్నత పాఠశాలలకు ప్రత్యేకాధికారులుగా నియమించారు.

వీరు హెచ్‌ఎం, ఎంఈవో, డిప్యూటీ డీఈవో, డీఈవో సమగ్ర శిక్షా అధికారులను సమన్వయం చేసుకుంటూ వంద రోజుల ప్రణాళిక మెరుగ్గా నిర్వహించేలా చర్యలు తీసుకుంటారు.

రోజూ నిర్వహించే పరీక్షల్లో విద్యార్థులు సాధిస్తున్న మార్కులు ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయడం, సబ్జెక్టు వారీగా సామర్థ్యాలను అంచనా వేయడం, ఇతర అంశాలు పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షించాలి.

రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు, ఇతర అంశాలను పరిశీలిస్తారు. విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత ఉపాధ్యాయులతో చర్చిస్తారు.ఎక్కువ రోజులు పాఠశాలకు గైర్హాజరయ్యే విద్యార్థులు విషయంలో తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చేస్తారు.

# పాలేరు దాటేందుకు పరిష్కారం

అవుకు : ఏటా పాలేరు వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తూ ఉంటుంది. బనగానపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో పంటలు నీట మునిగి రైతులు నష్టపోతుంటారు. ఆగిపోయిన వంతెన పనులు గుర్తించిన కూటమి ప్రభుత్వం నిధులు విడుదలకు అంగీకారం తెలిపింది.

**ప్రణాళికాబద్ధంగా నిర్మించక..**

వరద ముప్పు తగ్గించే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో శివవరం-ఆకుమళ్ల రహదారిలో పాలేరు వాగుపై 130 మీటర్ల ఎత్తు, 9 మీటర్ల వెడల్పుతో రూ.7 కోట్ల కేంద్రం నిధులతో హైలెవల్ వంతెన నిర్మించారు. మధ్యలో పనులు ఆగిపోవడంతో రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. స్థానిక రైతులు సమస్యను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ముఖ్యమంత్రితో మాట్లాడి రూ.3.57 కోట్ల నిధులు మంజూరు చేయించారు.

రక్షణ గోడల నిర్మాణం

కూటమి ప్రభుత్వం విడుదల చేసిన రూ.3.57 కోట్లతో ఆగిపోయిన పనులు చేపట్టనున్నారు. హైలెవెల్ వంతెనకు సమానంగా రక్షణ గోడ నిర్మిస్తారు. వంతెనకు రెండు వైపులా 160 మీటర్ల రోడ్డు నిర్మిస్తారు. చుట్టుపక్కల రైతుల పొలాల్లోకి వరద నీరు చేరకుండా మట్టి కట్టలు వేసి రక్షణ గోడ ఏర్పాటు చేస్తారు. వంతెన ఎత్తుగా ఉన్న నేపథ్యంలో మట్టి తోలి 320 మీటర్ల దూరం బీటీ వేస్తామని డీఈ మన్మథబాబు తెలిపారు.

20 ఏళ్లుగా అవస్థలుపాలేరు వాగు కారణంగా అవుకు మండల పరిధిలోని శివవరం, చెన్నపల్లె, సంజామల మండలం కమలపురి, సంజామల చుట్టుపక్కల మరో ఐదు గ్రామాల రైతులు ఏటా నష్టపోతూ ఉంటారు. అవుకు రిజర్వాయర్ ఏర్పాటుచేసి 20 ఏళ్లు పూర్తైంది. అప్పటి నుంచి పొలాలు వరద ముంపునకు గురవుతూనే ఉన్నాయి.

అవుకు రిజర్వాయర్ నిండితే గేట్లు ఎత్తడం, ఎస్సార్బీసీ లీకేజీ నీరు, సమీపంలో ఉన్న ఇతర ఉప కాల్వల నీరు, వర్షం నీరంతా కలసి పాలేరు వాగుకు చేరుతుంది. ఫలితంగా ఆయా గ్రామాల పరిధిలో ఏటా సుమారు 300 ఎకరాల వరకు వరి పంటకు నష్టం జరుగుతూ ఉంటుంది.

# కొంటెగా కవ్విస్తున్న మీనాక్షి..

కాస్త గ్యాప్ దొరికితే చాలు సోషల్ మీడియాలో దూరిపోయే సెలబ్రిటీలు ఈమధ్య మరింత ఎక్కువైపోయారు. అందులో భాగంగానే సినిమాలకు సంబంధించిన ప్రమోషన్స్ తో పాటు తమ ఉనికిని చాటుకోవడానికి ఇలా అందాలు ఆరబోస్తూ అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరికొంతమంది లంగా ఓణీలలో.. చీరకట్టులో సాంప్రదాయంగా కనిపిస్తూ అలరిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా సంక్రాంతి హీరోయిన్గా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న మీనాక్షి చౌదరి కొంటెగా కవ్విస్తూ కొన్ని ఫోటోలను సోషల్ మీడియా ద్వారా పంచుకుంది. ఎల్లో, మెరూన్ రెడ్ కాంబినేషన్లో ఉన్న లంగావోణీ ధరించిన ఈమె.. తన అందాలతో అభిమానులను మెస్మరైజ్ చేసింది. కొంటెగా ఫోటోలకు ఫోజులు ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.." కొంచెం నాటీ..కొంచెం స్వీట్" అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. ప్రస్తుతం మీనాక్షి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈమె అందాన్ని చూసి అభిమానులు ముగ్ధులు అవుతున్నారు. అంతేకాదు ఫేస్ ఎక్స్ప్రెషన్స్ అద్భుతం అంటూ కొంతమంది కామెంట్లు చేస్తుండగా.. మరికొంతమంది నెటిజన్స్ మీనాక్షి అందానికి ఎంతటి వారైనా ఫిదా అవ్వాల్సిందే అంటూ కామెంట్ పెడుతున్నారు. ఇంకొంతమంది మీనాక్షి మన ఇంటి అమ్మాయి అంటూ ఎవరికి వారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ఉండడం గమనార్హం. మీనాక్షి మోడల్ గా తన కెరీర్ను ఆరంభించింది. 2018 లో మిస్ ఇండియాగా, మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ ఫస్ట్ రన్నరప్ నిలిచి అందరిని ఆశ్చర్యపరిచింది. 2021లో సుశాంత్ హీరోగా వచ్చిన ఇచ్చుట వాహనములు నిలపరాదు అనే సినిమాలో హీరోయిన్గా నటించి తెలుగు తెరకు పరిచయమైంది . ఇకపోతే ఈ సినిమా సమయంలోనే సుశాంత్ తో మంచి స్నేహం ఏర్పడింది. ఆ స్నేహం కాస్త అప్పుడప్పుడు



కలిసి కనిపించే రేంజ్ కి వెళ్ళింది. అయితే ఇది చూసిన చాలామంది వీరిద్దరూ డేటింగ్ లో ఉన్నారని పెళ్లి కూడా చేసుకోబోతున్నారు అంటూ వార్తలు రాగా.. ఇటీవల ఒక సినిమా ప్రమోషన్స్ లో భాగంగా స్పందించి రూమర్స్ కి చెక్ పెట్టింది మీనాక్షి. ఇకపోతే మీనాక్షి సంక్రాంతి హీరోయిన్గా హ్యాట్రిక్ అందుకుంది. 2024 లో త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో మహేష్ బాబు నటించిన గుంటూరు కారం సినిమాలో హీరోయిన్గా నటించి మంచి విజయం అందుకుంది. ఇక 2025న మళ్లీ సంక్రాంతికి వెంకటేష్ తో అనిల్ రావిపూడి తెరకెక్కించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా చేసి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఇక ఈ ఏడాది సంక్రాంతికి కూడా సందడి చేసింది ఈ ముద్దుగుమ్మ. నవీన్ పోలిశెట్టి హీరోగా వచ్చిన అనగనగా ఒక రాజు సినిమాలో హీరోయిన్గా నటించి మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అలా వరుసగా మూడు సంవత్సరాల పాటు సంక్రాంతికి వస్తూ మంచి విజయాలను అందుకొని.. సంక్రాంతికి హ్యాట్రిక్ కొట్టిన హీరోయిన్గా రికార్డు సృష్టించింది మీనాక్షి చౌదరి.

# ఇకపై సమంత నిడుమోరు!

సాధారణంగా హీరోయిన్లు పరిచయమైన సమయంలో టైటిల్స్ కార్డులో హీరోయిన్ పేరుతో లేదా పేరు చివరనా తండ్రి పేరుతో కలిపి వేసుకుంటారు. ఇంటిపేరు మాత్రం పెద్దగా వెలుగులోకి రాదు. ఇంటిపేరుతో హీరోయిన్ పేరు అంటే తెలుగు నటీమణుల విషయంలోనే కనిపిస్తుంది. కానీ అదే హీరోయిన్ పెళ్లి అయిన త?ర్వాత భర్త పేరు లేదా ఇంటి పేరుతో టైటిల్ కార్డ్స్ లో హైలైట్ అవుతుంది. సమంతను తీసుకుంటే సమంత పెళ్లికి ముందు వరకూ సమంతగానే టైటిల్ కార్డ్స్ లో కనిపించింది. అక్కినేని నాగచైతన్యను వివాహం చేసుకున్న తర్వాత సమంత అక్కినేనిగా టైటిల్ కార్డ్స్ లో పడేది. కొంత కాలం కాపురం అనంతరం విడిపోయే సమయంలో సమంత ఇన్ స్టా గ్రామ్ నుంచి అక్కినేని ని తొలగించి సమంతగా మార్చుకుంది. మొన్నటి వరకూ అలాగే కొనసాగింది. ఇటీవలే బాలీవుడ్ దర్శక, నిర్మాత రాజ్ నిడిమోరును రెండవ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇకపై సమంత పేరు సమంత నిడిమోరుగా నెట్టింట ప్రాచుర్యంలోకి రానుంది. ప్రస్తుతం సమంత ప్రధాన పాత్రలో



-మా ఇంటి బంగారం- అనే చిత్రం తెరకక్కుతోన్న సంగతి తెలిసిందే. నందిని రెడ్డి దర్శకత్వంలో రూపొందుతుంది. ఈ సినిమాకు మూల కథను అందించింది రాజ్ నిడిమోరు. దీంతో ఈసినిమా టైటిల్స్ కార్డులో సమంత నిడిమోరుగా వెలుగులోకి రానుందని తెలుస్తోంది. ప్ర?స్తుతం సమంత నటిస్తోన్నది ఈ చిత్రం ఒక్కటే. -ఖుషీ- తర్వాత అమ్మడు నటిస్తోన్న చిత్రం కూడా ఇదే. ఎన్నో బాలీవుడ్ ప్రయత్నాలు చేసి రాజ్ నిడిమోరుతో ప్రేమలో పడింది గానీ కొత్త అవకాశాలు మాత్రం ఒడిసి పట్టుకోలేకపోయింది. -శుభం- సినిమాతో సమంత నిర్మాతగానూ కొత్త ప్రయాణం ప్రారంభించిన సంగతి తెలిసిందే. -మా ఇంటి బంగారం- చిత్రం కూడా సమంత నిర్మిస్తోంది. ఇలా -ఖుషీ- త?ర్వాత సమంత సొంత బ్యానర్లోనే పని చేస్తోంది. అలాగే హీరోల్ని పెళ్లి చేసుకున్న పలువురు హీరోయిన్లు చూస్తే మహేష్ ను నమ్రత పెళ్లి చేసుకుని ఘట్టమనేని కుటుంబంలోకి అడుగు పెట్టారు. అప్పటి నుంచి ఘట్టమేని కోడిలిగానే ప్రాచుర్యంలోకి వచ్చారు. అలాగే అమల కూడా అక్కినేని నాగార్జునను ప్రేమ వివాహం చేసుకున్న వారే. అలాగే నాగచైతన్య రెండవ వివాహం తెలుగు అమ్మాయి శోభిత ధూళిపాళను పెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి శోభిత ఇంటిపేరు మారింది. వరుణ్ తేజ్ ని లావణ్య త్రిపాఠి పెళ్లి చేసుకుని కొణిదెల కుటుంబంలోకి అడుగు పెట్టింది. ఇంకా ఇలాంటి జంటలు మరికొన్ని ఉన్నాయి.




# రవితేజ 'ఇరుముడి'.. ఫస్ట్ లుక్ కి అదిరిపోయే రెస్పాన్స్



టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ తన ఫ్యాన్స్కు అదిరిపోయే సర్ ప్రైజ్ ఇచ్చారు. వరుస సినిమాలతో స్పీడ్ పెంచే రవితేజ.. ఈసారి ఒక కంప్లీట్ డిఫరెంట్ జోనర్తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యారు. రవితేజ 77వ సినిమా అనౌన్స్మెంట్ నుంచి పోస్టర్ రిలీజ్ వరకు ప్రతిదీ సోషల్ మీడియాలో ఆసక్తిని కలిగిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్?పై వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ చుట్టూ ఇప్పుడు టాలీవుడ్?లో గట్టి చర్చ నడుస్తోంది. రిపబ్లిక్ డే సందర్భంగా విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్?కు ఆడియన్స్ నుంచి అదిరిపోయే రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రానికి 'ఇరుముడి' అనే పవర్ ఫుల్ టైటిల్ను ఫిక్స్ చేశారు. పోస్టర్?లో రవితేజ నల్లని దుస్తుల్లో, మెడలో మాల వేసుకుని అయ్యప్ప స్వామి భక్తుడిగా కనిపిస్తుండటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇలాంటి భక్తితో కూడిన డ్రామాలో రవితేజను చూడటం ఫ్యాన్స్కు ఒక సరికొత్త అనుభూతిని ఇస్తోంది. పోస్టర్ రిలీజ్ అయిన కొద్దిసేపటికే ఈ లుక్ నెట్టింట వైరల్గా మారింది. దర్శకుడు శివ నిర్వాణ ఈ సినిమా కోసం ఒక బలమైన కథను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఎమోషన్స్ పండించడంలో దిట్ట అయిన శివ నిర్వాణ.. రవితేజ బాడీ లాంగ్వేజ్?కు తగ్గట్టుగా ఈ 'ఇరుముడి' కథను డిజైన్ చేశారు. ఈ పోస్టర్?లో రవితేజ ఒక చిన్న పాపను ఎత్తుకుని కనిపిస్తుండటం, చుట్టూ తోటి స్వాములు ఉండటం చూస్తుంటే.. కథలో అయ్యప్ప స్వామి దీక్షకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన నేపథ్యం ఉందని అర్థమవుతోంది. సాధారణ మాస్ సినిమాలకు భిన్నంగా రవితేజ ఏదో కొత్తగా ట్రై చేస్తున్నారనే ఫీలింగ్ ఆడియన్స్?లో బలంగా కలిగింది. ఈ సినిమాకు సంబంధించిన టెక్నికల్ టీమ్ కూడా చాలా స్ట్రాంగ్గా కనిపిస్తోంది. గతేడాది వరుస హిట్లతో దూసుకుపోతున్న జి.వి. ప్రకాష్ కుమార్ ఈ మూవీకి సంగీతాన్ని అందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ సైలెంట్?గా ప్రారంభమై మొదటి షెడ్యూల్?ను కూడా పూర్తి చేసుకున్నట్లు సమాచారం. రవితేజ కెరీర్?లో ఇదొక టాప్ హిట్ గా నిలుస్తుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. క్వాలిటీ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ అవ్వకుండా మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నేటి జనరేషన్ ఆడియన్స్ ఎప్పుడూ ఇలాంటి కొత్తదనంతో కూడిన రియలిస్టిక్ కథల కోసం వెయిట్ చేస్తుంటారు. రవితేజ నుంచి వస్తున్న ఈ డిఫరెంట్ అటెంప్ట్ కచ్చితంగా బాక్సాఫీస్ వద్ద మేజిక్ క్రియేట్ చేస్తుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. కేవలం ఒక పోస్టర్?తోనే సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పీక్స్కు తీసుకెళ్లడంలో టీమ్ సక్సెస్ అయ్యింది.

రవితేజ తన కెరీర్లో ఇంతవరకు టచ్ చేయని ఈ కొత్త రూట్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ ఏడాది చివరలో ఈ సినిమా థియేటర్లలోకి వచ్చే అవకాశం ఉంది. మరి ఈ ప్రయోగం రవితేజకు ఎలాంటి సక్సెస్?ను తెచ్చిపెడుతుందో చూడాలి.

# నిఖిల్.. ప్రతీసారి ఇలానే..



టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కెరీర్ గ్రాఫ్ గమనిస్తే ఒక వింతైన, ఆసక్తికరమైన సెంటిమెంట్ కనిపిస్తుంది. సాధారణంగా సినిమా వాయిదా పడితే అంచనాలు తగ్గిపోతాయని, నెగిటివ్ బజ్ వస్తుందని అందరూ భయపడతారు. కానీ నిఖిల్ విషయంలో మాత్రం కథ పూర్తిగా రివర్స్. ఆయన సినిమా ఎప్పుడు లేట్ అయితే అప్పుడు అది బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ హిట్ గా నిలుస్తోంది. 'స్వామిరారా' సినిమా నుండి మొదలైన ఈ 'డిలే' సెంటిమెంట్ ఇప్పటికీ కంటిన్యూ అవుతుండటం విశేషం. నిఖిల్ కెరీర్ను మలుపు తిప్పిన 'స్వామిరారా' విడుదల కావడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంది. చాలా కాలం ల్యాబ్లోనే ఉండిపోయిన ఆ సినిమా తీరా థియేటర్లకు వచ్చాక సంచలన విజయం సాధించింది. ఆ తర్వాత వచ్చిన 'కార్తికేయ', 'సూర్య వర్సెస్ సూర్య' చిత్రాలు కూడా అనుకున్న సమయానికి రాకుండా వాయిదా పడినా సరే, బాక్సాఫీస్ దగ్గర మాత్రం నిఖిల్ కు మంచి వసూళు తెచ్చిపెట్టాయి. ఈ క్రమంలో నిఖిల్ సినిమాల వాయిదా అనేది ఒక పాజిటివ్ సైన్ గా మారిపోయింది. ముఖ్యంగా 'అర్జున్ సురవరం' సినిమా పరిస్థితి చూస్తే ఈ సెంటిమెంట్ ఎంత స్ట్రాంగ్ గా ఉందో అర్థమవుతుంది.

దాదాపు ఏడాదిన్నర కాలం వాయిదా పడుతూ వచ్చిన ఈ మూవీ, చివరికి థియేటర్లలోకి వచ్చి హిట్ టాక్ సొంతం చేసుకుంది. ఆ తర్వాత పాన్ ఇండియా రేంజ్ లో హిట్ అయిన 'కార్తికేయ 2' కూడా అనేకసార్లు వాయిదా పడి రిలీజ్ అయ్యింది. ఫలితం ఏంటో మనందరికీ తెలిసిందే. అలాగే 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', '18 పేజెస్' కూడా ఇదే బాటలో నడిచి నిఖిల్ ఖాతాలో హిట్లుగా చేరాయి. ప్రస్తుతం నిఖిల్ తన 20వ చిత్రం 'స్వయంభూ'తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. పీరియడ్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ సినిమా ఫిబ్రవరిలో రిలీజ్ కావాల్సి ఉన్నా, గ్రాఫిక్స్ పనుల కోసం ఏప్రిల్ 10కి వాయిదా పడింది. గ్రాండ్ విజువల్స్ కోసం మేకర్స్ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు నిఖిల్ పాత సెంటిమెంట్?ను గుర్తు చేస్తోంది. సినిమా లేట్ అయింది కాబట్టి ఈసారి కూడా పక్కా హిట్ కొట్టబోతున్నారనే చర్చ ఫిలిం నగర్ సర్కిల్స్లో మొదలైంది. ఈ సెంటిమెంట్ వెనుక అసలు రహస్యం నిఖిల్ తీసుకునే జాగ్రత్తలే అని చెప్పాలి. సినిమా అవుట్?పుట్ సంతృప్తికరంగా లేకపోతే ఆయన రిలీజ్ చేయడానికి అస్సలు ఒప్పుకోరు. క్వాలిటీ కోసం ఎంత కాలమైనా వెయిట్ చేయడం ఆయనకు అలవాటు. అందుకే లేట్ అయినా సరే, థియేటర్లో ఆడియన్స్ కు ఒక పర్ఫెక్ట్ సినిమా అందుతుంది. నేటి జనరేషన్ ఆడియన్స్ కూడా కంటెంట్ బాగుంటే సినిమా ఎప్పుడు వచ్చినా ఆదరిస్తారని నిఖిల్ సినిమాలు ప్రూవ్ చేస్తున్నాయి.

సమ్మర్ కానుకగా ఏప్రిల్ 10న రాబోతున్న 'స్వయంభూ'పై భారీ అంచనాలు ఉన్నాయి. గ్రాఫిక్స్ కోసం తీసుకున్న ఈ ఎక్స్?ట్రా టైమ్ సినిమాకు ఏ రేంజ్ లో హెల్ప్ అవుతుందో చూడాలి. నిఖిల్ తన కెరీర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ తో తీస్తున్న ఈ మూవీ, తన డిలే సెంటిమెంట్ ను కంటిన్యూ చేస్తూ మరోసారి రికార్డులు తిరగరాయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఈ వారియర్ కథ ఏప్రిల్ లో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టిస్తుందో వేచి చూడాలి.

# ఈ ఏడాది మిల్కీ బ్యూటీకి కలిసొచ్చేలా ఉందే!

మిల్కీ బ్యూటీ తమన్నా గత కొంతకాలంగా సరైన అవకాశం లభించక ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా స్పెషల్ సాంగ్ లు చేస్తూ వాటికే పరిమితం అయిపోతుందేమో అనే అనుమానాలు కూడా వ్యక్తం అయ్యేలా చేసింది .ఇక ఇప్పుడు తాజాగా తన రూట్ మార్చుకుంది ఈ ముద్దుగుమ్మ. అందులో భాగంగానే ఒక్కో అడుగు వేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ మళ్లీ తిరిగి తన పూర్వ వైభవాన్ని దక్కించుకునే ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే తాజాగా కోలీవుడ్ లో సుందర్ సి దర్శకత్వంలో విశాల్ హీరోగా వస్తున్న 'పురుషన్' అనే సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని తెలుగులో 'మొగుడు' అంటూ రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా నుండి విడుదల చేసిన టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. అయితే ఇప్పుడు సౌత్ లోనే కాకుండా నార్త్ లో కూడా ఏకంగా ఇద్దరు స్టార్ హీరోల చిత్రంలో అవకాశం దక్కించుకున్నట్లు సమాచారం. తాజాగా బాలీవుడ్ మీడియా కథనాల నుండి



వెలువడుతున్న సమాచారం ప్రకారం.. ప్రముఖ బాలీవుడ్ స్టార్ హీరోలైన సంజయ్ దత్, అజయ్ దేవగన్ కాంబినేషన్లో వస్తున్న 'రేంజర్' అనే సినిమాలో తమన్నా అవకాశం దక్కించుకుంది. ఈ సినిమా పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్టైనర్ గా హై వోల్టేజ్ సన్నివేశాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని దర్శకుడు లవ్ రంజన్ నిర్మిస్తున్నారు. తమన్న పాత్ర శక్తివంతంగా అటు నటనకు ప్రాధాన్యత ఉండే పాత్ర కావడంతో ఈ సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. యాక్షన్ ఓరియంటెడ్ మూవీ గా వస్తున్న ఈ చిత్రంలో స్టార్ తారాగణం భాగమవుతుండడంతో రేంజర్ ఇప్పటికే అందరి దృష్టిని ఆకట్టుకుంది. మరి ఇలాంటిలో సినిమాలో అవకాశం దక్కించుకోవడంతో తమన్నా తిరిగి పూర్వ వైభవాన్ని అందుకుంటుందా అనే కామెంట్లు వ్యక్తం అవుతున్నాయి. ఒకప్పుడు స్టార్ హీరోయిన్గా ఇండస్ట్రీని ఒక ఊపు ఊపిన ఈమె.. ఇప్పుడు మళ్లీ ఆ స్టార్ స్టేటస్ కోసం తెగ ప్రయత్నాలు చేస్తోంది. మరి ఈ సినిమాతో తమన్నా తన పూర్వ వైభవాన్ని తిరిగి దక్కించుకుంటుందో లేదో చూడాలి. తమన్నా విషయానికి వస్తే.. 2005లో చాంద్ షా రోషన్ చెహ్రా సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైంది. అయితే ఈ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. ఆ తర్వాత కొన్ని ఆల్బమ్ సాంగ్స్ లో కనిపించిన ఈమె.. 2006లో శ్రీ అనే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. అదే ఏడాది కేడీ సినిమాతో తమిళ సినీ రంగంలోకి కూడా అడుగుపెట్టింది. 2007లో వచ్చిన హ్యాపీడేస్ చిత్రంతో తన కెరీర్ లో మళ్లీ వెనుతిరిగి చూసుకోలేదు.. అలా వరుసగా రామ్ చరణ్, అల్లు అర్జున్ , ప్రభాస్ , ఎన్టీఆర్ వంటి స్టార్ హీరోలతో జతకట్టి స్టార్ హీరోయిన్గా పేరు దక్కించుకుంది. అంతేకాదు ఒకానొక సమయంలో అత్యధిక రెమ్యూనరేషన్ తీసుకున్న హీరోయిన్గా కూడా గుర్తింపు దక్కించుకుంది. అయితే ఈ మధ్యకాలంలో స్పెషల్ సాంగ్ లలో అలరిస్తున్న తమన్న మళ్లీ హీరోయిన్గా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయ్యింది.

# డిప్రెషన్ లోకి వెళ్లిపోయా.. ఆ నరకం నుండి బయటపడ్డానికి ఇన్నాళ్లు పట్టింది!

భూమి పెడ్నేకర్ ఇటీవల 'ది రాయల్స్' సిరీస్లో ఇషాన్ ఖట్టర్తో కలిసి నటించిన తర్వాత ఒక్కసారిగా సినిమాలకు విరామం ప్రకటించింది. ఇది ఏదో ప్రచార చిత్రం కోసం చేసిన పని కాదని ఆమె స్పష్టం చేసింది. గత ఏడాది జూన్ నుంచే తాను ఈ విరామంలో ఉన్నట్లు తాజాగా వెల్లడించింది. వరుస సినిమాలతో బిజీగా ఉ ఒడకుండా, అసలు తనకంటూ కొంత సమయం కేటాయించుకోవాలనే ఉద్దేశంతోనే ఆమె ఈ నిర్ణయం తీసుకుంది. గ్లామర్ ప్రపంచంలో ఎప్పుడూ లైమ్ లైట్లో ఉండాలనుకునే వారికి భూమి తీసుకున్న ఈ నిర్ణయం ఒక పెద్ద సంచలనంగా మారింది. ఈ విరామానికి ప్రధాన కారణం సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న విపరీతమైన ట్రోలింగ్ అని భూమి బహిరంగంగానే అంగీకరించింది. నిరంతరం విమర్శలు, నెగెటివిటీ మధ్య పని చేయడం వల్ల మానసిక సమతుల్యత దెబ్బతింటుందని భావించిన ఆమె, వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యతనిస్తూ సైలెంట్?గా తప్పుకుంది. ఎటువంటి గొడవలు, డ్రామాలకు తావు



లేకుండా ప్రైవేట్గా గడపడం వల్ల తనపై తనకు నమ్మకం పెరిగిందని, భావోద్వేగపరంగా మళ్ళీ స్థిరపడగలిగానని ఆమె పేర్కొంది. 'ది రాయల్స్'లో తన నటనకు వచ్చిన ప్రశంసలు ఈ కష్టకాలంలో తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయని ఆమె సంతోషం వ్యక్తం చేసింది. ఈ విరామం విషయంలో భూమి ఎంత సీరియస్గా ఉందో చెప్పడానికి ఒక ఉదాహరణే ఆమె తీసుకున్న ఆర్థిక నిర్ణయాలు. సాధారణంగా ఏ నటి అయినా వచ్చిన అవకాశాలను వదులుకోవడానికి ఇష్టపడదు, కానీ భూమి మాత్రం తాను అప్పటికే తీసుకున్న సైనింగ్ అమౌంట్లను నిర్మాతలకు తిరిగి ఇచ్చేసింది. అంతేకాకుండా, కొత్త ప్రాజెక్టుల కోసం వచ్చిన చెక్కులను కూడా సున్నితంగా తిరస్కరించింది. ఇలా చేయటం ఆమె వ్యక్తిత్వంకు నిదర్శనం. తాను మానసికంగా సిద్ధంగా లేనప్పుడు ఏ సినిమాకు కమిట్ అవ్వడం సరికాదని ఆమె భావించింది. ఈ పని ఆమె వృత్తి పట్ల ఉన్న నిబద్ధతను, నిజాయితీని చాటి చెబుతోంది. తనను తాను మళ్ళీ కొత్తగా ఆవిష్కరించుకోవడానికి ఈ విరామం ఒక రీసెట్ బటన్లా పనిచేస్తుందని ఆమె నమ్ముతోంది. ఇక భూమి త్వరలో ప్రైమ్ వీడియో వెబ్ సిరీస్ దల్దల్లో కనిపించనుంది. ఆమె ఇంతకూ మునుపు మరో ప్రాజెక్ట్ను కూడా పూర్తి చేసింది. ఇప్పుడు ఆమె తదుపరి చిత్రాలకు,వెబ్ సిరీస్ కు ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో చూడాలి. గ్లామర్ రంగంలో ఉంటూ నెగెటివిటీని తట్టుకుని నిలబడటం కత్తిమీద సామే. కానీ భూమి పెడ్నేకర్ లాగా తన మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ సినిమాలకు, డబ్బుకు దూరంగా ఉండటం నిజంగా గొప్ప విషయం. ఇది ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536